ఆదివారం
13-7-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 292
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఐదు నగరాలకు 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, గుంటూరుకు ఈ అవార్డులు దక్కాయి. జాతీయస్థాయిలో స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డును విశాఖ నగరం దక్కించుకుంది. రాష్ట్రస్థాయిలో మినిస్టీరియల్ అవార్డుకు రాజమహేంద్రవరం ఎంపికైంది. స్వచ్ఛ సూపర్‌లీగ్ సిటీస్ విభాగంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు ఎంపికయ్యాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్

- మిగతా 2 లో

ధవళేశ్వరం వద్ద గోదావరి పరవళ్లు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం రూరల్/కడియం : ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న అతి భారీ వర్షాలకు గోదావరిలోకి వరద నీరు భారీగా చేరుతుంది. అలాగే సీలేరు నుంచి వస్తున్న జలాలు కలవడంతో ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గోదావరి నదిలో శనివారం సాయంత్రం 6 గంటలకు 10.60 అడుగులకు నీటిమట్టం చేరింది. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ 175 గేట్ల నుంచి 5,29,209 క్యూసెక్కుల వరద నీటిని సముద్ర జల్లాల్లోకి విడుదల చేస్తున్నారు.



ఆగస్టు 1 నుంచి సుంకాల మోత

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ సుంకాల మోత మోగించారు. మెక్సికోతోపాటు ఈయూ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 30 శాతం సుంకాలు విధించిన ఆయన... ఆగస్టు 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయెన్, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌కు లేఖలు రాశారు. అమెరికాలోకి ఫెంటానిల్‌తోపాటు అక్రమ వలసదారులను నిరోధించడంలో మెక్సికో సాయపడిందని ఆ దేశ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మాకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వండి, లేదా భూములు ఇవ్వండి, తప్పకుండా మీరు చెప్పినట్టు ముగ్గురేసి పిల్లల్ని కంటాం!

పరస్పర గౌరవంతోనే అభివృద్ధి

సీఎంతో మహేంద్ర దేవ్ భేటీ

విశాలాంధ్ర-హైదరాబాద్: సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. శనివారం సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీ హిల్స్ నివాసంలో ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్.మహేంద్ర దేవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లే అంశంపై చర్చ జరిగింది. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, పారిశ్రామిక రంగంతో పాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. సముచితమైన అవకాశాలు కల్పిస్తేనే రాష్ట్రానికి కంపెనీలు వస్తాయన్నారు. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్ నిర్మిస్తామని, దానికి అనుసంధానంగా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. అధిక వడ్డీలకు తీసుకున్న

- మిగతా 2 లో

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ: ఈసీ

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై (ఎస్ఐఆర్)పై కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ఆగస్టులో ఓటర్ల జాబితా సవరణ ప్రారంభించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. బీహార్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఇప్పటికే పెద్దఎత్తున విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి.

ప్రత్యేక సవరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూనే ఈసీకి సుప్రీంకోర్టు కొన్ని సూచనలు చేసింది. బీహార్ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఇదే ప్రక్రియ చేపట్టనుందని ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాలే కాకుండా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సిద్ధమవుతున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఆయా రాష్ట్రాల ఎన్నికల సంఘం అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు ఈసీ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి షెడ్యూల్‌ను త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

న్యాయ వ్యవస్థకు సవాళ్లు

నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో సీజేఐ బీఆర్ గవాయ్

విశాలాంధ్ర-హైదరాబాద్: భారత న్యాయ వ్యవస్థ చాలా భిన్నమైన సవాళ్లను ఎదుర్కొంటున్నదని, దాన్ని సరి చేయాల్సిన అవసరం ఉందని సీజేఐ బీఆర్ గవాయ్ అన్నారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవం శనివారం హైదరాబాద్‌లోని షామీర్ పేట్‌లోని జస్టిస్ సిటీ క్యాంపస్‌లో జరిగింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, సుప్రీం కోర్టు న్యాయ మూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ ఛాన్సలర్ జస్టిస్ సుజోయ్ పాల్ అధ్యక్షత వహించారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు తన ప్రారంభోపన్యాసంలో వార్షిక నివేదికను, గత సంవత్సరం విశ్వవిద్యాలయం సాధించిన విద్యా విజయాలను సమర్పించారు. విద్యా నైపుణ్యం, రాజ్యాంగ విలువలు, సమ్మిళిత వృద్ధికి నల్సార్ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. నల్సార్ ఇటీవలే ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టం కింద ప్రత్యేక కోర్టులను ఆధునీకరించడంపై సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖతో కలిసి పని చేసిందని వివరించారు. నల్సార్‌కు నిరంతర మద్దతు ఇస్తున్న తెలంగాణ

- మిగతా 2 లో

ఇంధన స్విచ్ విఫలం

పైలట్లపై నెపం నెట్టే ప్రయత్నమా?

ఎయిరిండియా దుర్ఘటనపై ప్రాథమిక నివేదిక

ముంబై: అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక తాజాగా బహిర్గతమైంది. మొత్తం 15 పేజీలతో రూపొందించిన ఈ నివేదికలో దుర్ఘటనకు సంబంధించి కీలక విషయాలు వెల్లడించారు. ప్రమాదం వెనక ఎలాంటి కుట్ర కోణం లేదని, పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కనిపించలేదని ప్రాథమికంగా నిర్ధారించారు. 'విమానం ప్రయాణించిన మార్గానికి సమీపంగా పక్షులు ఎగరలేదు. పక్షి ఢీకొన్న ఆనవాళ్లను కూడా గుర్తించలేదు' అని ఏఏఐబీ నివేదిక వెల్లడించింది. అంతేగాకుండా ఘటన వెనక విద్రోహ చర్య ఉండే అవకాశముందని చెప్పేందుకు ఎలాంటి ఆధారాల్లేవని తెలిపింది. ఇంజిన్ ఇంధన కంట్రోల్ స్విచ్ ఆగిపోవడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ప్రాథమిక నివేదికలోని మరిన్ని అంశాలను పరిశీలిస్తే... సెకను తేడాతో రెండు ఇంజిన్ ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఒకదాని తర్వాత ఒకటి ఆగిపోయాయి. వాటిని తిరిగి రన్ చేసేందుకు పైలట్లు ప్రయత్నించారు. ఒకటి పాక్షికంగా పనిచేయగా... రెండోది రికవరీ అవడంలో విఫలమైంది. ప్రమాద సమయంలో థ్రస్ట్ లివర్లు పనిచేయనట్లుగా అనిపించాయి. కానీ, బ్లాక్‌బాక్స్ డేటా పరిశీలిస్తే థ్రస్ట్ పని చేసేందుకు ప్రయత్నించినట్లు కనిపించింది. దీన్నిబట్టి చూస్తే సాంకేతిక వైఫల్యం

- మిగతా 2 లో

గగన్‌యాన్ కీలక పరీక్ష
విజయవంతం

బెంగుళూరు: గగన్‌యాన్ మిషన్‌కు సంబంధించి కీలక పరీక్షను ఇస్రో విజయవంతంగా పూర్తి చేసింది. సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను పూర్తిగా అభివృద్ధి చేసిన ఇస్రో... క్వాలిఫికేషన్ టెస్ట్ ప్రోగ్రామ్ ద్వారా సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను సమగ్రంగా పరీక్షించింది. ఎస్ఎంపీఎస్‌కు చెందిన 350 సెకన్ల ఫుల్ డ్యూరేషన్ హాట్ టెస్ట్‌ను శుక్రవారం పూర్తి చేశారు. గగన్‌యాన్ మిషన్ ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపేందుకు ఇస్రో ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. హాట్ టెస్ట్ సమయంలో ప్రొపల్షన్ సిస్టమ్ పర్ఫార్మెన్స్ సాధారణంగా సాగిందని ఇస్రో శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. గగన్‌యాన్‌కు చెందిన సర్వీస్ మాడ్యూల్‌ను ప్రొపల్షన్ సిస్టమ్ ద్వారా రెగ్యులేట్ చేస్తారు. కక్ష్యలో పరిభ్రమణ దీని మీదే ఆధారపడి ఉంటుంది. ఆర్బిట్ సర్క్యులేషన్, ఆన్ ఆర్బిట్ కంట్రోల్, డీబూస్ట్ మాన్యువరింగ్ లాంటి ప్రక్రియలన్నీ సర్వీస్ మాడ్యూల్ చూసుకుంటుంది. ఆర్బిట్ సర్క్యులేషన్, డీబూస్ట్ దశల్లో లిక్విడ్ అపోజీ

- మిగతా 2 లో

పేదలు... శ్రామికులకు
ఎర్రజెండానే అండ

విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం: పేదలు... శ్రామికులకు ఎర్ర జెండానే అండగా నిలిచిందని, వారి హక్కులు, సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక లారీ అసోసియేషన్ హాల్‌లో సీపీఐ పాల్వంచ పట్టణ 19వ మహాసభను శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత మహాసభలు ప్రారంభ సూచికగా పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో కూనంనేని మాట్లాడుతూ పాల్వంచ సమగ్రాభివృద్ధి తోపాటు పారిశ్రామికీకరణలో సీపీఐ పెద్దన్నపాత్ర పోషించిందన్నారు. వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో పార్టీ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న చరిత్ర ఉందన్నారు. పోరాటాలు,

- ▸ హక్కులు, సమస్యలపై నిరంతర పోరు
- ▸ పాల్వంచ సమగ్రాభివృద్ధికి సీపీఐ పెద్దన్నపాత్ర
- ▸ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా: కూనంనేని

త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని అన్నారు. నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సీపీఐ... ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. కార్మిక, కర్షక, ప్రజల కోసం, ప్రజా హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేసే సత్తా కమ్యూనిస్టులకే ఉందని పునరుద్ఘాటించారు. దేశ స్వాతంత్ర్య కోసం, పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై అవిశ్రాంతంగా ఉద్యమాలు చేసి ప్రజా చైతన్యాన్ని రగిలించిన సీపీఐ... ఎన్నో త్యాగాలు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణలో అప్పటి రజాకార్ల, భూస్వాముల, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి దొరలను, దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టి బడుగు, బలహీన జీవులతో తుపాకులు పట్టించి గెరిల్లా రైతాంగ పోరాటం నడిపించిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. ఇలాంటి గొప్ప చరిత్ర ఉన్న పార్టీలో ఉన్న మనం ప్రజల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు బలోపేతం చేసే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని

- మిగతా 2 లో

సీతారామ ప్రాజెక్టు నీటి విడుదల

బిజీ కొత్తూరు పంపు నుంచి సాగర్ ఆయకట్టుకు నీరు

విశాలాంధ్ర-కొత్తగూడెం అర్బన్ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి జిల్లా రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు నీటిని సరఫరా చేయిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. దీంతో ఖమ్మం జిల్లా సాగర్ ఆయకట్టు రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా సీతారామ ప్రాజెక్టు ద్వారా బీజీ కొత్తూరు వద్ద మొదటి పంపు నుంచి సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయించారు. ఉమ్మడి జిల్లాలో సాగునీరు అందక నారుమళ్లు, తడి లేక పొలాలు ఎండిపోతున్న తరుణంలో మంత్రి తుమ్మల పంటకు గోదావరి నీరు విడుదల చేయించి రైతన్నలకు కొండంత భరోసా కల్పించారు. ఈ ఏడాది వర్షాకాలం చాలా ముందుగానే వచ్చిందని నమ్మి రైతాంగం సాగుకు ముందుగానే సిద్ధమైంది. ఊహించని పరిణామంతో వర్షాలు ఏ మాత్రం కురవకపోగా వేసిన విత్తనాలు మొలవక నారుమళ్లు ఎండి పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో తుమ్మల ప్రత్యేక శ్రద్ధతో గోదావరి జలాలు విడుదల చేయాలని నిర్ణయించి రెండు జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు ఇప్పించారు. సీతారామ ప్రాజెక్టు నుంచి నీటిని ఖమ్మం జిల్లాలోని నాగార్జున సాగర్ ఆయకట్టుకు విడుదలపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు కలెక్టర్లతో తుమ్మల మాట్లాడి నీరు విడుదల చేయించారు. ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధిలో వైరా, సత్తుపల్లి, వర్షాధారం మీద ఆధారపడిన అశ్వరావుపేట, కొత్తగూడెం, పినపాక నియోజకవర్గాల పరిధిలోని లక్షలాది ఎకరాలకు గోదావరి జలాలు అందించి తమ పొలాలకు తుమ్మల ఊపిరి పోశారని రైతాంగం నుంచి కృతజ్ఞతలు వ్యక్తమవుతున్నాయి. సాగర జలాలపై భరోసాతో రైతాంగం లక్షలాది ఎకరాల్లో నారుమళ్లు పోశారు. సాగర్ నీరు కొంత ఆలస్యం అయ్యే పరిస్థితులు ఏర్పడటంతో భద్రాద్రి జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు రైతులకు వరంగా మారింది.

కమ్యూనిస్టు పోరాటయోధుడు
దొడ్డా నారాయణరావు కన్నుమూత

విశాలాంధ్ర - హైదరాబాద్ : కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు (96)... తన స్వగ్రామమైన సూర్యాపేట జిల్లా చిలుకూరులో శుక్రవారం రాత్రి కన్నుమూశారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస విడిచే వరకు ఆయన పనిచేశారు. ఆయన 1940వ దశకంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు. నారాయణరావు ... 1998-2001 మధ్య సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శిగాను, 2001 నుంచి 2009 మధ్య రైతు సంఘం నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 1995-98లో నల్లగొండ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శిగా, 1959 నుంచి 1984 వరకు చిలుకూరు సర్పంచ్‌గా సుమారు 25 సంవత్సరాలపాటు గ్రామాభివృద్ధికి కృషి చేశారు. చిలుకూరు మండల అధ్యక్షుడిగా 1986 నుంచి 1996 వరకు రెండు సార్లు పనిచేశారు. సింగల్ విండో చైర్మన్‌గా, గ్రంథాలయ చైర్మన్‌గా, నల్లగొండ డీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఏడు దశాబ్దాలు ప్రజాసేవలో నిమగ్నమయ్యారు. చిలుకూరులో 1941లో జరిగిన ఎనిమిదవ ఆంధ్ర మహాసభలో సోదరుడు దొడ్డ నరసయ్యతో కలిసి భూస్వాములు, జాగీర్‌దారి,

- మిగతా 2 లో

నిబంధనలు పాటించకుంటే బహిష్కరణ: అమెరికా

వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అమెరికా హెచ్చరించింది. ఈ మేరకు భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. 'వీసా మంజూరుతోనే వలసదారులపై స్క్రీనింగ్ ఆగిపోదు. వారి ప్రతి కదలికను నిశితంగా గమనిస్తూనే ఉంటాం.

2 లో

ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ వేగవంతం

అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం

నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణ, సహాయ - పునరావాస పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సరైన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగాలన్నారు.

2 లో

600 డ్రోన్లతో రష్యా భీకర దాడి

ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలు ధ్వంసం

2 లో

విశాలాంధ్ర
ప్రపంచం
2
హైదరాబాద్
ఆదివారం
13 జులై 2025

నిబంధనలు పాటించకుంటే బహిష్కరణ: అమెరికా

న్యూఢిల్లీ: వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అమెరికా హెచ్చరించింది. ఈ మేరకు భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. 'వీసా మంజూరుతోనే వలసదారులపై స్క్రీనింగ్ ఆగిపోదు. వారి ప్రతి కదలికను నిశితంగా గమనిస్తూనే ఉంటాం. అమెరికా చట్టాలు, ఇమిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు తప్పనిసరిగా పాటించాల్సిందే. వాటిని అతిక్రమిస్తే మాత్రం తక్షణం వీసాలు రద్దు చేసి దేశం నుంచి వెళ్లగొడతాం' అని ఎంబీసీ తమ పోస్ట్‌లో స్పష్టంచేసింది. వీసా దరఖాస్తుదారులు తప్పనిసరిగా తమ ఐదేళ్ల సోషల్ మీడియా ఖాతాలను సమర్పించాల్సి ఉంటుందని ఇటీవల అమెరికా వెల్లడించింది. ఫేస్‌బుక్, లింక్డిన్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలనూ, అందులో అభ్యర్థులు చేసిన పోస్టులు, కామెంట్లు, వెల్లడించిన అభిప్రాయాలనూ అగ్రరాజ్య అధికారులు పరిశీలిస్తారు. అలా అని వాటిలో ఉన్న పోస్టులు ఏవీ ఇప్పుడు తొలగించడానికి వీల్లేదు. ఒకవేళ అలా చేసినట్టు కనిపిస్తే పరిశీలన మరింత లోతుగా వెళ్లి తనిఖీ చేసే అవకాశం ఉంటుంది. ఈ వివరాలను ఇవ్వకపోతే వీసా తిరస్కరిస్తారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకమైన ఆలోచనలు ఉన్నట్టు కనిపించిన వ్యక్తులను దేశంలోకి రాకుండా చూడటం కోసం ఈ 'సోషల్ మీడియా వెట్టింగ్'ను అగ్రరాజ్యం తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వలసదారులపై కఠిన వైఖరి అనుసరిస్తున్నారు.

600 డ్రోన్లతో రష్యా భీకర దాడి

ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలు ధ్వంసం

మాస్కో: ఉక్రెయిన్‌పై రష్యా భారీ స్థాయిలో దాడులు కొనసాగిస్తోంది. తాజాగా కీవ్‌లోని ఆయుధ పరిశ్రమలపై మాస్కో 600 డ్రోన్లు, క్షిపణులతో వైమానిక దాడులకు పాల్పడింది. ఉక్రెయిన్‌కు చెందిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ కేంద్రాలు, సైనిక వైమానిక స్థావరాలపైనా దాడులు నిర్వహించినట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో కొంతమంది ప్రాణాలు కోల్పోగా... నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు, విశ్వవిద్యాలయాలు దెబ్బతిన్నాయి. పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. రష్యా ప్రయోగించిన 319 డ్రోన్‌లు, 25 క్రూజ్ క్షిపణులను నేలకూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడించింది. కీవ్ చేపట్టిన ఎదురు దాడుల్లో మాస్కోలోని పలు భవనాలు ధ్వంసమయ్యాయి. తమతో జరుగుతున్న యుద్ధంలో రష్యా వాడుతున్న 40 శాతం బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలు ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపించిన కొన్ని గంటల్లోనే పుతిన్ సేనలు ఈ దాడులకు పాల్పడడం గమనార్హం. పుతిన్ సేనలు కొనసాగిస్తున్న యుద్ధానికి గట్టిగా బదులు చెప్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శుక్రవారం పేర్కొన్నారు. యుద్ధం విషయంలో త్వరగా ఓ నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు తాత్కాలికంగా నిలిపివేసిన కొన్ని ఆయుధాల సరఫరాను తిరిగి ప్రారంభించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ఇందులో 155 ఎంఎం మందుగుండు సామాగ్రితో పాటు జీఎంఎల్ఆర్ఎస్‌గా పిలిచే ప్రెసిషన్ గైడెడ్ రాకెట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

రష్యాకు 40 శాతం ఉత్తరకొరియా ఆయుధాలు: ఉక్రెయిన్

కీవ్: తమపై జరుగుతున్న యుద్ధంలో వాడే 40 శాతం ఆయుధాలు ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ మిలిటరీ ఇంటెలిజెన్స్ అధ్యక్షుడు కైరులా బుడనోవ్ ఆరోపించారు. గతేడాది రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ల మధ్య జరిగిన మిలిటరీ ఒప్పందంలో భాగంగా ఉత్తరకొరియా అనేక బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలను మాస్కోకు చేరవేస్తున్నట్లు తెలిపారు. దీనికి బదులుగా రష్యా నుంచి పెద్దమొత్తంలో నగదు, టెక్నాలజీని ఉత్తరకొరియా పొందుతున్నట్లు వెల్లడించారు. ఈసందర్భంగా కాల్పుల విరమణ ఒప్పందం వీలైనంత త్వరగా జరగాలని బుడనోవ్ ఆశాభావం వ్యక్తంచేశారు. యుద్ధంలో రష్యాకు బేషరతుగా మద్దతిస్తున్నట్లు కిమ్ ఇప్పటికే ప్రకటించారు. మిలిటరీ ఒప్పందం నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సైనిక సంబంధాలు తీవ్రంగా బలపడ్డాయి. ఈ క్రమంలో మరో 30 వేల మంది సైనికులను మాస్కోకు మద్దతుగా పంపేందుకు కిమ్ సిద్ధమైనట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. గతేడాది కుర్స్క్ ప్రాంతంలోకి ఉక్రెయిన్ సేనలు చొచ్చుకురావడంతో... నవంబరులో దాదాపు 11 వేల మంది సైనికులను కిమ్ ప్రభుత్వం పంపించింది. ఇదిలాఉండగా... రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య కాల్పుల విరమణకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. పలుమార్లు పుతిన్‌తోనూ ఫోన్లో మాట్లాడారు. అయినప్పటికీ ఈ చర్చలు ముందుకు సాగకపోవడంపై ఆయన అసంతృప్తికి గురయ్యారు. కాగా... అమెరికా సైనిక ఆయుధ నిల్వలు తగ్గాయనే ఆందోళనల నేపథ్యంలో గతంలో ఆమోదించిన కీలక ఆయుధాల సరఫరాను అమెరికా ఉక్రెయిన్‌కు నిలిపివేసినట్లు గతంలో ట్రంప్ పేర్కొన్నారు. ఆ నిర్ణయంపై యూటర్న్ తీసుకున్న ట్రంప్ ... పుతిన్ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నందున కీవ్‌కు ఆయుధాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

హత్యాచారం నిందితుడికి మరణశిక్ష

టెహ్రాన్: ఓ బాలికపై హత్యాచారం చేసిన కేసులో నిందితుడిగా తేలిన వ్యక్తికి ఇరాన్ అధికారులు బహిరంగంగా మరణశిక్ష విధించారు. ఈమేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. బుకాన్‌కు చెందిన ఓ బాలికపై అత్యాచారం, హత్య చేసిన కేసులో ఓ వ్యక్తి దోషిగా తేలాడు. అతడికి బహిరంగంగా మరణశిక్ష విధించాలని బాధిత కుటుంబసభ్యులు, ప్రజల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వచ్చాయి. మార్చిలో అతడికి మరణశిక్ష ఖరారు కాగా.. సుప్రీంకోర్టు కూడా దాన్ని సమర్థించింది. భావోద్వేగాలతో ముడిపడిన కేసు కాబట్టి కఠినశిక్షపై నిర్ణయం తీసుకున్నామని న్యాయమూర్తి పేర్కొన్నారు. బాధిత కుటుంబసభ్యుల కోరిక మేరకు శిక్షను విధిస్తున్నట్లు చెబుతూ తాజాగా దాన్ని అమలు చేశారు. ఇరాన్‌లో బహిరంగంగా మరణశిక్షలు విధించడం సాధారణమే. హత్య, అత్యాచారం వంటి తీవ్రతమైన కేసుల్లో ఇలాంటి కఠినమైన శిక్షలను అమలుచేస్తారు. మానవ హక్కుల సంఘాల ప్రకారం... ప్రపంచంలో ఎక్కువ మరణశిక్షలు అమలుచేసే దేశాల్లో ఇరాన్ రెండో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో చైనా ఉంది.

గగన్‌యాన్ కీలక పరీక్ష విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

మోటార్ ఇంజిన్లు శక్తిని ఇస్తాయి. ఇక ఆల్టిట్యూడ్ కంట్రోల్‌ను రియాక్షన్ కంట్రోల్ సిస్టమ్ (త్రస్టర్స్) చూసుకుంటాయి. లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్... గగన్‌యాన్ ఎస్ఎంపీఎస్‌ను డిజైన్ చేసి, డెవలప్ చేసినట్లు ఇస్రో చెప్పింది. తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో పరీక్షలు జరిగాయి.

పరస్పర గౌరవంతోనే అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

రుణాలపైన సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వడ్డీల కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందన్నారు. వడ్డీలు చెల్లించడం కోసమే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయాల్సి వస్తోందని, వడ్డీ తగ్గించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

ఐదు నగరాలకు 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులు

(మొదటిపేజీ తరువాయి)

అవార్డులకు ఎంపిక కావడంపై ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ స్పందించారు. సీఎం చంద్రబాబు చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల వల్లే ఈ అవార్డులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

ఆగస్టు 1 నుంచి సుంకాల మోత

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షురాలు క్లాడియాకు రాసిన లేఖలో ట్రంప్ అంగీకరించారు. అయినప్పటికీ అమెరికాను నార్కో-ట్రాఫికింగ్ ప్లేగ్రౌండ్‌గా మారకుండా ఆపడానికి తగిన చర్యలు తీసుకోలేదన్నారు. సరిహద్దును రక్షించుకోవడంలో తమకు మెక్సికో సాయం చేస్తున్నప్పటికీ... అది తగినంతగా లేదన్నారు. మరోవైపు ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాకు రాసిన లేఖలో అమెరికా వాణిజ్య లోటు జాతీయ భద్రతకు ముప్పుగా ఉందని పేర్కొన్నారు. మరోవైపు పొరుగు దేశం కెనడా నుంచి దిగుమతయ్యే సరుకులపై 35 శాతం సుంకాలు విధించనున్నట్లు, ఇవి ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలో కుదరనుందన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటన వచ్చింది. కెనడానే కాకుండా 20 నుంచి 50 శాతం వాణిజ్య సుంకాలు విధిస్తామని పేర్కొంటూ బ్రెజిల్, జపాన్ వంటి 23 దేశాలకు ట్రంప్ ఇటీవల లేఖలు పంపిన సంగతి తెలిసిందే.

పేర్ని నానిపై కేసు నమోదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ మంత్రి పేర్ని నానిపై కృష్ణా జిల్లా అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల్లో జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశాల్లో రప్పా రప్పా అనటం కాదు... చేసి చూపించండి... అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణపై కేసు నమోదు చేశారు. పేర్ని నాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ రాష్ట్ర నేత కనపర్తి శ్రీనివాసరావు అవనిగడ్డ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ పేర్ని నాని శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. మరోవైపు పేర్ని నాని వ్యాఖ్యలపై అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లాలో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం కార్యక్రమాల్లో మాజీ మంత్రి పేర్ని నాని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

ఇంధన స్విచ్ విఫలం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నట్లు అనిపిస్తోంది. టేకాఫ్‌కు ఫ్లాప్ సెట్టింగ్, గేర్ సాధారణంగానే పని చేశాయి. వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలంగానే ఉన్నాయి. ఆకాశం స్పష్టంగా కనిపించింది. గాలులు తేలికగానే ఉన్నాయి. ఎయిరిండియా పైలట్లు ఇద్దరూ మెడికల్‌గా ఫిట్‌గానే ఉన్నారు. ఇలాంటి విమానాలు నడిపిన అనుభవం ఎక్కువగానే ఉంది. గతంలో ఈ విమానంలోని ఇంధన కంట్రోల్ స్విచ్‌లలో సమస్య వచ్చిన సందర్భాలు లేవు. ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్ లాకింగ్ మెకానిజంపై బోయింగ్ ఆప్షనల్ అడ్వైజరీ జారీ చేసింది. దీన్ని ఎయిరిండియా అనుసరించలేదు. సంబంధిత తనిఖీలు చేపట్టలేదు. విమానం థ్రాటిల్ కంట్రోల్ మాడ్యూల్స్‌ను 2019, 2023లో భర్తీ చేశారు. నివాస సముదాయాల మధ్యలో ఈ ప్రమాదం సంభవించింది. పలు భవనాలను విమానం ఢీకొట్టింది. దీంతో ఇంజిన్, ల్యాండింగ్ గేర్‌తో పాటు విమాన శిథిలాలు దాదాపు 1000 అడుగుల విస్తీర్ణంలో చెల్లాచెదురయ్యాయి. దీని ఆధారంగా ప్రమాదం చాలా తీవ్రంగా జరిగింది.

కాక్‌పిట్‌లో ఏ క్షణంలో ఏం జరిగిందంటే...

యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనపై ప్రాథమిక నివేదిక బహిర్గతమైంది. విమాన ఇంజిన్ల ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోవడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈ ఘటన చోటుచేసుకోవడానికి ముందు కాక్‌పిట్‌లో ఏ క్షణానికి ఏం జరిగిందన్న వివరాలను 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' తమ నివేదికలో వెల్లడించింది. జూన్ 12 ఉదయం 11:17 గంటలకు ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ వీటీ-ఏఎన్‌బీ విమానం దిల్లీ నుంచి అహ్మదాబాద్‌లో ల్యాండ్ అయింది. మధ్యాహ్నం 1:10:38 గంటలకు విమానాశ్రయంలోని బే 34 నుంచి బయల్దేరేందుకు సిద్ధమైంది. 1:25:15 గంటలకు ట్యాక్సీ క్లియరెన్స్ కోరగా... ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్ అనుమతించింది. నిమిషం తర్వాత విమానం బే 34 నుంచి ఆర్ 4 ట్యాక్సీవే మార్గంలో 23వ రన్‌వే పైకి చేరుకుంది. అక్కడి నుంచి టేకాఫ్‌కు సిద్ధమైంది. 1:32:03 గంటలకు విమానం గ్రౌండ్ నుంచి టవర్ కంట్రోల్‌కు మారింది. 1:37:33 గంటలకు టేకాఫ్ క్లియరెన్స్ జారీ అయింది. 1:37:37 గంటలకు విమానం టేకాఫ్ ప్రారంభించింది. 1:38:39 గంటలకు విమానం ఎయిర్/గ్రౌండ్ సెన్సార్లు ఎయిర్ మోడ్‌లోకి మారాయి. దీంతో లోహవిహంగం గాల్లోకి లేచింది. 1:38:42 గంటలకు విమానం గరిష్ఠ వేగమైన 180 నాట్స్‌ను అందుకుంది. ఆ మరుక్షణమే ఇంజిన్ 1, ఇంజిన్ 2కు చెందిన ఇంధన స్విచ్‌లు 'రన్' నుంచి 'కటాఫ్' పొజిషన్‌కు మారాయి. ఒక సెకను తేడాతో ఈ రెండు ఒకదాని తర్వాత ఒకటి ఆగిపోయాయి. ఇంజిన్లకు ఇంధన సరఫరా ఆగిపోవడంతో ఇంజిన్లు రెండూ టేకాఫ్ వేగం నుంచి తగ్గుతూ వచ్చాయి. స్విచ్‌లు ఎందుకు ఆపారంటూ ఒక పైలట్ మరో పైలట్‌ను ప్రశ్నించినట్లు కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో ఉంది. తాను చేయలేదని మరో పైలట్ సమాధానమిచ్చారు. ఎయిర్‌పోర్టు పెరీమీటర్ గోడను దాటిన వెంటనే విమానం ఎత్తు తగ్గుతూ కిందకు రావడం సీసీటీవీ దృశ్యాల్లో రికార్డయింది. 1:38:47 గంటలకు మొదటి ఇంజిన్ ఇంధన స్విచ్ 'కటాఫ్' నుంచి మళ్లీ 'రన్'కు మారింది. 1:38:56 గంటలకు రెండో ఇంజిన్ ఇంధన స్విచ్ కూడా 'కటాఫ్' నుంచి మళ్లీ 'రన్'కు మారింది. ఇంజిన్ కంట్రోల్ స్విచ్‌లను 'కటాఫ్' నుంచి 'రన్'కు మార్చినప్పుడు ప్రతి ఇంజిన్ 'ఫుల్ అథారిటీ డ్యూయల్ ఇంజిన్ కంట్రోల్' ఆటోమేటిక్‌గా రీలైట్ చేస్తుంది.

అప్పుడు ఇంధనం వచ్చి థ్రస్ట్ రికవరీ అవుతుంది. ఈ విమానంలో మొదటి ఇంజిన్ తిరిగి ఆన్ అవడం ప్రారంభించింది. కానీ, రెండో ఇంజిన్ మాత్రం నిర్దిష్ట వేగాన్ని అందుకునేలా చేయలేకపోయింది. 1:39:05 గంటలకు పరిస్థితిని అర్థం చేసుకున్న పైలట్ 'మేడే మేడే మేడే' అనే సందేశం పంపించారు. 1:39:11 గంటలకు డేటా రికార్డింగ్ ఆగిపోయింది. 1:44:44 గంటలకు క్రాష్ ఫైర్ టెండర్లు సహాయక చర్యల నిమిత్తం ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరాయని నివేదిక వివరించింది.

ఇప్పుడే ఏ నిర్ణయానికి రావొద్దు: కేంద్ర మంత్రి

విశాఖ: అహ్మదాబాద్-లండన్ ఎయిరిండియా విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఇచ్చిన నివేదికపై కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు శనివారం స్పందించారు. ప్రాథమిక ఆధారాలను పరిగణనలోకి తీసుకుని ఏఏఐబీ నివేదిక ఇచ్చిందని, దీని ఆధారంగా విమాన ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ణయానికి రాకూడదని చెప్పారు. తుది నివేదిక వచ్చేంత వరకూ వేచిచూడాలని సూచించారు. 'విమాన ప్రమాదంపై అప్పుడే తుది నిర్ణయానికి రాకూడదు. ప్రపంచంలోనే అత్యంత సమర్థత కలిగిన పైలట్లు మనకు ఉన్నారు. పైలట్లు, సిబ్బంది కృషిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. పౌర విమానయానానికి వారు వెన్నెముక వంటివారు. ఈ రంగానికి వారే ప్రధాన వనరులు. వారి సంక్షేమం, శ్రేయస్సు కోసం మా ప్రభుత్వం పనిచేస్తోంది. ఆ దృష్ట్యా ఇప్పుడే నివేదికపై తుది నిర్ణయానికి రాకూడదు. తుది నివేదిక కోసం వేచిచూద్దాం. ఇందులో కొన్ని సాంకేతిక అంశాలు కూడా ముడిపడి ఉన్నాయి' అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

న్యాయ వ్యవస్థకు సవాళ్లు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీజేఐ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ మన భారతీయ న్యాయ వ్యవస్థను సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందని, ఆ సవాళ్లకు తగినట్లు పౌరులు రాణిస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. మన దేశం, న్యాయ వ్యవస్థ... రెండూ భిన్నమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని, కొన్ని కేసుల్లో విచారణ దశాబ్దాల పాటు సాగుతుందని, కొన్నేళ్లు జైలు జీవితం అనుభవించిన తర్వాత వాళ్లు నిర్దోషులని కొన్ని కేసుల్లో తేలుతున్నాయని అన్నారు. మన వద్ద ఉన్న ఉత్తమ ప్రతిభ ఆ సమస్యలను తీర్చుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. నల్సార్‌ను ప్రత్యేకంగా చూపించేది దాని విద్యా నైపుణ్యం మాత్రమే కాదని, చట్ట విలువల పట్ల దాని లోతైన నిబద్ధత అని అన్నారు. విశ్వవిద్యాలయంలోని వివిధ పరిశోధనా కేంద్రాల పనిలో, అలాగే సామాజిక న్యాయంపై దాని బలమైన దృష్టిలో ఈ నీతి ఎలా స్పష్టంగా కనిపిస్తుందో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. న్యాయవాద వృత్తి విస్తృత పాత్రను ప్రతిబింబిస్తూ, వర్ణ వివక్ష, సామాజిక వివక్షత వంటి అణచివేత వ్యవస్థలను సవాలు చేసిన న్యాయవాదుల వారసత్వాన్ని స్వీకరించాలని ఉద్బోధించారు. పరివర్తన సాధనంగా చట్టానికి ఉన్న సామర్థ్యాన్ని పట్టభద్రులకు గుర్తు చేశారు. కేవలం ఉన్నత నైపుణ్యాల కారణంగా కాకుండా సృజనాత్మకత, నిర్మాణాత్మక వల్లే న్యాయవాద వృత్తిలో విజయం సాధ్యమని తెలిపారు. కొత్త ప్రపంచ, సాంకేతిక పరిణామాలకు ప్రతిస్పందనగా వృత్తి అభివృద్ధి చెందుతున్నప్పటికీ, బలమైన చట్టపరమైన పునాదులపై ఆధారపడి ఉండాలని కోరారు. విదేశీ డిగ్రీలను అభ్యసించే పెరుగుతున్న ధోరణిని ప్రస్తావిస్తూ... సహచరుల ఒత్తిడి కారణంగా మాత్రమే విదేశీ విద్య వైపు పోవద్దని హెచ్చరించారు. అంతర్జాతీయ అర్హత స్వయంచాలకంగా శ్రేష్ఠతకు గుర్తు కాదని ఆయన నొక్కి చెప్పారు. ఈ ధోరణి భారతీయ పోస్ట్ గ్రాడ్యుయేట్ న్యాయ విద్యపై విశ్వాసం లేకపోవడాన్ని కూడా ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఎల్ఎల్ఎం కార్యక్రమాలలో ఎక్కువ పెట్టుబడి పెట్టాలని సీజేఐ గవాయ్ సూచించారు. అంతిమంగా దేశ న్యాయ వ్యవస్థ ప్రయోజనం కోసం ఉత్తమ న్యాయవాదులను నిలుపుకోవడం, పెంపుదించుకోవల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్య అతిథిగా కాకుండా సంరక్షకుడిగా చివరి మాటలను సూచిస్తూ... స్నేహితులు, కుటుంబం, పుస్తకాలు, అభిరుచులు, ఆరోగ్యం, ఊహ అనే ఐదు ముఖ్యమైన విషయాలు ఎల్లప్పుడూ చెక్కుచెదరకుండా ఉంచాలన్నారు.

ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు, తెలంగాణ హైకోర్టు, ఆంధ్ర ప్రదేశ్ న్యాయమూర్తులు, అలాగే తెలంగాణ మంత్రులు కూడా హాజరయ్యారు. 460 డిగ్రీలు, డిప్లొమాలు, పీహెచ్‌డీ (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ), ఎల్ఎల్ఎం(మాస్టర్ ఆఫ్ లాస్), పీజీ డిప్లొమా ఇన్ టాక్సేషన్ లాస్, పీజీ డిప్లొమె ఇన్ క్రిమినల్ జస్టిస్ మేనేజ్‌మెంట్‌లకు సంబంధించి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. అలాగే 58 బంగారు పతకాలను కూడా ప్రదానం చేశారు. ఎల్ఎల్ఎంలో ముస్కాన్ కార్లా రెండు బంగారు పతకాలను గెలుచుకున్నారు. బి.హరిణి, హుజైఫా షేక్, నందిని శివేరే ఒక్కొక్కటి సాధించారు. ఎంబీఏ బీఏఎల్ఎల్‌బీలో ముస్కాన్ అల్వి బంగారు పతకం గెలుచుకున్నారు. బీఏఎల్ఎల్‌బీ ఆనర్స్‌లో ఇషికా గార్గ్ ఎనిమిది బంగారు పతకాలను, కె.ఎస్.శైలేంద్ర ఏడు బంగారు పతకాలను, అర్పిత ఆరు బంగారు పతకాలను, భవ్య నాలుగు, తేజస్వి, శ్రుతి, అఖిల్ సూర్య మూడు పతకాలను గెలుచుకున్నారు. శ్రుతి, సాన్వి రెండు చొప్పున సాధించారు. శ్రీవల్లి, అనుష్క, అరివలగన్, జాహ్నవి, ప్రద్యుమ్న, షమిక్, విష్ణు ఒక్కొక్కరు ఒక్కో బంగారు పతకం సాధించారు ఈ సందర్భంగా పిల్లల హక్కులు, తులనాత్మక క్రిమినల్ చట్టాలు, కాంట్రాక్టులపై చిత్రపరమైన హ్యాండ్‌బుక్, నల్సార్ లా సమీక్ష జర్నల్ పుస్తకాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.వాసంతి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డా నారాయణరావు కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

పెత్తందారి, దొరల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడారు. దున్నేవానికే భూమి కావాలని, వెట్టిచాకిరీ విధాలకు వ్యతిరేకంగా చురుకైన పాత్ర పోషించారు. నిజాం రాచరిక వ్యవస్థకు, రజాకార్లకు దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపుతో 1947 నుంచి 1951 వరకు నర్సయ్యతో కలిసి సాయిధ పోరాటం పాల్గొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఇండియన్ యూనియన్ సైన్యం, పోలీసు... కమ్యూనిస్టు పోరాట దళాలను అణిచివేసే క్రమంలో వారు నల్లమల అడవిలో 11 నెలలు రహస్య సాయిధ పోరాటాన్ని కొనసాగించారు. పోరాట విరమణ తర్వాత 1952లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం చీలిక సందర్భంగా 1964-67 మధ్య కొంతకాలం సీపీఎంతోను, అనంతరం 1968-71 మధ్య సీపీఐ ఎంఎల్ తోను, హుజూర్‌నగర్ ప్రాంతీయ కమ్యూనిస్టు పార్టీని 1971-73 వరకు నడుపుతూ 1974లో నర్సయ్యతో పాటు హుజూర్‌నగర్ ప్రాంతీయ కమిటీ సభ్యులంతా సీపీఐలో చేరారు. కోదాడ తాలూకా కార్యదర్శిగా, సీపీఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర సమితి సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా 2014 వరకు కొనసాగారు. ఆయనను స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తించి కేంద్రం పింఛన్ ఇస్తోంది. తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల స్మారక ట్రస్టు సభ్యులుగా ఉన్నారు.

కూనంనేని ఘననివాళి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు... సూర్యాపేట జిల్లా చిలుకూరులో శనివారం నారాయణరావు భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వగ్రామమైన చిలుకూరు సర్పంచ్‌గా 25 ఏళ్లు పనిచేశారని, ఉమ్మడి నల్గొండ జిల్లా కార్యదర్శిగా కూడా పనిచేశారని కూనంనేని గుర్తు చేశారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సంతాపం

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి రైతుసంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేసిన దొడ్డా నారాయణరావు మృతికి అఖిల భారత కిసాన్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. ఈశ్వరయ్య, కె.వి.వి.ప్రసాద్ శనివారం ఓ ప్రకటలో సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. దున్నేవానికి భూమి కావాలని, వెట్టిచాకిరి విధానాలకు వ్యతిరేకంగా చురుకైన పాత్ర నిర్వహించారని కొనియాడారు.

'దొడ్డా' మృతిపై కందిమళ్ల దిగ్భ్రాంతి

దొడ్డ నారాయణ రావు మృతికి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ సీనియర్ నేత కందిమళ్ల ప్రతాప్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిరంకుశ నిజాంకు, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన కీలక పాత్రపోషించారన్నారు. కమ్యూనిస్ట్ సిద్ధాంతం కోసం ఊపిరి ఉన్నంతవరకు నిలబడ్డ గొప్ప వ్యక్తి దొడ్డ అని కొనియాడారు. మృతికి సంతాపం, కుటుంబానికి సానుభూతి తెలిపారు.

అంతిమయాత్రలో ప్రముఖులు...

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, పల్లా నరసింహా రెడ్డి, సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, మల్లెపల్లి ఆదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, జూలకంటి రంగారెడ్డి నారాయణరావు భౌతికకాయానికి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

మోదీని సాగనంపితేనే దేశానికి రక్షణ: రామకృష్ణ

విశాలాంధ్ర-గుంతకల్లు: ప్రధాని నరేంద్రమోదీని అధికారం నుంచి దింపితేనే దేశం బాగుపడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ పభుత్వ 11 ఏళ్ల పాలనలో రైతు సమస్యలు గానీ, విద్యార్థుల సమస్యలు గానీ, ఉద్యోగ సమస్య గానీ పరిష్కారం కాలేదని, పేదరికం పెరిగిపోయిందని విమర్శించారు. సీపీఐ గుంతకల్లు పట్టణ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారం చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నియంతృత్వ ధోరణి అవలంబిస్తున్నారని రామకృష్ణ ఆరోపించారు. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఏపీ, బీహార్ ముఖ్యమంత్రులు చంద్రబాబు, నితీశ్ మద్దతివ్వడం ఆశ్చర్యంగా ఉందని, వారిద్దరిని చూస్తుంటే జాలేస్తోందన్నారు. చంద్రబాబు, నితీశ్ మద్దతు లేకపోతే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడేదే కాదన్నారు. అధికారం చేపట్టిన తర్వాత చంద్రబాబు, నితీశ్‌ను సైతం మోదీ పట్టించుకోవడం లేదన్నారు. సొంతబలంతో ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

ఇది జంగిల్‌రాజే కదా

పాశ్వాన్‌కు బెదిరింపుపై తేజస్వి

పట్నా: తనను చంపేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయని లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ చేసిన వ్యాఖ్యలపై ఆర్జేడీ కీలక నేత తేజస్వీ యాదవ్ శనివారం స్పందించారు. 'ప్రధాని దగ్గరికి వెళ్లి బీహార్‌లో జంగిల్‌రాజ్ ఉందని చెప్పుకో' అని పాశ్వాన్‌కు సలహా ఇచ్చారు. ఆర్జేడీ హయాంలో ఆటవిక పాలన (జంగిల్‌రాజ్) సాగిందని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు తరచూ విమర్శలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు రాష్ట్రంలో ఎన్డీఏ పాలన ఉన్నా అధికార కూటమి నేతకు బెదిరింపులు రావడంతో తేజస్వీయాదవ్ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. బీహార్‌లో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నాయి. పోటీ ప్రధానంగా అధికార, ప్రతిపక్ష కూటముల మధ్యే ఉండనుంది. ప్రతిపక్ష కూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. ఈ క్రమంలో కూటమి పార్టీల్లో సీట్ల పంపిణీపై చర్చలు కొనసాగుతున్నాయని తేజస్వీ యాదవ్ చెప్పారు.

ఎర్రజెండానే అండ

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నట్లు కూనంనేని వెల్లడించారు. పార్టీ నేతలు ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, వాడే లక్ష్మి అధ్యక్షతన జరిగిన మహాసభలో రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, నరటి ప్రసాద్, కల్లూరి వెంకటేశ్వర్లు, మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు గుండాల నాగరాజు, వి. పద్మజ, డి. సుధాకర్, ప్రజాసంఘాల నాయకులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, వర్మ అజిత్, చెన్నయ్య, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి సునీల్, నిమ్మల రాంబాబు, కోరే కృష్ణ, ఎస్ఏ. రెహమాన్, కాసర్ల రామారావు, ఎస్ కె. గౌస్ పాషా, మడుపు ఉపేంద్ర చారి, కుర్రు రమేష్, సత్యనారాయణ, బిక్కులాల్, పద్మ, లక్ష్మీ, రాకేష్, రవి, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ వేగవంతం

విశాలాంధ్ర-హైదరాబాద్: నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణ, సహాయ - పునరావాస పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సరైన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన వివిధ అంశాలపై సచివాలయంలో అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. జిల్లాస్థాయిలో సమన్వయం ఎంతో ముఖ్యమని, పనుల పురోగతికి ఆటంకంగా మారిన సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి స్థాయిలోనూ పనులు సాఫీగా జరగాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరాతీసిన మంత్రి ఉత్తమ్... ముఖ్యమైన సమస్యలను గుర్తించారు. వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకు ప్రాజెక్టులు ఎంతో ముఖ్యమన్నారు. 'చాలా కాలంగా భూసేకరణలో జాప్యం కారణంగా గడువులోగా పనులు పూర్తికావడం లేదు. అంచనా వ్యయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని పరిష్కరించేందుకు భూ యజమానులు తదితరులతో సంప్రదింపులు జరపాలి. పరిహారం, పునరావాస ప్రక్రియను పారదర్శకంగా, సున్నితంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఆలస్యం చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత పెరగడంతో పాటు చట్టపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. తద్వారా పనులకు ఆటంకం కలుగుతుంది. కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే కీలకమైన పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్ ప్రాజెక్టు పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కాలువ లైనింగ్ మొదలు సొరంగాల వరకు ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి' అని అధికారులను ఉత్తమ్ ఆదేశించారు.

కేయూలో డాక్టరేట్ అందుకున్న నాగయ్య

విశాలాంధ్ర - తొర్రూరు: తొర్రూర్ మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు నాగయ్య వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ సాధించారు. తాజాగా వరంగల్‌లోని కాకతీయ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన విశ్వవిద్యాలయ 23వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా నాగయ్య డాక్టరేట్ అందుకున్నారు. తెలుగు విభాగంలో ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'శిరంశెట్టి కాంతారావు సాహిత్యం- సమగ్ర పరిశీలన 'అనే అంశంపై పరిశోధన నిర్వహించి విజయవంతంగా పీహెచ్ డీ పూర్తి చేశారు. పలు అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో పాల్గొని పత్ర సమర్పణలు చేశారు. ప్రాథమిక విద్య స్వగ్రామమైన చెర్లపాలెంలో, ఇంటర్, డిగ్రీ తొర్రూరులో, పీజీ కాకతీయ విశ్వవిద్యాలయంలో పూర్తి చేశాడు. రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎంఈడీ చదివారు. పీహెచ్ డీ పట్టా అందుకోవడం తనకెంతో ఆనందాన్నిచ్చిందని, తన పరిశోధనకు తగ్గ గుర్తింపు లభించిందని నాగయ్య తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానికులు ఆయనను అభినందించారు.

మహిళా సంఘాల అభివృద్ధికి బ్యాంకుల చేయూత

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు మండలం అయోధ్యపురం గ్రామంలో ఇందిరా మహిళ శక్తి సంఘాలు శనివారం సంబరాలు నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందని కిశోర బాలికలకు (బాలిక సంఘాలు) వడ్డీ లేని రుణం అందించిందని వారిని 12 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వరకు వయోపరిమితి ఉంటుందని సిసి కందిక ఐలయ్య తెలిపారు. అయన మాట్లాడుతూ సంఘాలలో ఉన్న వారికి జీవనోపాధి కల్పించాలని గత సంవత్సరం అయోధ్యపురం 2 కోట్ల రూపాయలను సంఘాలకు ఆర్థిక సహాయం అందించిందని రానున్న రోజులలో మహిళా సంఘాలు పురోగతి సాధిస్తాయని ఐలయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ అధ్యక్షురాలు భీమగాని మయూరి, వివో ఏ శారద, సభ్యులు గట్టు సరస్వతి, భాగ్యమ్మ, అరుణ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ఆర్థిక స్వావలంబన సాధించవచ్చు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: నైపుణ్య శిక్షణల ద్వారా మహిళలు ఆత్మస్థైర్యంతో ఆర్థిక స్వాలంబన సాధించవచ్చు అని మహబూబాబాద్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. శనివారం ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ వరంగల్ వారి సహకారంతో శ్రీవాణి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో 45 రోజుల బ్యూటీషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నాగవాణి మాట్లాడుతూ సమాజంలో పిల్లలు అభివృద్ధికి కుటుంబ పోషణకు కేవలం మగవారి సంపాదన మీదనే ఆధారపడకుండా, ఆడవాళ్లు సమాజంలో ఒక మంచి వ్యాపారవేత్తలుగా అభివృద్ధి సాధించడానికి తద్వారా కుటుంబ పోషణ, పిల్లల సంరక్షణలో ముందు ఉండడానికి మరి ముఖ్యంగా ఇటువంటి నైపుణ్య శిక్షణలు వారిని సమాజంలో ఆత్మస్థైర్యంతో జీవించడానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అనంతరం ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ మాట్లాడుతూ ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ మహిళలు మరియు బాలల సంక్షేమం కొరకు పనిచేస్తుందని, బాల్య వివాహాలు బాలల అక్రమ రవాణా బాలల పైన లైంగిక దాడులు నిరోధించడంలో భాగంగా మహిళలకు ఉపాధి మార్గాలను ఏర్పరచడానికి ఈ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని, శిక్షణ పొందిన మహిళలు సమాజంలో పిల్లల పట్ల, మహిళల పట్ల జరుగుతున్న ఆకృత్యాలను ఎదిరించుటకు ఆత్మస్థైర్యంతోటి ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, నలంద స్కూల్ ప్రిన్సిపాల్ రవిందర్, ఏడవ వార్డు పెద్దలు వెంకన్న, ట్రైనర్స్ శివలక్ష్మి, ప్రీతి, తదితరులతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు ఐదు వేల మందికి పైగా హాజరు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణంలో ఏఎంకే ఫంక్షన్ హాలులో నియోజకవర్గం టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో 60 కంపెనీలలో నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించేందుకు శనివారం జాబ్ మేళా నిర్వహించారు. అసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఉద్యోగ ఉపాధి జాబ్ మేళాను ఉద్దేశించి జాన్సన్ నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నేను తనలో ఓ కుటుంబ సభ్యుడులా ముందుంటానన్నారు. ఎన్నికల్లో గెలిచిన ఓడిన నేను మీలో ఒకడిలా ఉండేందుకు అందరి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు. ఈ జాబ్ మేళాకు 5 వేలకు పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. ఇది రాజకీయం కాదు బ్రతుకు తెరువు కొరకు చేస్తున్న పని అని అన్నారు. ఈ కార్యక్రమానికి టీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ జెడ్పిటిసి రాము నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సక్కారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయితీరాజ్ అధికారి

విశాలాంధ్ర బ్యూరో- పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం వద్ద పంచాయతీరాజ్ ఏఈ జగదీష్ బాబు 90 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా కరీంనగర్ ఏసీబీ డిఎస్పి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. కాల్వ శ్రీరాంపూర్ పంచాయతీరాజ్ ఏఈ జగదీష్ ఓదెల మండలం బాయమ్మపల్లి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ రాజు నుండి సీసీ రోడ్డు బిల్లు మంజూరు కోసం 90వేల రూపాయలు డిమాండ్ చేసి తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

ప్రమాదాలు చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో / హైదరాబాద్ : పొరపాటుగా ప్రమాదాలు చేస్తే అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా భవిష్యత్తులో చర్యలు చేపట్టనున్నమని రాష్ట్ర రవాణా, బీసీ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వాహనాల వెనకవైపు రిఫ్లెక్టర్ రేడియం స్టిక్కర్లను తప్పనిసరిగా వేసుకునే విధంగా జీవో తీసుకు రానున్నమని అలాగే డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు. శనివారం మంత్రి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని దండంపల్లి వద్ద 8 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనం నడపడం, వాహనం ఫిట్నెస్ లేకపోవడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని తగ్గించేందుకు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఉపయోగపడుతుందని అన్నారు. మనిషికి జబ్బు చేసినప్పుడు సీటీ స్కాన్ తీసిన విధంగానే ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లో సాంకేతిక పరికరాల సహాయంతో సుమారు 15 అంశాలలో వాహనం రోడ్డుపై తిరిగేందుకు పనికి వస్తుందా లేదా అన్నది నిర్ధారిస్తుందని తెలిపారు. రవాణా రంగంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్కటి 8 కోట్ల రూపాయల వ్యయంతో 17 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు రవాణా శాఖ ద్వారా స్క్రాపింగ్ పాలసీని తీసుకువచ్చామని, ఏటీసీ వల్ల ప్రతి వాహనం వాహన సారధి పరిధిలోకి వచ్చే విధంగా తెలంగాణను వాహన సారధిలో భాగస్వామ్యం చేశామని, ట్రాఫిక్ అవేర్నెస్‌లో భాగంగా ట్రాఫిక్ అవేర్నెస్ క్యాంపుల నిర్వహణ, పాఠశాలల్లో విద్యార్థులకు క్లబ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో డ్రైవింగ్ లైసెన్స్ టెస్టులను ఆటోమేటిక్‌గా నిర్వహించి ఆ టెస్ట్‌లో పాస్ అయితేనే డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని, పాశ్చాత్య దేశాల మాదిరి గానే తెలంగాణలో సైతం ఎవరైనా నిబంధనలు అతిక్రమించితే జరిమానా విధించడమే కాకుండా, పొరపాటున వాహన ప్రమాదం చేసినట్లయితే అవసరమైతే వారి లైసెన్స్ రద్దు చేసేలా చర్యలు చేపట్ట నున్నామని వెల్లడించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు వలన 20 నెలల్లో 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని ,నల్గొండ జిల్లాకు 70 ఈ బస్సులు ఇవ్వగా, 10 బస్సులు నార్కెట్ పల్లికి, తక్కినవి ఇతర ప్రాంతాలకు తిప్పనున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వాహనాల ఫిట్నెస్ సరిగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రమాదాల నివారణలో భాగంగా నల్గొండ జిల్లాలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం సంతోషమని, జిల్లా యంత్రాంగం తరఫున ఏటీసికి అవసరమైన సహకారం ఇస్తామని తెలిపారు. జిల్లా ట్రాన్స్పోర్ట్ కమిషనర్ శ్రీవాణి మాట్లాడుతూ మాన్యువల్‌గా కాకుండా మిషన్ ద్వారా వాహనాలను పరీక్షించే అవకాశం ఏ టి సి ద్వారా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవర్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రవాణా శాఖ కమిషన్ చంద్రశేఖర్, విశ్రాంత ఆర్టీవో మోహన్ రెడ్డి, ఆర్టిఓ మెంబర్లు రాజిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఘన సన్మానం

విశాలాంధ్ర - నేరేడుచర్ల : లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు లయన్ గుండ్రెడ్డి సైదిరెడ్డి అధ్యక్షతన శనివారం ఇటీవల జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో అద్భుత విజయాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సిఎస్ఇ సీటు పొందిన బట్టు ఆశ్రితవల్లి, ఐఐటీ మద్రాస్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ సీటు పొందిన రమావతి సుకుమార్, ట్రిపుల్ ఐటీ బాసర సీటు పొందిన జడ్పీహెచ్ఎస్ పెంచికల్ పాఠశాలకు చెందిన సద్దల గీతికలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి చెందిన గీతికకు లయన్స్ క్లబ్ తరఫున రూ. 8000 ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఎప్పుడూ సేవా ధోరణితో ముందుంటుంది. ముఖ్యంగా ప్రతిభను ప్రోత్సహించేందుకు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు మద్దతుగా నిలవడమే మా లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్పర్సన్ మధు, ప్రభాకర్ రెడ్డి, జడ్పీహెచ్ఎస్ పెంచికల్ దిన్నె ప్రధానోపాధ్యాయులు ఎల్ శ్రీనివాసరావు, క్లబ్ కార్యదర్శి షేక్ యూసుఫ్, కోశాధికారి నాగేశ్వరరావు సరికొప్పుల, సీనియర్ సభ్యులు శ్రీరామ్ రెడ్డి, కందిబండ శ్రీనివాస్‌రావు, గుండా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కాంగ్రెస్ నాటకం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 రిజర్వేషన్ అమలు కాంగ్రెస్ నాటకమని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల మనోభావాలు దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తుందని, ఇప్పుడు వచ్చే స్థానిక ఎన్నికల్లో బీసీల ఓట్లు కొల్లగొట్టేందుకే ఈ రిజర్వేషన్లు ఇస్తామని హామీ అంటున్నారని దీన్ని ప్రజలెవరూ నమ్మడం లేదని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, బొడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి, కల్వచర్ల కృష్ణవేణి, బాదే అంజలి, గాదం విజయ, పిల్లి రమేష్ జిట్టవేన ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో: ఏటూరునాగారం మండలంలోని చిన్న బోయిన్న పల్లి నుండి ఏటూరునాగారంలోని యువతకు అమ్మేందుకు గంజాయి తరలిస్తున్నారనే సమాచారం రాగా, ఏటూరు నాగారం ఎస్ఐ ఎస్.రాజ్ కుమార్ సిబ్బందితో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ గిరిజన బాలికల ఉన్నత పాఠశాల వద్ద చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన ఎస్ కె. నిఖిత అనే మహిళను అరెస్టు చేసినట్లు, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. ఏఎస్పీ వివరించిన సమాచారం మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హన్మకొండ బస్టాండ్‌లో వాహదుల్ల అనే వ్యక్తి దగ్గర ఎస్ కె నిఖిత అనే మహిళా గంజాయి కొని, చిన్నబోయినపల్లి కి బస్సులో వచ్చి,అక్కడి నుండి స్కూటీపై ఏటూరునాగారం వై జంక్షన్ వైపు వస్తుండగా, పోలీసులకు పట్టుబడిందన్నారు. అట్టి మహిళ వద్ద నుండి పోలీసు వారు 230గ్రాముల ఎండు గంజాయి, యమహా స్కూటీ, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని సదరు మహిళను ఏటూరునాగారం సిఐ అనుముల శ్రీనివాస్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారని పపేర్కొన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఇటువంటి నేరాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు.

ములుగు మండల కేంద్రంలోని గట్టమ్మ ఆలయం సమీపంలో ములుగు పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టి పట్టగా గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ యువకుడిని అరెస్ట్ చేసినట్లు ములుగు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలానికి చెందిన యువకుడి బైక్‌ను తనిఖీ చేయగా కిలో ఎండు గంజాయి లభ్యం అయిందని, గంజాయిని సీజ్ చేసి యువకుడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపిన ములుగు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

రోగిని కాపాడిన సిటిజన్స్ స్పెషాలిటీ హాస్పిటల్లోని ఏఓఐ

హైదరాబాద్: హైదరాబాద్‌లోని సిటిజన్స్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్ (ఏఓఐ), డయాబెటిస్ మరియు హైపర్‌టెన్షన్ సహా బహుళ కోమోర్బిడిటీ సమస్యలతో పాటుగా అత్యంత తీవ్రమైన ప్రోస్టేట్ క్యాన్సర్ సంక్లిష్టమైన, అరుదైన స్థితితో బాధపడుతున్న 72 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా చికిత్స చేసింది. పదేపదే మూత్రం ఆగిపోతుండటం, ఇన్ఫెక్షన్‌తో పాటుగా సుదీర్ఘ వైద్య చరిత్ర ఉన్నప్పటికీ ట్రాన్స్‌ఫర్మేషన్ అనుసరించి ప్రోస్టేట్ క్యాన్సర్ రోగ నిర్ధారణతో గుర్తించబడిన ఈ రోగి ఇప్పుడు సమగ్ర, లక్ష్య ఆధారిత చికిత్స తర్వాత స్థిరంగా, ఆరోగ్యంగా ఉన్నాడు. ఈ వ్యక్తి మూత్ర సమస్యలతో ఏఓఐ హైదరాబాద్‌లో ప్రాథమిక సంరక్షణ పొందాడు, అక్కడ అతనికి ఇంటర్మీడియట్ రిస్క్ ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఆ తర్వాత రేడియోథెరపీ, హార్మోన్ల చికిత్సను పొందినా ఉపయోగం లేకుండా పోయింది. రోగి ఏఓఐ హైదరాబాద్‌కు తిరిగి వచ్చినప్పుడు, సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజీ డాక్టర్ కృష్ణమణి కెవి, తిరిగి బయాప్సీకి సిఫార్సు చేశారు. ఎంఎస్ఐ హై అండ్ టిఎంబిపై ఉన్న కణితిపై ఎన్జిఎస్ చేసినట్లు డాక్టర్ వివరించారు.

అమేజాన్ బిజినెస్‌లో గొప్ప ఆఫర్స్

బెంగళూరు: 12 జులై నుండి 14 జులై, 2025 వరకు ఈ ప్రైమ్ డేకి అమేజాన్ బిజినెస్ బిజినెస్ కస్టమర్ల కోసం కొన్ని గొప్ప డీల్స్‌ను ప్రకటించింది. ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా మొదటిసారి, ప్రైమ్ డే 72 గంటల షాపింగ్ సమయంలో బిజినెస్ కస్టమర్లు ల్యాప్‌టాప్స్, టాబ్లెట్స్, హెడ్ ఫోన్స్, ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, ఆఫీస్ ఫర్నిచర్, కిచెన్ ఉపకరణాలు, పారిశ్రామిక సప్లైస్ సహా విస్తృత శ్రేణి ఉత్పత్తులపై ఉత్తేజభరితమైన డీల్స్ పొందవచ్చు. బహుళ శ్రేణిలలో భారీ కొనుగోళ్లపై కస్టమర్లు కూడా 20% అదనపు తగ్గింపు పొందవచ్చు. తమ ప్రీ-పెయిడ్ ఆర్డర్లపై అర్హత కలిగిన శ్రేణుల్లో రూ.9,999 వరకు క్యాష్‌బాక్‌ను ఆనందించవచ్చు. డెల్ గేమింగ్ జీ15-5530 ల్యాప్ టాప్ అసలు ధర రూ. 1,03,146. ఇప్పుడు బిజినెస్ కస్టమర్లు బల్క్‌లో ఒక్కొక్కటి రూ.63,854 కి కొనవచ్చు. శామ్ సంగ్ గాలక్సీ ట్యాబ్ ఎస్9 ఎఫ్ఈని బల్క్ లో ఒక్కొక్కటి రూ. 26,708కి కొనవచ్చు. జేబీఎల్ పార్టీబాక్స్ 110, వైర్ లెస్ బ్లూటూత్ పార్టీ స్పీకర్‌ను ఒక్కొక్కటి రూ. 16,675 కి కొనవచ్చు.

హైదరాబాద్‌లో బెంట్లీ ఇన్నోవేషన్ డే

హైదరాబాద్ : స్మార్ట్ సిటీలు, హై-స్పీడ్ రైలు నుండి డిజిటల్ నీటి వ్యవస్థలు, స్థిరత్వంతో కూడిన ఇంధన నెట్‌వర్క్‌ల వరకు మౌలిక సదుపాయాల పరంగా పరివర్తన దశలో భారతదేశం ఉంది. హైదరాబాద్‌లో జూలై 17న, దిలీలా హోటల్‌లో, ఇన్నోవేషన్ డేను ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అయిన బెంట్లీ సిస్టమ్స్ నిర్వహించనుంది. భారతదేశం యొక్క మౌలిక సదుపాయాల రంగాలలో అర్థవంతమైన పురోగతిని నడిపిస్తున్న డిజిటల్ ట్విన్స్ మరియు జియోటెక్నికల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాఫ్ట్‌వేర్ పరిష్కారాలను అన్వేషించడానికి ప్రభుత్వం, పరిశ్రమ, సాంకేతిక నాయకులను ఒకచోట చేర్చనుంది. పరిశ్రమ నాయకుల నుండి పరిజ్ఞానంతో కూడిన చర్చలు, డిజిటల్ ట్విన్ అప్లికేషన్‌ల ప్రత్యక్ష ప్రదర్శనలు, డిజిటల్ డెలివరీ, డిజిటల్ ట్విన్స్, జియోటెక్నికల్ ఇంజనీరింగ్ సొల్యూషన్‌లు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఎలా రూపొందించాయి, నిర్మించాయి, నిర్వహిస్తున్నాయి అనే దానిపై ఆకట్టుకునే సెషన్‌లను ఈ కార్యక్రమంతో ఆశించవచ్చు.

కైనెటిక్ గ్రీన్, బోర్న్ ఎలక్ట్రిక్ శ్రేణి స్కూటర్లతో వ్యాపార విస్తరణ

పూణే: భారతదేశపు ప్రీమియర్ ఎలక్ట్రిక్ ద్విచక్ర, త్రిచక్ర వాహన తయారీదారు అయిన కైనెటిక్ గ్రీన్, తన నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ, శనివారం తన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన వ్యాపారం కోసం దూకుడుగా వృద్ధి చెందుతున్న రోడ్‌మ్యాప్‌ను వివరించింది. ఒక సంవత్సరం క్రితం ప్రారంభించబడిన దాని ఐకానిక్ ఈ-లూనా అద్భుతమైన విజయంతో బలపడిన కంపెనీ, రాబోయే 18 నెలల్లో మూడు అధిక పనితీరు గల బోర్న్-ఎలక్ట్రిక్ స్కూటర్‌లను విడుదల చేయడానికి సిద్ధమవుతోంది. ఇవి ప్రపంచ డిజైన్ నైపుణ్యాన్ని బలమైన భారతీయ ఇంజనీరింగ్‌తో మిళితం చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ ఉత్తేజకరమైన కొత్త విస్తరణలో మొదటి మోడల్ ప్రీమియం, స్టైలిష్, టెక్-ఫార్వర్డ్ ఫ్యామిలీ స్కూటర్, ఇది 2025 పండుగ సీజన్‌కు ముందు విడుదల కానుంది. అత్యాధునిక లక్షణాలతో, ఈ2డబ్ల్యు వినియోగదారులకు అంతిమ సౌలభ్యంతో కాలానుగుణ రెట్రో-సౌందర్యాన్ని మిళితం చేయడానికి ఆలోచనాత్మకంగా రూపొందింది.

శామ్‌సంగ్ ఎం9, ఎం8, ఎం7 స్మార్ట్ మానిటర్ సిరీస్‌లపై లాంచ్ ఆఫర్లు

గురుగ్రామ్ : భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శామ్‌సంగ్, జూలై 7 నుండి జూలై 20, 2025 వరకు పరిమిత కాల ఆఫర్‌లను కలిగి ఉన్న దాని కొత్త స్మార్ట్ మానిటర్ లైనప్‌ను ప్రారంభించింది. ఈ కాలంలో వినియోగదారులు రూ.3,000 వరకు తక్షణ పొదుపులను ఆస్వాదించవచ్చు. లైనప్‌లో ఫ్లాగ్‌షిప్ 4కే క్యూడీ-ఓఎల్ఈడీ మానిటర్ ఎం9, అప్‌గ్రేడ్ చేయబడిన ఎం8, ఎం7 మోడళ్లు ఉన్నాయి, అన్నీ తెలివైన డిస్‌ప్లేల కోసం కొత్త ప్రమాణాన్ని సెట్ చేసే అధునాతన మరియు వ్యక్తిగతీకరించిన ఏ1 సామర్థ్యాలతో అమర్చబడి ఉంటాయి. ఈ ఆవిష్కరణలతో, వినియోగదారులు ఒకే స్మార్ట్ పరికరం నుండి అప్రయత్నంగా చూడవచ్చు, పని చేయవచ్చు మరియు శైలిలో ప్లే చేయవచ్చు. స్మార్ట్ మానిటర్ ఎం9 క్యూడీ-ఓఎల్ఈడీ టెక్నాలజీని శక్తివంతమైన 32-అంగుళాల 4కే డిస్‌ప్లేతో మిళితం చేస్తుంది, ప్రతి పనిలో అధునాతన రంగులు, కాంట్రాస్ట్‌ను అందిస్తుంది. శామ్‌సంగ్ ఎం9 సిరీస్ ధర రూ.121,499 నుండి ప్రారంభమవుతుంది. రూ.3,000 లాంచ్ ఆఫర్‌తో అందుబాటులో ఉంటుంది.

గోదావరి వరదలపై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి : మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఎగువన కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రోజురోజుకీ గోదావరి వరద పెరుగుతున్నదని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఐడిఓసి కార్యాలయంలో శనివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వరదల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. వరద ముప్పు ఉన్న లోతట్టు గ్రామాల జనాభాను ముందుగానే గుర్తించి, తాత్కాలిక నివాస శిబిరాల ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం చేయకుండా ఆశిబిరాల్లో తాగునీటి సరఫరా, వైద్య సేవలు, శుభ్రత, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత అనుభవాల నేపథ్యంలో ప్రజల ప్రాణాలకు ఏమాత్రం హానీ కలగకుండా చూడాలన్నారు. అవసరమైతే ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాల సహాయాన్ని కోరాలని అధికారులను ఆదేశించారు. పశువుల రక్షణ, అవసరమైన మేత, మందుల లభ్యతను ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వర్తిస్తుందని తెలిపారు. అత్యవసర హెలికాప్టర్ సేవలకు హెలిపాడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ముంపు ప్రాంతాలు గర్భిణీ స్త్రీలను గుర్తించి 108 సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదన కలెక్టర్ విద్యాచందన, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ఎస్ఇ శ్రీనివాస్ రెడ్డి, ఎన్పీడీసీఎల్ మహేందర్, ఆర్ అండ్ బి ఈఈ రమణారావు, డిఎంహెచ్వో జయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సంజీవరావు, కలెక్టరేట్ ఏవో అనంత రామకృష్ణ, కలెక్టరేట్ ఓ ఎస్ డి వెంకటరమణ పాల్గొన్నారు.

ఇల్లందులో కొత్త బొగ్గు బావులు ప్రారంభించండి

విశాలాంధ్ర - ఇల్లందు : పూర్తిస్థాయి ఏజెన్సీ నియోజకవర్గమైన ఇల్లందులో ప్రాంతంలో బొగ్గు బావుల తవ్వకాలకు అవకాశం ఉన్నప్పటికీ సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం మీనా మేషాలు లెక్కపెడుతుందని అఖిలభారత యువజన సమైఖ్య జిల్లా అధ్యక్షుడు జిల్లా అధ్యక్షులు ఉమ్మగాని హరీష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం నిరసన వ్యక్తం చేసారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నో వాగ్దానాలు చేసి అబద్దాలతో అధికారం చేపట్టిన కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం రఘు తేలిపోయిందన్నారు. అదే క్రమంలో రాష్ట్రంలో ఎల్లో వాగ్దానాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వేలాది ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నత విద్య అభ్యసించిన వేలాది మంది నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకుందన్నారు. అదేవిధంగా గుండాల, ఇల్లందు, పూసపల్లి బొగ్గు బావులను ప్రారంభించడం ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు దొరుకుతాయన్నారు. ఇల్లందు మున్సిపాలిటీలో 5 కిలోమీటర్ల పరిధి వరకు కలుపుకొని కొంత ల్యాండ్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని అన్ని వర్గాల ప్రజలు కల్పిస్తే కొత్త పరిశ్రమల అవకాశం ఏర్పడుతుందని దీనికోసం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ చూపాలని అభ్యర్థించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ మండల కార్యదర్శి అనిల్ యాదవ్, నాయకులు ఇమ్రాన్, కాసిం, అన్వేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి 16 వరకు మెగా ఆధార్ క్యాంప్

విశాలాంధ్ర - భద్రాచలం : ఆధార్ కార్డులో సవరణలు చేసుకునేం దుకు ఈనెల 14 నుంచి 16వ తేది వరకు మూడు రోజులు భద్రాచలంలో మెగా ఆధార్ కార్డు క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆర్డీవో దామోదర్ రావు వెల్లడించారు. ఈ క్యాంపులో భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాల యంలో నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో చెప్పారు. ఏళ్ల తరబడి తమ ఆధార్లో సవరణలకు అవకాశం లేని పరిస్థితుల్లో ఈ మెగా ఆధార్ క్యాంపు ప్రజలు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఎంతో ముందు చూపుతో ఏజెన్సీ ప్రజలకు మేలు చేయాలని ఉద్దేశంతో ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయన ఆదేశానుసారం భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు మండలాల ప్రజలు తమ ఆధార్ కార్డుల్లో తప్పులున్నవారు ఈ క్యాంపులో సవరణలు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇందులో పేరు మార్పు, పుట్టిన తేదీ సవరణ, లింగ మార్పు, చిరునామా సవరణ, మొబైల్ నెంబర్ అప్డేట్, ఫోటో, బయోమెట్రిక్ అప్డేట్, తల్లిదండ్రుల పేర్లను జోడించడం వంటి సేవలతో పాటు ప్రత్యేకంగా 5 నుంచి 15 ఏళ్ళ వయసు గల పిల్లలకు బయోమెట్రిక్ వివరాలు తప్పనిసరిగా నవీకరించాల్సి ఉంటుందన్నారు. ఆధార్ క్యాంపులకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డివో కోరారు.

భక్తులతో పోటెత్తిన వడ్డెమాన్ శనీశ్వరస్వామి ఆలయం

విశాలాంధ్ర - నాగర్‌కర్నూల్ : విశ్వావసు నామ సంవత్సరం ఆషాఢ మాసం కృష్ణ పక్షం శనివారం విదియ తిథి కారణంగా నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల పరిధిలోని నంది వడ్డేమాన్‌లోని శనీశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. భక్తులు ఆలయ నియమాల ప్రకారం నల్ల వస్త్రాలు ధరించి అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనీశ్వర స్వామికి నువ్వుల నూనెతో అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు పోటీపడి నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వ మఠం విశ్వనాథ శాస్త్రి శనిస్తోత్రం, మంత్రాలు భక్తుల చేత పఠింపజేశారు. ఆయన మాట్లాడుతూ భక్తులు ప్రతి మాసంలో శనివారం అష్టమి, నవమి, త్రయోదశి, చతుర్దశి, అమావాస్య తిథులు ఉన్న రోజు శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా పూజించి అభిషేకించిన విశేష పుణ్యఫలం దక్కుతుందని అంటారు. గోన బుద్ధారెడ్డి కాలం నాటి వడ్డెమాన్ శివాలయంలోని బ్రహ్మ సూత్రం గల పరమశివునికి భక్తులు సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం పూజలు, అర్చనలు ప్రత్యేకంగా నిర్వహించారు. శని దేవుని దర్శనం అనంతరం వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఆవరణలోని జమ్మి చెట్టుకు భక్తులందరు 19 ప్రదక్షిణలు చేశారు. గణపతి, నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చన, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వ మఠం విశ్వనాథ శాస్త్రి భక్తులకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, కమిటీ సభ్యులు కుంచే రాజేష్ ప్రభాకర చారి, పుల్లయ్య, వీర శేఖర్, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు గవ్వ మఠం శాంతి కుమార్, ఉమామహేశ్వర, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

సంపాదకీయం

పైలెట్లను శిలువ ఎక్కిస్తారా?

గత జూన్ 12 వ తేదీన అహమదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన విమానం బయలుదేరిన కొన్ని సెకన్లలోనే కుప్పకూలింది. ఇందులో సిబ్బందితో సహా ఉన్న 242 మందిలో ఒక్కరు తప్ప అందరూ మరణించారు. ఆ విమానం విమానాశ్రయ రన్‌వేకు ఆనుకుని ఉన్న వైద్య కళాశాల వసతి గృహం మీద పడింది. అందువల్ల మరో 19 మంది విద్యార్థులు కూడా బలయ్యారు. ఈ దుర్ఘటనపై విమాన ప్రమాదాల దర్యాప్తు సంఘం శుక్రవారం ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం విమానానికి ఇంధన సరఫరా అందనందువల్లే పతనం అయినట్టు తేలింది. అంతిమ నివేదిక వెలువడితే మరిన్ని వివరాలు బయట పడవచ్చు. కానీ ప్రాథమిక నివేదికను తరచి చూస్తే ఇద్దరు పైలెట్లనే దోషులుగా నిలబెట్టే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. కాక్‌పిట్ రికార్డర్‌లో వినిపించిన పైలెట్ల ఆఖరి మాటల ఆధారంగా చూస్తే అందులో ఒకరు ఇంధనం సరఫరా అయ్యే మీటను ఆపేసినట్టు అనిపిస్తోంది. విమాన ప్రయాణంలో కాక్‌పిట్‌లో ఉన్న పైలెట్ల మాటలూ రికార్డు అవుతాయి. దీన్ని బ్లాక్ బాక్స్ అంటారు. ఈ వివరాల ప్రకారం విమానం మామూలుగానే పైకి ఎగిరింది. గంటకు దాదాపు 283 కిలోమీటర్ల వేగం అందుకుంది. ఆ తరవాత విమాన వేగం 333 కిలోమీటర్లకు పెరిగింది. అనుకున్నట్టుగానే పైకి ఎగరడం ప్రారంభించింది. వాతావరణం పూర్తిగా అనుకూలంగానే ఉంది. ఆకాశంలో ప్రమాదకరమైన మబ్బులు ఏమీ లేవు. చూపు బాగానే ఆనుతోంది. తేలికపాటి గాలులే ఉన్నాయి. కానీ కొద్ది సెకన్లలోనే మొదటి ఇంజన్‌కు, రెండవ ఇంజన్‌కు ఇంధనం అందించే స్విచ్చులు ఆగిపోయి ఉన్నట్టుగా కనిపించాయి. ఒక దాని తరవాత మరొకటి ఆగిపోయిన స్థితికి వచ్చాయి. బ్లాక్ బాక్సులోని సమాచారాన్ని విశ్లేషించినప్పుడు పైలెట్ల మధ్య ఆఖరి సంభాషణల వివరాలూ తెలిశాయి. విమాన కమాండర్ సుమీత్ సబర్వాల్, కోపైలెట్ క్లైవ్ కుందర్ – ఈ ఇద్దరూ అనుభవజ్ఞులైన పైలెట్లే. వారు విమానం ఎక్కే ముందు సకలవిధ వైద్య పరీక్షలూ చేశారు. వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్టు తేల్చారు. విమానాన్ని కో పైలెట్ కుందర్ నడుపుతున్నారంటున్నారు. కానీ కొన్ని క్షణాల్లోనే ఇంధనం అందక విమానం కిందకు దిగడం మొదలవడం చూసి ఒక పైలెట్ మరొక పైలెట్ ను "ఇంధనం మీట ఎందుకు ఆపావు?" అని అడిగారట. "నేనేమీ ఆపలేదు అని మరో పైలెట్ అన్నారట. అడిగిన పైలెట్ ఎవరో సమాధానం చెప్పిన పైలెట్ ఎవరో మాత్రం దర్యాప్తు నివేదికలో పేర్కొనలేదు. ప్రాథమిక నివేదికను బట్టి చూస్తే ఈ ప్రమాదానికి పైలెట్లే కారణం అని తేల్చేట్టు కనిపిస్తోంది. ఈ కుటిల యత్నాల్లో అంతర్జాతీయ సంస్థల ప్రమేయం ఉందా లేక దేశంలోని కొందరు శక్తిమంతులైన వారు ఎయిర్ ఇండియాను కాపాడడానికి ప్రయత్నిస్తున్నారా అన్న అనుమానం వస్తోంది. పైలెట్లలో ఒకరు ఇంధన సరఫరాను నిలిపివేసి ఉంటారన్న వాదన ఎంత మాత్రం నమ్మశక్యంగా లేదు. విమానయాన సంస్థలను కాపాడడం కోసం పైలెట్లను దోషులుగా నిలబెట్టే ప్రయత్నం జరుగుతోందన్న సందేహాలు వస్తున్నాయి. సాంకేతిక లోపం ఏదీ లేదని ప్రాథమిక నివేదికలో తేల్చారు.

శుక్రవారం రాత్రి విడుదలైంది ప్రాథమిక నివేదిక మాత్రమే. అంతిమ నివేదిక రావడానికి సంవత్సర కాలం పట్టినా ఆశ్చర్యం లేదు. ప్రాథమిక నివేదికలో ప్రమాదానికి కారకులు పైలెట్లు లేదా అందులో ఒకరు బాధ్యులు అని నిరూపించే సూచన కనిపించింది. విమానయాన భద్రతకు బాధ్యత వహించవలసిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మీద క్షమార్హం కానీ నింద పడకుండా చూసే ప్రయత్నమైనా ఉండొచ్చు. ఇంధన సరఫరా ఎందుకు నిలిపివేశావు అని ఒక పైలెట్ అడిగితే మరో పైలెట్ నేను నిలిపేయలేదు అన్న సమాధానం ఇచ్చారంటున్నారు. కానీ ప్రశ్నకు సమాధానం ఇచ్చిన పైలెట్ మాటలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకుండా మరో పైలెట్ అడిగిన ప్రశ్నకు ప్రాధాన్యం ఇస్తున్న ధోరణి ఈ నివేదికలో కనిపిస్తోంది. మూడు అంశాల మీద దర్యాప్తు దృష్టి కేంద్రీకరిస్తోంది. ఒకటి: ఈ ప్రమాదానికి మానవ తప్పిదం కారణమా? ఆ తప్పిదం పైలెట్ల వల్లే జరిగిందా? కానీ ఇంధనం ఆపేసినట్టు ఏ పైలెటూ ఒప్పుకున్నట్టు బ్లాక్ బాక్సులో నమోదు కాలేదు. ఏ పైలెట్ అయినా ఇలాంటి పొరపాటు చేయడు. ఇంధన సరఫరా స్విచ్చులను నిలిపివేయడం లేదా ఏమరుపాటున ఆ పని చేయడం సులభం ఏమీ కాదు. ఆ పని ప్రయత్న పూర్వకంగా జరగవలసిందే. మీట దానంతట అదే మారిందా అన్న కోణం కూడా పరిశీలిస్తారు. ఇంధనం మీట వేసి ఉన్నా ఇంధనం అందలేదు అనడానికి రుజువులు ఏమీ లేవని నివేదికలో పేర్కొన్నారు. ఇంధనంలో కల్తీ కూడా లేదట. ప్రమాదానికి గురైన విమానం టాటాల అధీనంలోని ఎయిర్ ఇండియాది. ఆ సంస్థ విమానం బయలుదేరే ముందు జాగ్రత్తలు తీసుకోలేదు అన్న సూచన కూడా ప్రాథమిక నివేదికలో లేదు. కానీ విమానయాన సంరక్షణకు బాధ్యత వహించవలసిన డీజీసీఏను కాపాడే ప్రయత్నాలేమైనా జరిగాయా అనడానికి కూడా పూర్తి నివేదిక అందితే తప్ప నిర్ధారణకు రాలేం. కానీ ప్రాథమిక నివేదికలో పైలెట్లను దోషులుగా నిలబెట్టే ప్రయత్నాలైతే జరిగాయి. ఇంధన సరఫరా స్విచ్చులు ఆపేసి ఉన్నట్టు తెలుసుకున్న తరవాత వాటిని సరి చేశారు. అంటే పైలెట్లు సకల ప్రయత్నాలు చేశారు. ఈ విమానం 787 డ్రీం లైనర్. ఇందులో రెండు ఇంజన్లు ఉన్నాయి. ఒక ఇంజన్ పాడైనా ఒక్క ఇంజన్ మీదే విమానం నడిపే వెసులుబాటు ఉంటుంది. అలాంటి క్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవడానికి పైలెట్లు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. ఆఖరి నిముషంలో పైలెట్ అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నామనడానికి సంకేతంగా వాడే "మే డే" అన్న పదాన్ని మూడుసార్లు ఉచ్చరించారు. ఈ మాటను విమానాల రాకపోకల కంట్రోల్ కేంద్రం విన్నది. ఏమైంది అని అడిగే లోపలే దుర్ఘటన జరిగిపోయింది. విమానం పతనం కావడం కనిపించింది. ప్రపంచ వ్యాప్తంగా కనీసం వెయ్యి డ్రీం లైనర్ విమానాలు నడుస్తూనే ఉన్నాయి. ఇవి చాలా సురక్షితమైనవని, ప్రమాదాలు అరుదని అంటారు. ఈ విమానాలు అందుబాటులోకి వచ్చిన తరవాత మొదటి ప్రమాదం అహమదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన విమానానికే జరిగింది. దర్యాప్తు నివేదిక శుక్రవారం రాత్రి విడుదలైనా ఈ నివేదికలోని అంశాలు అంతకు ముందే బయటకు పొక్కాయి. 11 వ తేదీననే వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో ఈ నివేదికలోని అంశాలు ప్రచురించారు. అంతకన్నా ముందే మరో వెబ్ సైట్లో కూడా ప్రచురితమైందట. ఇలా ముందే నివేదికలోని అంశాలు బయటకు పొక్కడం అంటే పైలెట్లను శిలువ ఎక్కించే ప్రయత్నం మొదలైందన్న అనుమానాలు సహజంగానే వస్తాయి.

వి. శంకరయ్య

బనకచర్లకు పోలవరం అథారిటీ బ్రేక్?

కొండనాలుకకు మందు వేస్తే వున్న నాలుక ఊడిందంటారు. అలా వుంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పోలవరం బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు పరిశీలన సందర్భంగా అసలు పోలవరం ప్రాజెక్టు డీపీఆర్ మార్చవలసి ఉంటుందని పోలవరం ప్రాజెక్టు అథారిటీ స్పష్టం చేసింది. ప్రస్తుతానికి భిన్నంగా వుండే అంశాలు చేర్చి తిరిగి అనుమతులు పొందాలని తేల్చింది. పోలవరం ప్రాజెక్టు రెండవ దశ అంటే 45.72 మీటర్లు ఎత్తు నిర్మాణం జరిగిన తర్వాతనే బనకచర్ల అనుసంధానం గురించి ఆలోచన చేయాలని కూడా కేంద్ర జల సంఘానికి నివేదించింది. ఇది ఖచ్చితంగా బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు గోరు చుట్టుపై రోకటి పోటులాంటిదే. ఎందుకంటే బనకచర్ల అనుసంధానం ఆఫ్ టేక్ పాయింట్ పోలవరం రిజర్వాయర్ కాబట్టి ఇంతవరకు అందరూ పెట్టిన అడ్డంకుల కన్నా పోలవరం ప్రాజెక్టు అథారిటీ లేవనెత్తిన అభ్యంతరం ప్రాధాన్యత కలదిగా వుంది. పోలవరం అథారిటీ కీలకమైన అంశాలను తెర మీదకు తెచ్చింది.

ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు 41.15 మీటర్ల ఎత్తు నిర్మాణం వరకే కేంద్రమంత్రి వర్గం ఆమోదించినది. ఈ స్థాయి నిర్మాణానికి ప్రాజెక్టు ప్రయోజనాలు లభ్యం కావు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తిస్థాయి నీటి మట్టం 45.72 మీటర్లు ఎత్తు వరకు నిర్మాణం జరిగినప్పుడే బనకచర్ల అనుసంధానం గురించి ఆలోచించ గలమని తేల్చి చెప్పింది. ఇందుకు వివరణ కూడా ఇచ్చింది. 2009లో అనుమతి పొందిన పోలవరం డీపీఆర్ మేరకు 449.78 టీఎంసీల వినియోగానికి అనుమతి లభించింది. 1980 గోదావరి ట్రిబ్యునల్ అవార్డు మేరకు ఈ డీపీఆర్ అనుమతి పొందింది. తాజాగా మరొక 200 టీఎంసీలు పోలవరం నుంచి తరలించేందుకు సిద్ధమౌతున్నారంటే గణాంకాలు మారిపోతాయని ప్రాజెక్టు అథారిటీ నివేదికలో పేర్కొన్నది. బనకచర్ల అనుసంధానం పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకు భాగంకాదు. కాబట్టి పోలవరం నుంచి అదనపు నీటి తరలింపు కూలంకషంగా అధ్యయనం చేయాలని కూడా స్పష్టం చేసింది. అందుబాటులో వున్న నీరెంత? అంతర్ రాష్ట్ర జల వివాదం పరిశీలించాలి. ట్రిబ్యునల్ అవార్డును పరిగణనలోకి తీసుకొని ఈ కొత్త ప్రాజెక్టు నిర్మాణం పరిశీలించాలి. పోలవరం ప్రాజెక్టు ద్వారా సాధించాల్సిన లక్ష్యాలన్నీ నెరవేరతాయా? లేదా? కూడా పరిశీలించాలని చెబుతూ 1980 ట్రిబ్యునల్ అవార్డు మేరకు పోలవరం ఆపరేషన్ షెడ్యూల్ నిర్ణయించారని కొత్తగా మరొక 200 టీఎంసీలు తరలించాలంటే మొత్తంగా ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్ మార్చవలసి వుంటుందని ఆటం బాంబులాంటిది ప్రాజెక్టు అథారిటీ పేల్చింది.

గమనార్హమైన అంశమేమంటే కేంద్ర పర్యావరణశాఖ నిపుణుల కమిటీ వేసిన ప్రశ్నలకే రాష్ట్ర జల వనరుల శాఖాధికారులు ఉలిక్కి పడ్డారు. అనంతరం కేంద్ర జలసంఘం సంధించిన వివిధ యక్ష ప్రశ్నలకు గంగ వెర్రులెత్తారు. దేశ సాగునీటి రంగంలోనే ఇంత వరకు వినిపించిన పారిభాషిక పదాలను కేంద్ర జలసంఘం తెరమీదకు తెచ్చింది. వరద జలాలంటే ఏమిటి? వాటి స్వభావమేమిటి? వాటిని ఎలా లెక్కిస్తారు? అనే ప్రశ్నలు సంధించింది. కోర్టుల్లో కేసుల విచారణ సమయంలో ముద్దాయినే నేర నిరూపణ చేసుకోమన్నట్లుంది. కేంద్ర జల సంఘం వద్ద ఈ ప్రశ్నలకు సమాధానాలు వుండవంటే నమ్మగలమా? పైగా గోదావరి బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులకు 75 శాతం డిపెండబిలిటీ వున్న తర్వాత బనకచర్ల అనుసంధానం పథకానికి 200 టీఎంసీల మళ్లింపునకు ఎంత డిపెండబిలిటీ వుంటుందో లెక్కించి సమర్పించమని కోరారంటే పొమ్మనలేక పొగ బెట్టినట్లు వుంది. ఈ గణాంకాల తయారీకే వాప్కోస్ సహాయంతో రాష్ట్ర జల వనరుల శాఖాధికారుల కుస్తీ పడుతుంటే పోలవరం అథారిటీ సంధించిన నివేదికకు సమాధానమే లేదు.

పోలవరం పూర్తి స్థాయిలో 45.72 మీటర్ల నిర్మాణం జరిగిన తర్వాతనే బనకచర్ల అనుసంధానం పరిశీలన తీసుకోవాలని చెప్పడం కేంద్ర ప్రభుత్వం వద్ద చక్రం తిప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి. ఇంతకీ వగచ వలసిన అంశమేమంటే బనకచర్ల అనుసంధానం తెర మీదకు వచ్చి పెద్ద ఎత్తున ప్రచారార్భాటాలు సాగించిన తర్వాత 2014-19 మధ్య కాలంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రకటించిన పైగా రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలను ఆదుకొనే గోదావరి పెన్నా అనుసంధానానికి కూడా అవరోధం ఏర్పడటమే. తొలి నుంచి రాష్ట్రంలో రైతు సంఘాల నేతలు సాగునీటి రంగంలో మెళకువలు ఎరిగిన విశ్లేషకులు రిటైర్డ్ ఇంజినీర్లు ముమ్మందు రానున్న ఇబ్బందులు చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు. ఎంతో అనుభవం వున్న ఇంజినీరింగ్ అధికారులు ఇంకా సర్వీసులో వున్నారు. ముందుగా గోదావరి అంతర్ రాష్ట్ర నది. కొత్త ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలంటే అంత సులభం కాదని తెలియదంటే నమ్మగలమా? ఇంజినీరింగ్ నైపుణ్యం మెళకువలు సాధ్యాసాధ్యాల కన్నా రాజకీయంపాలు ఎక్కువై ఇన్ని తిప్పలకు దారితీసింది. కొసమెరుపు ఏమంటే ఎవరో కన్న బిడ్డను తీసుకువచ్చి పెంచి పెద్దది చేయాలని చూడటంతోనే అసలు చిక్కు వచ్చిపడింది.

విశ్రాంత పాత్రికేయులు

గాజాలో ఆకలికేకలు

ఈడ్పుగంటి రోమిల

గాజాలో పరిస్థితి తీవ్ర రూపం దాల్చడంతో సుమారు 4,70,000 మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. అంటే జనాభాలో 22శాతం. పలస్తీనా రెడ్ క్రెసెంట్ సొసైటీ బృందాలు, స్వచ్ఛంద సేవకులు గాజా ప్రజలకు ప్రథమ చికిత్సను అందిస్తున్నారు. గాజాపై ఇజ్రాయిల్ దాడులు తీవ్రతరం అయి 20 నెలలు అయింది. ఈ యుద్ధాల్లో కనీసం 1,18,000 మంది గాయపడ్డారు. దేశంలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పతనం అంచున ఉంది. జనాభాలో 90శాతం మంది తమ ఇళ్లను వదిలి పారిపోవలసి వచ్చింది. గాజాలో బందీలుగా ఉన్న వారి కుటుంబాలు తమ వారి నుంచి సహాయం కోసం ఎదురుచూస్తూ ఆశ, నిరాశ మధ్య ఊగిసలాడుతున్నారు. గాజాలో మానవతా పరిస్థితి క్షీణిస్తోంది. మనుగడ సాగించేందుకు గాజా ప్రజలు నిత్యం పోరాటం సాగిస్తూనే ఉన్నారు. ఆహార సరఫరాలు దాదాపుగా ఆగిపోయాయి. వైద్య వ్యవస్థ విచ్ఛిన్నమైంది. మొత్తం కుటుంబాలు భద్రత కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. 11 వారాల పాటు సహాయ పంపిణీ పూర్తి నిలిచిపోయింది.

20 నెలలకు పైగా జరుగుతున్న ఇజ్రాయిల్ దాడుల అనంతరం గాజాలో సరఫరాలు ప్రమాదకర స్థాయిలో అతి తక్కువగా ఉండటంతో, మానవతా సంస్థలు స్పందించడం సైతం కష్టతరం అవుతోంది. ఆహారం, ఇంధనం, వైద్య సామాగ్రి దాదాపుగా అయిపోవడంతో, ప్రజలు ప్రమాదం అంచున జీవిస్తున్నారు. గాజా కరువు ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. జనాభా తీవ్ర ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నది. దాదాపు అర మిలియన్ మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. ఈ విధంగా కొనసాగితే, గాజాలో కరువు మరింతగా పెరిగే అవకాశం ఉంది. కొనసాగుతున్న యుద్ధాల వల్ల నీటి సరఫరాకు సంబంధించి డెబ్భై శాతం మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. పిల్లలు అత్యంత దుర్బలంగా ఉన్నారు. ముఖ్యంగా ప్రజలు ఆశ్రయం పొందుతున్న రద్దీ ప్రాంతాలలో వాంతులు, విరేచనాలు, హెపటైటిస్ వంటి అంటు వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. మార్చి ప్రారంభంలో తాత్కాలిక కాల్పుల విరమణ గడువు ముగిసిన తర్వాత గాజా ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కొన్ని గంటల్లోనే, ఇజ్రాయిల్ ఆహారం, ఇంధనం, ఔషధాలను మూసివేసింది. ఇది ఇప్పటికే తీవ్రమైన కొరతను మరింత తీవ్రతరం చేసింది. కాయధాన్యాలు, బియ్యం, పాస్తా వంటి ప్రాథమిక భోజనాలను అందించే గాజాలోని 47 కమ్యూనిటీ వంటశాలలు, నిల్వ చేసిన అన్ని సామాగ్రి అయిపోవడంతో మూసివేసే పరిస్థితికి దిగజారింది. యుద్ధంలో దెబ్బతిన్న గాజాలో రోజు గడిచేకొద్దీ కరువు తీవ్రమవుతోంది. తిండి, నీళ్లు కూడా లేని దురవస్థలో గాజా ప్రజలు మగ్గుతున్నారు.

వేలకు వేలు కుమ్మరిస్తేనే నిత్యావసరాలు దొరికే దుస్థితి. కేజీ పంచదార రూ. 7 వేలు, లీటర్ పెట్రోల్ రూ. 2 వేలు పలుకుతోంది. కేజీ పంచదార రూ. 7 వేలు, లీటర్ పెట్రోల్ రూ. 2 వేలు పలుకుతోంది. ఉప్పూ పప్పూ కోసం ఆస్తులమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆహారం, నీళ్లు, కూరగాయలు, చివరకు మందుబిళ్లలు కొనాలన్నా కరెన్సీ లేక కష్టమౌతోంది అత్యంత ప్రాథమిక ఆహార పదార్థాలు కూడా విలాసవంతమైన వస్తువులుగా మారాయి. భారతదేశంలో అత్యంత చౌకైన ఆహార పదార్థాలలో ఒకటైన పార్లే-జి, 5 రూపాయల బిస్కెట్ ప్యాక్ 24యూరోలకు (రూ. 2,342) అమ్ముడవుతున్నట్లు తెలుస్తోంది. గాజా నుంచి వైరల్ అయిన సోషల్ మీడియా పోస్ట్‌లో ఒక తండ్రి పసుపు-తెలుపు రంగులో ఉన్న పార్లే ప్యాకెట్‌ను పట్టుకుని, "చాలాసేపు వేచి ఉన్న తర్వాత, నేను చివరకు రఫీఫ్‌కు ఇష్టమైన బిస్కెట్‌ను ఈరోజు పొందాను. ధర 1.5 యూరోలు (రూ. 146) నుంచి 24 యూరోలు (రూ. 2,342) కు పెరిగినప్పటికీ, రఫీఫ్‌కు ఇష్టమైన ట్రీట్‌ను నేను తిరస్కరించలేకపోయాను" అని చెబుతున్నట్లు చూపించారు. గతంలో రెండు రోజులకు నాలుగు డాలర్లు ఖర్చయ్యేది. ఇప్పుడు 12 డాలర్లున్నా పూట గడవడం లేదు. ముఖ్యంగా చక్కెర ధర భారీగా పెరిగిపోయింది. యుద్ధానికి ముందు కిలో చక్కెర 2 డాలర్లుంటే.. ఇప్పుడది 100 డాలర్లు పలుకుతోంది. లీటరు పెట్రోలైతే మన రూపాయల్లో రెండువేలు దాటింది. 25 కిలోల గోధుమ పిండి బస్తా ధర ఇప్పుడు 235-520 యూరోలకు (రూ.19,598- రూ.43,374) పెరిగింది. ఫిబ్రవరి నుంచి

గోధుమ పిండి బస్తా ధర 3,000శాతం పెరిగింది. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ మాట్లాడుతూ, ముఖ్యంగా పిల్లలలో ఆకలి తీవ్రంగా పెరగడం చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు. "గాజాకు మరోసారి సహాయం అందించడానికి అంతర్జాతీయ సమాజం త్వరగా స్పందించాలి" అని డబ్ల్యూఎఫ్‌పీ అధిపతి సిండీ మెక్‌కెయిన్ అన్నారు. "గాజాలోకి మళ్లీ సహాయం అందేలా అంతర్జాతీయ సమాజం తగిన చర్యలు తీసుకోవడం అత్యవసరం" అని అన్నారు. పార్లే-జి వంటి వస్తువులను బ్లాక్ మార్కెట్లలోకి మళ్లించి అధిక ధరలకు విక్రయించడంపై గాజా నగరంలోని సర్జన్ డాక్టర్ ఖలీద్ అల్నావా మాట్లాడుతూ, "ఈ వస్తువులు సాధారణంగా ఉచిత పంపిణీకోసం గాజాలోకి వస్తాయి. కానీ కొద్ది శాతం మాత్రమే వాటిని పొందుతాయి. కొరత వల్ల అవి ఖరీదైన బ్లాక్ మార్కెట్ వస్తువులుగా మారుతున్నాయి. నేను స్వయంగా రూ.240కి పార్లే-జి ప్యాక్‌ను కొనుగోలు చేశాను. ఇది భారత్‌లోని ధర కంటే దాదాపు 50 రెట్లు ఎక్కువ" అని చెప్పారు. ఓవైపు కొత్త కరెన్సీ నిలిచిపోవడం.. మరోవైపు చిరిగిపోయిన పాత నోట్లను వ్యాపారులు తీసుకోకపోవడం పలస్తీనియన్లకు ఇబ్బందిగా మారింది. ప్రపంచబ్యాంకు రిపోర్ట్ ప్రకారం గాజాలో 90 శాతం మంది చేతినిండా పని దొరకని నిరుద్యోగులే. 230 శాతానికి పెరిగిన ద్రవ్యోల్బణం, దీనికి తోడు ముంచుకొచ్చిన నగదు సంక్షోభం. మొత్తంగా యుద్ధపీడిత గాజాలో జనజీవనం దారుణావస్థకు చేరింది.

గాజా పునర్నిర్మాణానికి ఈజిప్ట్, చైనా పిలుపు

ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫత్తా ఎల్-సిసి, చైనా స్టేట్ కౌన్సిల్ ప్రధాన మంత్రి లి కియాంగ్ గాజా పరిణామాలపై అంతర్జాతీయ సహాయం కోసం పిలుపునిచ్చారు. స్ట్రిప్‌లో కాల్పుల విరమణకు చేరుకోవడం, మానవతా సహాయం తక్షణమే అందేలా చూడటం, పలస్తీనా సమస్యకు న్యాయమైన, సమగ్రమైన పరిష్కారాన్ని సూచించాయి. గాజా పునర్నిర్మాణం లక్ష్యంగా అరబ్ దేశాలు ప్రారంభించిన ప్రాజెక్టు అమలుకు అంతర్జాతీయ మద్దతును సమీకరించాల్సిన తక్షణ అవసరాన్ని కూడా ఉన్నతాధికారులు వ్యక్తం చేశారు. మార్చి 4న కైరోలో జరిగిన అరబ్ సమ్మిట్ సమావేశంలో ఆమోదించిన గాజా పునర్నిర్మాణ ప్రణాళిక అమలుకు ప్రపంచ మద్దతును కోరారు. గాజాలోని నాజర్ ఆసుపత్రి వైద్యులు రోగులను విడిచిపెట్టబోమని ప్రతిజ్ఞ చేశారు. ప్రజలను ఉద్దేశించి రాసిన లేఖలో, దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లోని నాజర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఇజ్రాయిల్ బాంబు దాడిలో అనారోగ్యంతో ఉన్న వారు, గాయపడిన రోగులు, మహిళలు, పిల్లలు చికిత్స పొందుతున్నారని "కఠినమైన పరిస్థితులలో" తాము ఆసుపత్రిని నడుపుతున్నామని చెప్పారు. "మా గురించి ప్రపంచానికి చెప్పండి. మా గొప్ప లక్ష్యాన్ని వదులుకోవడం కంటే మేము మరణాన్ని ఎంచుకున్నామని వారికి చెప్పండి" అని తెలిపారు.

పశువుల మందుల కొనుగోలులో అవినీతి

పి.జమలయ్య

రాష్ట్రంలో చిన్న, సన్న కారు కౌలురైతులే పశు పోషణలో కూడా కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. పాడి, పంట రెండు కూడా పేద రైతులకు రెండు కళ్లలాంటివి. అటువంటి కీలకమైన పాత్ర పోషిస్తున్న పశు పోషణను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసింది. పశుసంవర్ధక శాఖ రేటు కాంట్రాక్టు ద్వారా ప్రతి ఏడాది కోట్లాది రూపాయల విలువైన నట్టల నివారణ మందులు, ఇంజెక్షన్‌లు, వాక్సిన్‌లు, ఫీడ్ సప్లిమెంటరీ తదితర మందులు కొనుగోలు చేస్తుంది. వీటి కోసం రెండు సంవత్సరాలకు ఒక్క సారి టెండరు పిలుస్తారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 ఏప్రిల్ నెలలో పశువుల మందులు కొనుగోలు కోసం రాబోయే రెండు సంవత్సరాలకు (2025-26, 2026-2027) టెండర్లను ఆహ్వానించారు. గత టెండర్‌లో ఉన్న నాణ్యమైన మందులు కొనుగోలు కోసం పొందుపర్చిన కొన్ని నిబంధనలను తీసి వేసి నాసిరకం మందులు సరఫరా చేసే కంపెనీల స్వార్థ ప్రయోజనాల కోసం కొత్త నిబంధనలను చేర్చారు.

క్షేత్రస్థాయిలో మందులు కొనుగోలు చేసే విధానానికి ఎందుకు స్వస్తి పలికారు? కొత్త టెండర్‌లో కనిపించిన అత్యంత ప్రమాదకరమైన ధోరణి ఏమిటంటే ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ విధానం (మెయింటెనెన్స్ మేనేజ్మెంట్ సిస్టం) ద్వారా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్థాయిలో మందులు కొనుగోలు చేసే పద్ధతిని 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టారు. దీని ప్రకారం పశువులకు అవసరమైన మందులను స్థానిక పశువైద్యులే కొనుగోలు చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వం కూడా ఈ పద్ధతినే కొనసాగించింది. ఈ విధానాన్ని 2025 జనవరి నుంచి పశు సంవర్ధకశాఖ తొలగించింది. ఎటువంటి చర్చ జరపకుండా ఈ విధానాన్ని రద్దు చేయడం వలన ఎక్కువ లంచాలు ఇచ్చె కంపెనీలకు ఎక్కువ ఆర్డర్లు ఇవ్వటానికి అవకాశం ఉంది. ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ విధానం వలన క్షేత్రస్థాయిలో అక్కడున్న పశువులకు వస్తున్న రోగాలను బట్టి మందులు కొనుగోలు చేయడానికి అవకాశం ఉండేది. నూతనంగా పిలిచిన ఈ టెండర్లలో ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ విధానాన్ని తీసి వేసి జిల్లా స్థాయి (జాయింట్ డైరెక్టర్) పశు వైద్యాధికారికి మందులు కొనుగోలు చేయడానికి అవకాశం కల్పిస్తూ నిబంధనలు చేర్చారు. జిల్లా పశు వైద్యాధికారి నిర్ణయం ప్రకారం మందులు కొనుగోలు చేయటం అంటే ఇష్టం ఉన్నా లేకపోయినా కొంతమంది కంపెనీలు చూపించే ముడుపులకు లోబడి మందులు కొనుగోలు చేయడానికి అవకాశం కల్పించారు. మరో వైపు కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యి, పశువులకు నాణ్యమైన మందులు అందుబాటులో లేక క్షేత్రస్థాయిలో పశువులకు అవసరమైన మందులు వస్తాయో, రావో తెలియని స్థితిలో పశు వైద్యులు ఉంటారు. ఈ కారణంగా పశువులకు వైద్యం అందుబాటులో ఉంటుందని గ్యారెంటీ ఉండదు. ఎవరైనా రైతులు తమ పశువుల ఆరోగ్య సంరక్షణ నిమిత్తం పశు వైద్యశాలలకు వస్తే పశు వైద్యులు రసీదులు రాసి ప్రైవేట్ మందుల షాపులకు పంపిస్తున్నారు. దీనివల్ల రైతులపై భారం పడుతుంది.

గతంలో నిర్వహించిన టెండర్లలో పశువుల మందులు కొనుగోలు చేసి వాటిని టెస్టింగ్‌కు పంపించి నాణ్యత నిర్ధారణ రిపోర్టులు వచ్చిన తర్వాతే పాడి పశువులకు గాని, గొర్రెలు, మేకలకు గాని వాడేవారు. వచ్చిన రిపోర్టులు ఆధారంగా మందులను సరఫరా చేసిన కంపెనీలకు డబ్బులు చెల్లించేవారు. ప్రస్తుతం టెండర్లలో పశుసంవర్ధకశాఖ ఆ నిబంధనలు తొలగించింది. దీంతో కొన్ని కంపెనీలు అక్రమంగా టెండర్‌లో జొరబడి నాణ్యతలేని మందులను సరఫరా చేయడానికి అవకాశం కల్పించింది. గత టెండర్‌లో 279 మందులు కొనుగోలు చేయడానికి ఒప్పందం చేసుకున్నారు. ప్రస్తుతం ఆహ్వానించిన టెండర్లలో 452 మందులను వివిధ సందర్భాల్లో కొనుగోలు చేయడానికి జాబితా ప్రకటించారు. పెరిగిన 173 కొత్త ఉత్పత్తులలో ఫీడ్ సప్లమెంటరీ సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఫీడ్ సప్లిమెంటరీ లిస్టులను భారీగా చేర్చారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పుడు మాత్రమే ఫీడ్ సప్లమెంటరీకి ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంటుంది. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. ప్రతి టెండర్లలో ఔషధాల కొనుగోలుకు ప్రాధాన్యత ఇచ్చేవారు. గతంలో ఫీడ్ సప్లిమెంటరీ అరకొరగా కొనుగోలు చేసేవారు. ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ఎందుకు ఫీడ్ సప్లమెంటరీకి ప్రాధాన్యత ఇచ్చారో వాటికి కారణాలు టెండర్లలో లేవు. ఎందుకంటే కొత్తగా ఆహ్వానించిన టెండర్ల నిబంధనలలో నాణ్యత టెస్టు లేదు కాబట్టి పనికిమాలిన ఫీడ్ సప్లమెంటరీని ఉత్పత్తి చేసి, పంపిణీ చేసి ప్రభుత్వ ఖజానాన్ని కొల్ల గొట్టడానికి ఈ అవకాశం కల్పించారని తెలుస్తోంది. పశు సంరక్షణకు ఉపయోగించే ప్రాణాధార ఔషధం ,ముఖ్యంగా వాక్సిన్లు, ఇంజక్షన్లు తగ్గిపోయాయి. ఇటువంటి నిర్ణయం తీసుకోవడం వెనకాల భారీ అవినీతి భాగోతం దాగి ఉంది. పాత టెండర్ నిబంధనల ప్రకారం రూ. 15 కోట్లు టర్నోవర్ కల్గిన కంపెనీలను ఆహ్వానించారు. ప్రస్తుతం టెండరలో ఆ టర్నోవర్ ను రూ. 12.5 కోట్లకు కుదించారు. పక్కన కర్నాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో పశువైద్య టెండర్లో పాల్గొని మందులు సరఫరా చేసే సంస్థలకు రూ. 25 కోట్లు టర్నోవర్ ఉండాలని నిబంధన విధిస్తే మన రాష్ట్రంలో ఎందుకు తగ్గించారో వివరణలు లేవు. తగ్గించడానికి ఒక శాస్త్రీయమైన అధ్యయనాలు కానీ, విధి విధానాలు కానీ లేవు. తక్కువ టర్నోవర్ కలిగిన కంపెనీలు డబ్ల్యూహెచ్‌ఓ ప్రమాణాలు పాటిస్తాయని నమ్మకం లేదు. నాణ్యత ప్రమాణాలు పాటించడంలో ఎక్కువ శ్రద్ధ పెట్టరు. నోరులేని మూగజీవుల ప్రాణాలతో చెలగాటమాడటం సమంజసం కాదు. గత ఐదు సంవత్సరాల నుంచి సర్జికల్ ఎక్విప్మెంట్ టెండర్ అమల్లో లేదు. అంతే కాకుండా పశు వైద్యానికి అవసరమైన టువంటి సర్జికల్స్‌ను కొనుగోలు చేయడం లేదు. ఎవరైనా గొర్రెలు, మేకలు ఆవులు, గేదలు తదితర పశువుల వైద్యం కోసం తీసుకొస్తే అందుబాటులో ఉన్న పశు వైద్యులు మందుల చిట్టీలు రాసి ప్రైవేట్ షాపుకు పంపుతున్నారు. పశువుల మందులు కొనుగోలుపై 12.5 శాతం జీఎస్టీని వసూళ్ళ చేస్తారు. అది మన రాష్ట్ర ఆదాయం పెరగడానికి ఉపయోగపడుతుంది. ఇతర రాష్ట్రాల్లో ఉత్పత్తి చేసి మన టెండర్లో పాల్గొని విక్రయించే కంపెనీలు నుంచి మనకు జీఎస్టీ రాదు. అది ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతుంది. ఒకవైపు మన రాష్ట్రంలో ఆదాయం పెరగాలని తద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతూ మరో వైపు మన రాష్ట్ర ఆదాయానికి గండి కొట్టే విధానానికి ఊతం ఇచ్చే విధంగా టెండర్ నిబంధనలు చేర్చడం బాధాకరం. రాష్ట్రంలో మందులు ఉత్పత్తి చేసే కంపెనీలకు టెండర్లో అవకాశం ఇస్తే ఆ కంపెనీలు చెల్లించే జీఎస్టీ ఆదాయం రూపంలో మన రాష్ట్రానికి వస్తుంది. ఆ కంపెనీలలో కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుంది. ఆ కంపెనీ నిలబడుతుంది. పశువుల మందులు ఉత్పత్తి చేసే ఆ కంపెనీలు ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నాయో వాటి దగ్గరికి వెళ్లి పరిశీలించడానికి అవకాశం ఉంటుంది. పాటించని కంపెనీలపై చర్యలు తీసుకోవటానికి కూడా ఆ కంపెనీలు అందుబాటులో ఉంటాయి. కంపెనీలు ఎటువంటి ప్రమాణాలు పాటిస్తున్నాయో అసలు ఆ కంపెనీలు ఉన్నాయోలేవో తెలుసుకోవడానికి పశుసంవర్ధకశాఖ టీమ్‌లు వేసి పర్యటన చేయడానికి పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుంది. రాష్ట్ర స్థాయిలో ఉన్న కంపెనీలకు అవకాశం ఇస్తే వాటిని పరిశీలించటం ద్వారా నాణ్యత ప్రమాణాలు కలిగిన మందులను పశువులకు అందించడంతోపాటు మన రాష్ట్ర ఆదాయం పెంచడానికి ఉపయోగపడుతుంది. గతంలో ఉన్న కొన్ని మంచి నిబంధనలను తుంగలో తొక్కి రాష్ట్ర ఆదాయానికి, పశువుల సంరక్షణకు రక్షణ లేకుండా చేసే విధానాల్ని ఈ టెండర్లలో పేర్కొనటం పశువుల మందుల కొనుగోలులో అవకతవకలకు,అవినీతికి పరాకాష్ట తప్ప మరొకటి కాదు. నాణ్యతలేని మందులు, నాసిరకం వైద్యం, వసతులు లేని స్టోర్ రూమ్‌లు, నాణ్యత ప్రమాణాలు పాటించని కొనుగోలు నిబంధనలు ఈ టెండర్లలో ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో పెద్ద ఎత్తున జరుగుతున్న అవినీతి, అక్రమాలను పరిగణలో తీసుకోకపోవడం ఇంతకన్నా బాధాకరమైన విషయం మరొకటి ఉండదు. టెక్నికల్ బిడ్ ఓపెన్‌కు సిద్ధమవుతున్న మందులు కొనుగోలు టెండర్‌ను రద్దు చేసి కొత్త టెండర్‌ని ఆహ్వానించాలి. క్షేత్రస్థాయిలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు మందులు కొనుగోలు చేయడానికి అవకాశంగా ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ విధానాన్ని పునరుద్ధరించాలి. నాణ్యత నిర్ధారించిన తర్వాతే కంపెనీలకు కానీ, సరఫరాదారులకు గాని చెల్లింపులు చేయాలి. రాష్ట్ర ఆదాయానికి నష్టం జరగకుండా నాణ్యత ప్రమాణాలతో పశువుల మందులను ఉత్పత్తి చేసే స్థానిక కంపెనీలకు టెండర్లో అవకాశాలు కల్పించాలి. ఓపెన్ చేయటానికి సిద్ధంగా ఉన్న సర్జికల్ ఎక్విప్‌మెంట్ టెండర్‌లో జరిగిన లోపాలను సవరించి నాణ్యత కలిగిన సర్జికల్, ఎక్విప్‌మెంట్‌ని సరఫరాచేసే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. ఈ చర్యలు తీసుకున్నప్పుడే పశు సంపద వృద్ధి చెంది పాలు, మాంసం తదితర ఆహార ఉత్పత్తులు పెరుగుతాయి. తద్వారా రాష్ట్ర స్థూల ఆదాయం పెరగడంతోపాటు రైతుల ఆదాయాలు కూడా పెరిగి జీవన ప్రమాణాలు మెరుగవుతాయి.

ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం

కోల్‌కతాలో విద్యార్థినిపై అత్యాచారం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా కోల్‌కతాలో మరో ఘోరం చోటుచేసుకుంది. కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం-కోల్‌కతా)లో చదువుతున్న ఓ విద్యార్థినిపై, అక్కడే చదువుతున్న ఓ విద్యార్థి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం తాను మానసికంగా సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి తనకు కౌన్సెలింగ్ చేస్తానని చెప్పి శుక్రవారం బాయ్స్ హాస్టల్‌కు పిలిపించుకున్నాడని తెలిపింది. అక్కడికి వెళ్లిన తరువాత అతడు ఇచ్చిన కూల్‌డ్రింక్ తాగడంతో తాను అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయానని, తర్వాత ఏం జరిగిందో తెలియలేదని వాపోయింది. స్పృహలోకి వచ్చిన తర్వాత తనపై అత్యాచారం జరిగినట్లు గ్రహించానని తెలిపింది. ఈ విషయంపై అతడిని ప్రశ్నించగా... అత్యాచారం గురించి ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తనను బెదిరించినట్లు ఆమె వెల్లడించింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ విద్యార్థిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

జీతం సరిపోవట్లేదు: కంగన

న్యూఢిల్లీ: రాజకీయాల్లో నిజాయతీగా పనిచేసే ఎంపీలకు జీతం సరిపోదని ఎంపీ కంగనా రణావత్ అన్నారు. తమతో ఉండే సిబ్బందికి జీతాలు ఇచ్చిన తర్వాత ఎంపీలకు మిగిలేది అంతంతమాత్రమేనని తెలిపారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజాప్రతినిధులు, పీఏలతో తమ నియోజకవర్గాలకు వాహనాల్లో వెళ్లేందుకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని కంగన చెప్పారు. నియోజకవర్గంలోని ఒక్కో ప్రదేశం 300-400 కి.మీ.ల దూరంలో ఉండటమే అందుకు కారణమన్నారు. రాజకీయాలు ఖర్చుతో కూడుకున్నవని ఆమె అభిప్రాయపడ్డారు. దీనివల్ల ఎంపీలకు వచ్చే జీతం సరిపోవట్లేదన్నారు. అందుకే మరో ఉద్యోగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే చాలామంది ఎంపీలకు వ్యాపారాలు ఉన్నాయని, మరికొందరు న్యాయవాదులుగా ఉన్నారని తెలిపారు. ఈసందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురించి కూడా ప్రస్తావించారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ప్రభావాన్ని ప్రశ్నించే వారిపై అడిగిన ప్రశ్నకు... అంతా తానే చేశానని ట్రంప్ చెప్పుకుంటున్నారని అన్నారు. గతంలో ట్రంప్‌నకు తాను మద్దతుదారుగా ఉన్నానన్నారు. కానీ, ప్రస్తుతం ఆయన వెళ్తున్న తీరు తనకు నచ్చడం లేదన్నారు. సొంత దేశం విషయంలోనూ ఆయన తప్పులు చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు.

భవనం కుప్పకూలి ఆరుగురి మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధాని నార్త్ ఈస్ట్ ఢిల్లీలోని జనతా మజ్దూర్ కాలనీలో శనివారం ఉదయం నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలిపోవడంతో ఆరుగురు మృతి చెందారు. ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆసుపత్రికి తరలించారు. శిథిలాలను తొలగిస్తే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, పౌర రక్షణ సిబ్బంది సంఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. 14 నెలల శిశువుతోపాటు బాధితులను అగ్నిమాపక సిబ్బంది, సహాయ బృందాలు శిథిలాల నుంచి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. తీవ్ర గాయాలైన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ఉన్నతాధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గాయపడిన వారిని పర్వేజ్ (32), నవేద్(19), సిజా(21), దీప(56), గోవింద్ (60), రవి కశ్యప్ (27), జ్యోతి (27), 14 నెలల అహ్మద్‌గా గుర్తించారు. శిశువు తప్ప మిగతా వారందరినీ జగ్ ప్రవేశ్ చంద్ర (జేపీసీ) ఆసుపత్రికి , శిశువు జీటీబీ ఆసుపత్రికి తరలించారు.

విశాలాంధ్ర

5

ఆదివారం

13 జులై 2025

పరీక్షాపే చర్చతో ఒరిగేదేమీ లేదు

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

న్యూఢిల్లీ: పరీక్షాపే చర్చా, పరీక్షా వారియర్స్ వంటి ప్రధాన మంత్రికి చెందిన ప్రధాన కార్యక్రమాలు విద్యా వ్యవస్థలో లోపాలను దాచలేవని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులలో పేలవమైన అభ్యాస ఫలితాలను చూపించిన ప్రభుత్వ సర్వేను ఆయన ఎత్తి చూపారు. పరీక్షా పే చర్చా, పరీక్షా వారియర్స్ వంటి కార్యక్రమాలను ప్రశ్నించారు. ఇటువంటి సంచలనాత్మక పదాలు, స్వీయ-ప్రచార కార్యక్రమాలు భారతదేశంలో విద్య వాస్తవ స్థితిని వర్ణించే స్పష్టమైన సూచికలను దాచలేవని, మోదీ ప్రభుత్వం మన భవిష్యత్ పట్ల ఉదాసీనంగా ఉందని ఆయన విమర్శించారు. 'ఎక్స్' పోస్ట్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు... విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించిన సర్వే ఫలితం, పనితీరు అంచనా, సమీక్ష, సమగ్ర అభివృద్ధి కోసం జ్ఞానం విశ్లేషణ (పరీక్షా) రాష్ట్రీయ సర్వేక్షన్ 2024 పై వీడియోను కూడా జత చేశారు. 'జాతీయ అభ్యాస సంక్షోభం కోవిడ్ పూర్వ యుగం కంటే దారుణంగా ఉంది' అని ఆ వీడియో పేర్కొంది. ఫౌండేషన్ కోర్సులో వైఫల్యాలను, మధ్య, మాధ్యమిక స్థాయిలలో అభ్యాస అంతరాలను పెంచడాన్ని ఎత్తి చూపింది. 'విద్యను నిర్లక్ష్యం చేశారు' అని ఆ వీడియో ఆరోపించింది. 'విద్యా ఖర్చును సగానికి తగ్గించడం వల్ల కలిగే దుష్ప్రభావాలను ఇప్పుడు మనం తెలుసుకున్నాము' అని పేర్కొంది. 3వ తరగతి విద్యార్థులలో 55 శాతం మంది మాత్రమే 99 వరకు సంఖ్యలను ఆరోహణ లేదా అవరోహణ క్రమంలో అమర్చగలరని, వారిలో 58 శాతం మంది మాత్రమే రెండు అంకెల సంఖ్యలను కూడిక, తీసివేత చేయగలరని సర్వేలో తేలింది. అలాగే 6వ తరగతి విద్యార్థులలో కేవలం 53 శాతం మంది మాత్రమే అంకగణిత క్రియలను, వాటి సహసంబంధాలను అర్థం చేసుకోగలరని, దృశ్యమానం చేయగలరని, కనీసం 10 వరకు కూడిక, గుణకార పట్టికలను తెలుసుకోగలరని సర్వే కనుగొంది. విద్యా మంత్రిత్వ శాఖ అధికారుల ప్రకారం, 50 శాతం కంటే తక్కువ మంది విద్యార్థులు సరిగ్గా సమాధానం చెప్పగలిగిన సందర్భాలు అభ్యాస అంతరాలను సూచిస్తాయి.

బీహార్‌లో క్షీణించిన శాంతిభద్రతలు

పట్నా: బీహార్‌లో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ శనివారం ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను నిందించింది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రాష్ట్రంలో పరిపాలనను 'నియంత్రించడం లేదు' అని మండిపడింది. ఏఐసీసీ బీహార్ ఇంఛార్జ్ కృష్ణ అల్లవారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాలను పాటించకుండా ఎన్నికల కమిషన్ ఆధార్, రేషన్ కార్డులను ఎన్నికల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) కోసం ఆమోదయోగ్యమైన పత్రాల జాబితాలో చేర్చకపోతే కొత్త ఆందోళన ప్రారంభిస్తామని అన్నారు. 'ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రాష్ట్రంలో పరిపాలనను నియంత్రించరు. ఇక్కడ నడుపుతున్నది నరేంద్ర మోదీ, అమిత్ షా ఆదేశం. అందువల్ల బీహార్‌ను భారతదేశ నేర రాజధానిగా మార్చడానికి ఈ ఇద్దరు వ్యక్తులు బాధ్యత వహించాలి' అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా హెడ్ సుప్రియా శ్రీనాటే ఒక విలేకరుల సమావేశంలో రాష్ట్ర పరిపాలనను 'తీవ్రమైన నేరాలకు పాల్పడిన నిందితులను న్యాయం చేయడం కంటే పాలక సంకీర్ణ ఎంపీ తప్పిపోయిన కుక్కను గుర్తించడంలో ఎక్కువ ఆసక్తి చూపడం' పై విమర్శలు గుప్పించారు. 'బీహార్ ఎన్డీఏ పాలనలో ఉన్న 20 సంవత్సరాల కాలంలో హత్య, హత్యాయత్నం, మహిళలపై నేరాలు బాగా పెరిగాయని జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్సీఆర్బీ) గణాంకాలు చూపించాయని కూడా శ్రీనాటే పేర్కొన్నారు.

నితీశ్ మరో ఎన్నికల ఎర

ఉచిత విద్యుత్‌పై కసరత్తు

పట్నా: బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రతిపాదనను ఆర్థిక శాఖ ఆమోదించింది. కానీ.. కేబినెట్ ఆమోదం తెలపాల్సి ఉంది. రాష్ట్రంలో అన్ని కుటుంబాలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించడానికి ఇంధన శాఖ ఓ ప్రతిపాదన సిద్ధం చేసింది. దీన్ని మొదట ఆర్థిక శాఖకు పంపగా... అక్కడ ఆమోదించబడింది. ఈ ప్రతిపాదన ప్రకారం వినియోగదారులు 100 యూనిట్ల వరకు ఎటువంటి ఛార్జీ చెల్లించాల్సిన అవసరం లేదు. 100 యూనిట్లు దాటితే... యూనిట్‌కు ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఎంత అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో వినియోగదారుల నుంచి మొదటి 50 యూనిట్లకు... ఒక్కో యూనిట్‌కు రూ.7.57 వసూలు చేస్తున్నారు. ఆ తర్వాత రూ.7.96 ఛార్జీ చేస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శనివారం సామాజిక భద్రతా పెన్షన్ పథకాన్ని పెంచుతున్నట్లు ప్రకటించారు. నెలకు రూ.400కు బదులుగా రూ.1100 అవుతుంది. పెరిగిన పింఛన్ మొత్తం జులై నుంచి అమలవుతుందని సీఎం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి తొమ్మిది లక్షల 69 వేలకు పైగా లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని గతంలోనే ప్రకటించారు. ప్రభుత్వ శ్రామిక శక్తిలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఉచిత పథకాలు జాతీయ ప్రయోజనాలను, దేశ అభివృద్ధిని దెబ్బతీస్తున్నాయని మోదీ ప్రభుత్వం గగ్గోలుపెడుతోంది. కానీ ఎన్డీయే కీలక భాగస్వామి నితీశ్‌కుమార్ అందుకు విరుద్ధంగా ఉచిత పథకాలకు శ్రీకారం చుట్టారు.

కేంద్ర మంత్రి పాశ్వాన్‌కు బెదిరింపు

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి, లోక్‌జనశక్తి పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్‌కు బెదిరింపు వచ్చింది. పాశ్వాన్‌ను చంపేస్తామని సామాజిక మాధ్యమం ద్వారా గుర్తు తెలియని వ్యక్తి బెదిరించాడు. బాంబుతో ఆ నేతపై దాడి చేస్తామని ఆగంతకుడు తన పోస్టులో తెలిపాడు. దీనిపై ఆ పార్టీకి చెందిన ప్రతినిధి రాజేశ్ భట్ పట్నా సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐటీ చట్టంలోని 66 ఎఫ్ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్ సైబర్ టెర్రరిజం డీల్ చేస్తుంది. భారతీయ న్యాయ సంహితలోని 351(2) సెక్షన్ కూడా నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో చంపుతామని బెదిరించారు. టైగర్ మిరాజ్ ఇదిసి పేరుతో ఇన్‌స్టా అకౌంట్ ఉన్నది. పాశ్వాన్‌కు ప్రజాదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఆ బెదిరింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. చంపేస్తామని బెదిరించడం నేరపూరిత ఉద్దేశాన్ని బయటపెడుతుందని భట్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జులై 11వ తేదీ రాత్రి 9 గంటలకు మంత్రి పాశ్వాన్‌కు ప్రాణహాని బెదిరింపు వచ్చినట్లు సైబర్ డీసీపీ నితీశ్ చంద్ర ధరియా తెలిపారు.

లోయలో పడిన వాహనం... ఐదుగురి మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో పర్యాటకులతో వెళుతున్న ఓ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. వాహనంలో ఉన్న ఐదుగురు పర్యాటకులు మరణించారు. రాంబన్ జిల్లాలోని సేనాబతి వద్ద శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లోయలో పడిన వాహనం నుజ్జునుజ్జుగా మారింది. తీవ్ర గాయాలతో నలుగురు పర్యాటకులు అక్కడికక్కడే చనిపోయారని, ఆసుపత్రికి తరలిస్తుండగా మరో పర్యాటకుడు చనిపోయాడని అధికారులు తెలిపారు. గాయాలపాలైన మిగతా పర్యాటకులను స్థానిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఈ ప్రమాదంపై జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ విచారం వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు రాంబన్ జిల్లా యంత్రాంగం రూ.లక్ష పరిహారం ప్రకటించింది.

ఇంట్లో ఆంక్షలు, స్వేచ్ఛకు ఆటంకాలు

రాధిక హత్య కేసులో కీలక సమాచారం

గురుగ్రామ్: హర్యానా క్రీడాకారిణి రాధికా యాదవ్ హత్య కేసులో కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. గురుగ్రామ్‌లోని నివాసంలో అతి సమీపం నుంచి రాధిక తండ్రి దీపక్ యాదవ్ కాల్పులు జరపడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. నేరాన్ని అంగీకరించిన దీపక్ యాదవ్‌కు కోర్టు 14 రోజులు జ్యుడిషియల్ కస్టడీకి శనివారం అప్పగించింది. రాధిక టెన్నిస్ అకాడమీ నడుపుతుండటం, అది తరచు తండ్రీకూతుళ్ల మధ్య ఘర్షణకు దారితీయడం, కూతురు సంపాదనపై బతుకుతున్నావంటూ కొంతమంది హేళన చేయడంతో దీపక్ మనస్తాపానికి గురైనట్టు పోలీసులు తెలిపారు. దీపక్‌కు బాగానే ఆస్తులున్నాయని, ఇంటి అద్దెలు వస్తుండటంతో ఆర్థికంగా బలంగానే ఉన్నారని, కూతురు సంపాదన మీద ఆధారపడాల్సిన అవసరం లేదని తెలిపారు. టెన్నిస్ అకాడమీని ఆపేయాలని ఎన్నిసార్లు చెప్పినా అందుకు రాధిక నిరాకరిస్తూ వచ్చింది. దీంతో దీపక్ అతి సమీపం నుంచి కాల్పులు జరిపి కూతురిని చంపేశాడు. ఆసక్తికరంగా పోలీసుల దర్యాప్తులో భాగంగా మాజీ కోచ్‌తో రాధిక జరిపిన సంభాషణలు తాజాగా వెలుగుచూసాయి. ఇంట్లోని పరిస్థితి, కెరీర్ పరంగా ఎదగాలనే తపన మాజీ కోచ్‌తో రాధిక మాట్లాడిన సంభాషణల్లో చోటుచేసుకున్నాయి. ఇంట్లో అనేక ఆంక్షలు పెడుతున్నారని, అయితే జీవితాన్ని ఎంజాయ్ చేయాలని, స్వతంత్రంగా బతకాలని ఉందని రాధిక అభిలషించింది. విదేశాలకు వెళ్లాలనే యోచనలో కూడా ఆమె ఉంది. దుబాయ్, ఆస్ట్రేలియా ఆమె ప్రాధాన్యతాక్రమాల్లో ఉన్నాయి. గతంలో చైనా వెళ్లినప్పుడు ముఖ్యంగా ఆహారం విషయంలో తనకు ఇబ్బందులు కలిగాయని, తదుపరి అడుగులు జాగ్రత్తగా వేయాలనుకుంటున్నానని తెలిపింది. తన ప్రణాళిక గురించి తండ్రితో పంచుకున్నప్పటికీ ఆయన నిరాకరించినట్టు తెలిపింది. ఆర్థిక కోణం నుంచి ప్రధానంగా తన తండ్రి ఆందోళన పడేవారని, ఎంత కూడబెట్టావని అడిగేవాడని రాధిక తెలిపింది. డబ్బుల విషయంలోనే ఇద్దరి మధ్యా ప్రధానంగా చర్చ, అసమ్మతులు చోటుచేసుకునేవని పోలీసులు తెలిపారు. తాజాగా ఆ కోణం నుంచి కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ప్రతిపక్షం మద్దతు ఇవ్వొద్దు

జడ్జిల అభిశంసనపై కపిల్ సిబల్



న్యూఢిల్లీ: న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ యాదవ్‌పై 'మతపరమైన' వ్యాఖ్యలకు సంబంధించి అభిశంసన చర్యల కింద విచారణ ఏర్పాటు చేసే వరకు జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించాలన్న ప్రభుత్వం తీసుకునే ఏ చర్యకు ప్రతిపక్షం మద్దతు ఇవ్వకూడదని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ శనివారం అన్నారు. పీటీఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదం తర్వాత తన నివాసంలో కాలిపోయిన కరెన్సీ డబ్బాలు దొరికిన తర్వాత జస్టిస్ వర్మ కేసు అవినీతికి సంబంధించినది కాద ని,అందువల్ల జడ్జికి వ్యతిరే కంగా చర్యకు మద్దతు ఇవ్వాలని భావించే పార్టీలు తమ వైఖరిని సమీక్షించుకోవా లన్నారు. జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం తీసుకురావడంలో ప్రభుత్వం ముందుకు సాగడానికి రెండు కారణాలు ఉండవచ్చని స్వతంత్ర రాజ్యసభ సభ్యుడు పేర్కొన్నారు. 'అత్యంత స్వతంత్ర హైకోర్టు న్యాయమూర్తులలో ఒకరు' అయినందున ఆయన పట్ల అసంతృప్తిగా ఉన్నారు. ప్రత్యామ్నాయంగా వారు దీనిని 'కోర్టులపై ఒత్తిడి తీసుకురావడానికి ఇది ఒక గొప్ప అవకాశం' అని భావించి జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ)కి మరొక రూపాన్ని తీసుకురావడానికి ప్రయత్నించవచ్చు. అలహాబాద్ హైకోర్టు జడ్జి శేఖర్ కుమార్ యాదవ్‌కు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదుకు సీబీఐని ఆదేశించాలని సీనియర్ న్యాయవాదులు సీజేఐను కోరుతున్నారు. జస్టిస్ వర్మను తొలగించడానికి పార్లమెంటులో ఒక తీర్మానం ప్రతిపాదించడానికి ప్రభుత్వం ఎంపీల సంతకాలను సేకరించే కసరత్తును ప్రారంభించిన నేపథ్యంలో సిబల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై సిబల్ మాట్లాడుతూ 'మొదట, ప్రభుత్వానికి దీనితో సంబంధం ఏమిటి? రాజ్యాంగం ప్రకారం 100 మంది లోక్‌సభ సభ్యులు లేదా 50 మంది రాజ్యసభ సభ్యులు అభిశంసన తీర్మానాన్ని ప్రతిపాదించవచ్చు. రాజ్యాంగ ప్రక్రియ ప్రభుత్వాన్ని అసహ్యించుకుంటుంది' అని అన్నారు. కాగా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి అభిశంసనను కోరుతూ ప్రతిపక్షం నోటీసు సమర్పించింది. ప్రతిపక్ష పార్టీలకు మీ సందేశం ఏమిటని అడిగినప్పుడు... ఇది పార్టీల సమస్య కాదని, ప్రభుత్వం కూడా సంతకాలను సేకరించడం ద్వారా తప్పుగా ముందుకు సాగుతోందని సిబల్ అన్నారు. ప్రతిపక్షాలు సమావేశమై తాను ఏమి చెబుతున్నాయో చెప్పాలని సూచించారు. ఒక ఎంపీ తన సంతకాలను తీర్మానంపై చేర్చే ముందు దర్యాప్తు జరగాలన్నారు. న్యాయమూర్తి ఉన్నత న్యాయవ్యవస్థకు చెందిన వారని, అభిశంసనకు ప్రత్యేక రాజ్యాంగ విధానం ఉన్నందున, వాస్తవానికి ఈ విషయాన్ని ముందుకు తీసుకెళ్లి, డబ్బును ఎవరు అక్కడ పెట్టారో తెలుసుకోవడానికి ఎఫ్ఐఆర్ నమోదు చేయవలసింది సుప్రీం కోర్టు అని తెలిపారు. ప్రతిపక్షం మొదట అభిశంసన చర్యల కింద జస్టిస్ యాదవ్‌పై దర్యాప్తును ఏర్పాటు చేయాలని కోరాలని కూడా ఆయన అన్నారు. 'లేకపోతే, ఇది (జస్టిస్ వర్మపై చర్య) ప్రభుత్వం ఎంపిక చేసినదిగా కనిపిస్తోంది. బీజేపీ ఈ న్యాయమూర్తిని వెంటాడి ఇతర న్యాయమూర్తిని రక్షిస్తోంది. అది ప్రతిపక్ష పార్టీల సరైన వైఖరి అయి ఉండాలి' అని తెలిపారు.

కుర్చీ దొరకడం తేలికకాదు

చిక్కితే వదలొద్దు: డీకే



బెంగళూరు: కర్నాటకలో 'సీఎం మార్పు' అంశంపై రాజకీయం రోజురోజుకీ వేడెక్కుతోంది. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రినని ఓవైపు సిద్దరామయ్య చెబుతుండగా... తన చేతుల్లో ఏమీ లేదంటూనే 'ఆశ పడటంలో తప్పులేదు కదా' అని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా డీకే చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి. కుర్చీ దొరికితే వదలొద్దంటూ అధికార పీఠంపై తనకున్న ఆసక్తి గురించి ఆయన నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో న్యాయవాదుల సంఘం ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో డీకే శివకుమార్ మాట్లాడుతూ 'ఇక్కడ చాలామంది లాయర్లు సీట్లు ఖాళీగా ఉన్నా అందులో కూర్చోవట్లేదు. కానీ, మేమందరం మాత్రం ఓ కుర్చీ కోసం తీవ్ర పోరాటాలు చేస్తుంటాం. కుర్చీని సంపాదించడం అంత ఈజీ కాదు. ఒకవేళ దొరికితే మాత్రం ఆ అవకాశాన్ని వదులుకోవద్దు. అందులో కూర్చోవాలి. మీకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలతో అక్కడున్నవారంతా నవ్వులు చిందించారు. ఇందులో ఆయన అధికారం అనే పదాన్ని ఉపయోగించనప్పటికీ... రాష్ట్ర రాజకీయాలను ఉద్దేశించే డీకే ఇలా మాట్లాడారంటూ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. 2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుంచే డీకే, సిద్దరామయ్య మధ్య కుర్చీలాట మొదలైన సంగతి తెలిసిందే.

అస్త్రా క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: స్వదేశీ రక్షణ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవడంలో భారత్ కీలక అడుగులు వేసింది. గగనతలం నుంచి గగన తలానికి ప్రయోగించే అస్త్రా క్షిపణిని అభివృద్ధి చేసింది. దీనిని శుక్రవారం విజయవంతంగా పరీక్షించారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన రేడియో ఫ్రీక్వెన్సీతో దాన్ని ఆపరేట్ చేశారు. సుఖోయ్ 30 ఎంకేఐ యుద్ధవిమానం ద్వారా ఆ క్షిపణి పరీక్షించారు. ఒడిశా తీరంలో ఈ పరీక్ష జరిగింది. డీఆర్డీవో, ఐఏఎఫ్ సంయుక్తంగా ఈ పరీక్ష చేపట్టాయి. పరీక్ష సమయంలో రెండుసార్లు క్షిపణిని ప్రయోగించారు. వేర్వేరు రేంజ్‌ల్లో ఉన్న హై స్పీడ్ ఏరియల్ టార్గెట్లను పేల్చారు. రెండు కేసుల్లోనూ అస్త్రా క్షిపణి టార్గెట్లను ధ్వంసం చేసింది. ట్రయల్స్ సమయంలో సబ్ వ్యవస్థలన్నీ అనుకున్న రీతిలో పనిచేశాయి. ఆర్ఎఫ్ సీకర్‌ను డీఆర్డీవో డిజైన్ చేసి... అభివృద్ధి చేసింది. అస్త్రా వెపన్ సిస్టమ్‌కు చెందిన ఫ్లయిట్ డేటాను ట్రాక్ చేసి... దాని పనితీరును అంచనా వేశారు. ఆధునిక క్షిపణుల్లో రేడియో ఫ్రీక్వెన్సీ కీలకమైన అంశంగా మారింది. ఆటోమేటిక్‌గా టార్గెట్‌ను ట్రాక్ చేస్తుంది. దీన్ని ఫైర్ అండ్ ఫర్గెట్ కేపబిలిటీగా పిలుస్తున్నారు. అస్త్రా బీవీఆర్ఏఏఎం(బియాండ్ విజువల్ రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్) సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను పేల్చగలదు. అత్యుత్తమమైన గైడెన్స్, నావిగేషన్ వ్యవస్థలు ఇందులో ఉన్నాయి. అస్త్రా వెపన్ సిస్టమ్‌లో సుమారు 50 పబ్లిక్, ప్రైవేటు పరిశ్రములు భాగం పంచుకున్నాయి. అస్త్రా పరీక్ష విజయవంతంగా కావడం పట్ల డీఆర్డీవో, ఐఏఎఫ్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రశంసించారు.

త్వరలో భారత్‌లోకి టెస్లా

న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ టెస్లా భారత్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో టెస్లా తొలి షోరూం ప్రారంభించనున్నట్లు, దీన్ని జులై 15న అధికారికంగా ప్రారంభించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భారత్ మార్కెట్‌లోకి ప్రవేశంపై టెస్లా తాజాగా కీలక ప్రకటన చేసింది. 'టెస్లా ఇండియా' పేరుతో ఎక్స్ ఖాతా తెరిచింది. అందులో తొలి పోస్ట్‌గా 'కమింగ్ సూన్' అంటూ ఓ ఫొటో షేర్ చేసింది. ఈ ఎక్స్ పోస్టు చూస్తే భారత్‌లో బిజినెస్ కోసం టెస్లా సిద్ధమైందని తెలుస్తోంది.

గోకర్ణ గుహలో ఇద్దరు పిల్లలతో రష్యా మహిళ

మంగళూరు: భారత్‌లో ఆధ్యాత్మిక ప్రశాంతతకు ఆకర్షితురాలైన ఓ రష్యన్ మహిళ ఉత్తర కన్నడ జిల్లా కుంట తాలూకా రామతీర్థ కొండల్లోని మారుమూల గుహలో జీవనం సాగిస్తోంది. ఆమెతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. దట్టమైన అడవులు, లోతైన మలుపులతో కూడిన ఈ సహజ గుహలో రెండు వారాలుగా ఆమె జీవనం సాగిస్తోంది. అక్కడే రుద్ర విగ్రహాన్ని పెట్టుకుని అనునిత్యం ధ్యానం సాగిస్తూ వచ్చింది. స్థానిక పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఈ విషయం వెలుగుచూసింది. గుహ ప్రాంతం సమీపంలో ఇటీవల కొండచరియలు విరిగిపడటంతో పోలీస్ పెట్రోలింగ్ టీమ్ రామతీర్థ పర్వత ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తుండగా ఒక గుహ బయట ఎవరివో దుస్తులు కనిపించాయి. దీంతో వారు పైకి వెళ్లి చూడగా గుహలో ఒక మహిళ, ఇద్దరు చిన్నారులు కనిపించడంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. రష్యాకు చెందిన ఆ మహిళను 40 ఏళ్ల నైనా కుటినా అలియాస్ మోహిగా గుర్తించారు. ఆమెతో పాటు ఆరేళ్ల కుమార్తె ప్రేయ, నాలుగేళ్ల అమా ఉన్నారు. రెండు వారాలుగా ఇక్కడి క్లిష్ట వాతావరణంలో ఎలా జీవనం సాగించారు, ఏమి తిన్నారో తెలియక పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బిజినెస్ వీసా మీద రష్యా మహిళ ఇక్కడకు వచ్చిందని, అది 2017లోనే వీసా గడువు తీరిందని పోలీసు అధికారులు తెలిపారు. అప్పటి నుంచి ఇంతకాలం ఆమె ఎక్కడ ఉందనేది తెలియనప్పటికీ హిందూ ఫిలాసఫీ పట్ల ఆకర్షితురాలైన ఆమె... గోవా నుంచి గోకర్ణకు వచ్చినప్పుడు అక్కడి పర్వత ప్రాంతంలోని ప్రదేశం పట్ల అకర్షితురాలైనట్టు భావిస్తున్నారు. ఆమెకు నచ్చచెప్పి గుహ నుంచి ఇద్దరు పిల్లల్నీ బయటకు తీసుకువచ్చి... స్థానిక సాధ్వి ఒకరు నడుపుతున్న ఆశ్రమానికి పోలీసులు తరలించారు.

ఉపాధి కల్పనపై ప్రభుత్వం దృష్టి: మోదీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉపాధి కల్పనపై తన ప్రభుత్వం దృష్టి సారించిందని, గత 11 సంవత్సరాలలో దేశం ప్రతి రంగంలోనూ పురోగతి సాధించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం నొక్కి చెప్పారు. 51 వేలకు పైగా నియామక లేఖల పంపిణీ తర్వాత వర్చువల్ ప్రసంగంలో... తన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పేదల కోసం 4 కోట్లకు పైగా ఇళ్లు నిర్మించడం, 10 కోట్లకు పైగా కొత్త వంట గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేయడం లేదా రూఫ్‌టాప్ సోలార్ కార్యక్రమం వంటివి లక్షలాది కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించాయని, తయారీ రంగంలో వృద్ధికి దారితీసిన అనేక ఇతర కార్యక్రమాలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. తన ఇటీవలి ఐదు దేశాల పర్యటన గురించి మాట్లాడుతూ భారతదేశ జనాభా, ప్రజాస్వామ్య బలాన్ని ప్రపంచం ఇప్పుడు గుర్తించిందన్నారు. భారతదేశ యువత సామర్థ్యం దాని అతిపెద్ద మూలధనం, దేశ ఉజ్వల భవిష్యత్‌కు హామీ అని తెలిపారు. 'భారతదేశం రెండు అనంత శక్తులను కలిగి ఉందని ప్రపంచం నేడు గుర్తించింది. ఒకటి జనాభా, మరొకటి ప్రజాస్వామ్యం. మరో మాటలో చెప్పాలంటే, అతిపెద్ద యువ జనాభా, అతిపెద్ద ప్రజాస్వామ్యం' అని ఆయన అన్నారు. తన పర్యటన సందర్భంగా కుదిరిన ఒప్పందాలు దేశంలోనూ, విదేశాలలోనూ భారతీయ యువతకు ప్రయోజనం చేకూరుస్తాయని ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు. ఈ ఒప్పందాలు రక్షణ, ఔషధాలు, డిజిటల్ టెక్నాలజీ, శక్తి, అరుదైన భూమి ఖనిజాలు వంటి కీలక రంగాల్లో ఉంటాయని, సుదూర ప్రయోజనాలను సృష్టిస్తాయన్నారు. 'ఈ చొరవలు భారతదేశ ప్రపంచ ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే కాకుండా తయారీ, సేవలు రెండింటిలోనూ యువ భారతీయులకు అర్థవంతమైన అవకాశాలను కూడా సృష్టిస్తాయి' అని ప్రధాని చెప్పారు. గత 10 సంవత్సరాలలో 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని అన్నారు. ఈ పేద ప్రజలు గతంలో కష్టతరమైన జీవితాన్ని గడిపేవారని, మరణానికి భయపడేవారు కానీ వారు పేదరికాన్ని ఓడించేంత బలంగా మారారని అన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదికను ఉటంకిస్తూ, గత దశాబ్దంలో 90 కోట్లకు పైగా ప్రజలు సంక్షేమ పథకాల పరిధిలోకి వచ్చారని చెప్పారు. గిని సూచిక ఆధారంగా భారతదేశం అత్యధిక సమానత్వం కలిగిన దేశాలలో ఒకటి అని ఆయన అన్నారు. తన ప్రభుత్వ ప్రజానుకూల ప్రయత్నాలను నొక్కి చెప్పారు. తయారీని పెంచడంపై తన ప్రభుత్వం దృష్టి సారించడం ఫలించిందని అన్నారు. ఎలక్ట్రానిక్ తయారీ 11 సంవత్సరాలలో ఐదు రెట్లు పెరిగి రూ.11 లక్షల కోట్లకు చేరుకుందని, మొబైల్ తయారీ యూనిట్లు దాదాపు 300గా ఉన్నాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ తయారీ గురించి గర్వంగా చర్చించబడుతున్నట్లు, పాకిస్తాన్‌తో జరిగిన ఘర్షణ సమయంలో భారతదేశ స్వదేశీ సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించడాన్ని ఆయన స్పష్టంగా ప్రస్తావిస్తూ చెప్పారు. రక్షణ ఉత్పత్తి విలువ రూ. 1.25 లక్షల కోట్లకు మించిందని, భారతదేశం ఇప్పుడు మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పయనిస్తోందని ఆయన అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద లోకోమోటివ్ ఉత్పత్తిదారుగా అవతరించిందని మరియు రైలు మరియు మెట్రో కోచ్‌లు బలమైన ఎగుమతులను నమోదు చేశాయని మోదీ అన్నారు. ఆటోమొబైల్ రంగం కేవలం ఐదు సంవత్సరాలలో 40 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించిందని, ఫలితంగా కొత్త కర్మాగారాలు, కొత్త ఉద్యోగ అవకాశాలు, రికార్డు వాహన అమ్మకాలు జరిగాయన్నారు. ప్రభుత్వం, ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని ప్రస్తావించినట్లుగా, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడంపై కూడా దృష్టి సారిస్తోందని తెలిపారు. దీని కింద ప్రైవేట్ రంగంలో వారి మొదటి ఉద్యోగంలో ఉన్న వారికి రూ.15,000 ఇవ్వబడుతుందన్నారు. వారి మొదటి ఉద్యోగానికి సంబంధించిన మొదటి జీతానికి ప్రభుత్వం విరాళం ఇస్తుందని, దాదాపు లక్ష కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయించిందని, ఇది దాదాపు 3.5 కోట్ల కొత్త ఉద్యోగాల సృష్టికి సహాయపడుతుందని భావిస్తున్నట్లు ఆయన అన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

దొడ్డా నారాయణరావు సేవలు అనిర్వచనీయమైనవి

గ్రంథాలయ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు :: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణా సాయుధ రైతాంగా పోరాట యోధుడు, ఉమ్మడి నల్గొండ జిల్లా సిపిఐ మాజీ కార్యదర్శి దొడ్డా నారాయణరావు మరణం పట్ల రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన అందించిన సేవలు అనిర్వచనీయమైన ఘట్టంగా మిగిలిపోతాయన్నారు. గ్రంథాలయ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర వర్తమాననికి స్ఫూర్తి దాయకంగా నిలిచి పోతాయన్నారు. సర్పంచ్‌గా, పి.ఏ.సి.ఎస్ చైర్మన్‌గా యంపిపిగా జన బాహుళ్యానికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయని ఆయన కొనియాడారు. అటువంటి నేత మన మధ్య లేకపోవడం దురదృష్టకరమని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శనివారం లబ్ధిదారులకు అందజేశారు. మచ్చ బొల్లారం డివిజన్‌కి చెందిన లబ్ధిదారులు శివకుమార్ 21,000, గణేష్ 24000, తేజవతి 32000, వెంకటాపురం డివిజన్‌కి చెందిన నారాయణ (ఎల్‌ఓసి) 1,00,000, రాజు 60,000, సుధా 34,500, మౌలాలి డివిజన్ సత్యనారాయణ 60,000, హర్షద్ అహ్మద్ 60,000, మధుసూదన్ రావు 54,000, నజియా సుల్తానా 36,000, సమీర్ 33,000, సురేష్ 22,500, మహమ్మద్ అతాస్ అలీ 13500, జబిన్ బేగం 8000, సిద్ధియాభేగం 7000, ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ గౌడ్, అమినుద్దీన్, బిఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, భాగ్యనందరావు, సత్యనారాయణ, ఉస్మాన్, వంశీ, రాజశేఖర్ రెడ్డి, శోభన్ పవన్, ప్రశాంత్ రెడ్డి, రేవంత్ రెడ్డి, గణేష్, నర్సింగ్‌రావు, దినేష్, నవాబ్, రాజు, విజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఛారిటీకి సన్నద్ధమవుతున్న రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : డెక్కన్ 2వ ఎడిషన్ చారిటీ 2025 కోసం రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ సిద్ధం అవుతుంది. ఈవెంట్ నుండి సేకరించిన నిధులను హైదరాబాద్‌లోని ముంజా క్యాన్సర్ హాస్పిటల్ కోసం తదుపరి జెన్ సీక్వెన్సింగ్ మెషీన్‌కు కేటాయించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అద్భుత విజయం సాధించిన తర్వాత, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ 2025 జూలై 12 నుండి 13 జూలై వరకు హైదరాబాద్ నుండి డిండి వరకు తన ఛారిటీ టైమ్-స్పీడ్-డిస్టెన్స్ కార్ ర్యాలీ 2వ ఎడిషన్‌ను గర్వంగా ప్రకటించింది. ఈ ఉత్తేజకరమైన ర్యాలీ కేవలం టైమింగ్, నావిగేషన్ పరీక్ష మాత్రమే కాదు. ఇది ఒక వైవిధ్యంతో కూడిన డ్రైవ్. రోటరీ హ్యూమానిటేరియన్ ప్రాజెక్ట్‌ల కోసం నిధులను సేకరించేందుకు రూపొందించబడిన ఈ ర్యాలీ రోటరీ ప్రధాన లక్ష్యం, సర్వీస్ అబవ్ సెల్ఫ్‌తో మోటార్‌స్పోర్ట్ ఉత్సాహాన్ని మిళితం చేస్తుంది. ఆర్టిఎన్ అను ఖేంద్రి, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ అధ్యక్షురాలు మాట్లాడుతు "డ్రైవ్ థ్రిల్ నుండి అది ఉత్పత్తి చేసే ప్రభావం వరకు ఈ సంవత్సరం, మేము పెద్దగా మెరుగ్గా వెళ్తున్నాం," అని ఈ ర్యాలీ ఉద్దేశ్యాన్ని కలుసుకునే అభిరుచికి సంబంధించినది" అని ఆమె చెప్పారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, సమాజ అభ్యున్నతి ద్వారా సుస్థిర అభివృద్ధికి రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్, రోటరీ ఇంటర్నేషనల్ అధ్యాయం కట్టుబడి ఉంది. ఈ ర్యాలీ వంటి ఈవెంట్‌ల ద్వారా, క్లబ్ అవగాహన వనరులకు సంబంధించిన కారణాలను అందిస్తుందని వివరించారు.

బీసీ సంఘం మండల అధ్యక్షుడికి ఘనంగా సన్మానం

విశాలాంధ్ర-కొత్తూరు: ఇటీవల నూతనంగా ఎన్నికైన నంది గామ మండల బీసీ సంఘం అధ్యక్షుడిగా రంగాపూర్ గ్రామ మాజీ డిప్యూటీ సర్పంచ్ తోట మహేందర్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా శనివారం కొత్తూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం ఎంతో సంతోషకరమని, బీసీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని మహేందర్ కి సూచించారు. బీసీలను చైతన్యపరిచి వారి సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి కృషిచేస్తానని మహేందర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మ్యాదరి శ్రీనివాస్, నవీన్ చారి, రాజు యాదవ్, కడియాల నరసింహ యాదవ్, గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - మొయినాబాద్ : ఓపెన్ డిగ్రీ 2025 - 26 మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్ చేవెళ్ల కో - ఆర్డినేటర్ డా. సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పాసైన అభ్యర్థులు, సమాన అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ ప్రవేశాలకు చివరి తేదీ 13 ఆగస్టు వరకు ఉంటుందన్నారు. ఇందులో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9908640914 సంప్రదించాలని కోరారు.

సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేయాలి

పునరావాస పనులను త్వరితగతిన పూర్తి చెయ్యండి

అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన భూసేకరణ ను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పునరావాస పనులను త్వరితగతిన పూర్తి చేయలని ఆయన సూచించారు. శనివారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఆయన నీటిపారుదల శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని చట్టపరమైన, పాలనా పరమైన అంశాలను తక్షణమే పరిష్కరించే విదంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఇటు భూసేకరణ అటు పునరావాస పనులలో జాప్యం లేకుండా సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాల వారిగా ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించిన ఆయన నిర్మాణంలో ఎదురౌతున్న ఆటంకాలను అధిగమించెందుకు అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. భూసేకరణలో జరుగుతున్న జాప్యంతో అంచనాలపై ప్రభావం చూపుతూ రెట్టింపు అఋతుందన్నారు. భూసేకరణలో ఎదురౌతున్న ఆటంకాలను అధిగమించేందుకు భూములు కోల్పయో రైతులతో సహృద్భావ చర్చలు జరపలన్నారు. నష్టపరిహారం, పునరావాసం వంటి అంశాలపై పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎక్కడ నిర్లక్ష్యం వహించినా ప్రజా వ్యతిరేకతతో పాటు న్యాయపరమైన చిక్కులు ఏర్పడతాయని, అటువంటి సునిశితమైన అంశాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఉద్బోధించారు. అదేవిధంగా ప్రాజెక్టుల నిర్మాణాలను ఆయన ప్రస్తావిస్తూ ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పనులను వేగవంతం చేయాలన్నారు. అదే సమయంలో పాలనా పరమైన అంశాలలో ఎటువంటి పోరాబాట్లకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పనులలో అలసత్వం వహిస్తే అంచనాలు పెరుగు తాయన్నారు. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల పూర్తికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో సంభవిస్తున్న నీటి ప్రవహాలతో రాష్ట్రంలోని జలాశయాలలో పెరుగుతున్న నీటి మట్టాలపై ఆయన ఆరా తీశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు నీటి మట్టాలను గమనించాలన్నారు. రాష్ట్రంలోనీ ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణాలలో టన్నెల్ నిర్మాణాలు కీలకంగా మరాయని,అటువంటి టన్నెల్ నిర్మాణాలలో అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు గాను తెలంగాణా నీటిపారుదల శాఖలో భారత సైన్యంలో పని చేస్తున్న ఇద్దరు ఇంజినీరింగ్ నిపుణులను చేర్చుకోబోతున్నట్లు ఆయన వెల్లడించారు. భారత సేన మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ జనరల్ హార్పల్ సింగ్ నీటిపారుదల శాఖలో గౌరవ సలహాదారుగా, అంతర్జాతీయ స్థాయిలో టన్నెల్ ఇంజినీరింగ్ నిపుణుడిగా ప్రసిద్ది చెందిన కల్నల్ పరిక్షిత్ మెహ్రాలు నీటిపారుదల శాఖల్లో చేరుటున్నట్లు ఆయన తెలిపారు. భారతదేశంలో అత్యంత క్లిష్టమైన రోహ్తాంగ్, జోజిలా టన్నెల్ నిర్మాణంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. రాజేంద్రనగర్‌లోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను మరింత బలోపేతం చెసే విదంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

సాగునీటి నిర్వహణలో శిక్షణతో పాటు పరిశోధనకు కీలక కేంద్రంగా ఉందన్నారు. అటువంటి ఇనిస్టిట్యూట్ కు చెందిన భూమి కబ్జాకు గురైందని తక్షణమే సర్వే జరిపి అక్రమ కబ్జాలను తొలగించాలన్నారు. సకాలంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు ప్రజాధనాన్ని సమర్థవంతంగా సద్వినియోగం చేయడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ చారిత్రాత్మక నిర్ణయం

మహేష్ కుమార్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : 42 శాతం రిజర్వేషన్లు ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చే ఆర్డినెన్సు చారిత్రాత్మక నిర్ణయమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. దేశ చరిత్రలో 42 శాతం రిజర్వేషన్లు బిసిలకు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లురవితో కలిసి మాట్లాడారు. సామాజిక విప్లవానికి నాంది పలికి చారిత్రాత్మక ఆవిష్కరణ సందర్భంగా టీపిసిసి అధ్యక్షులుగా ఉండటడం జీవితంలో చేసుకున్న అదృష్టం అన్నారు. బీసీ రిజర్వేషన్ల పట్ల మాకు కితాబు ఇవ్వకపోయినా పరవాలేదు కానీ కనీసం హర్షించే (స్పందించే) స్థితిలో లేకపోవడం దౌర్భాగ్యం అని అన్నారు. కేంద్రంలోని బీజేపీకి అన్ని బిల్లులకు వాళ్ల హయంలో బిఆర్ ఎస్ మద్దతు ప్రకటించిందని కానీ బీసీల పట్ల బిఆర్ ఎస్ కి చిత్త శుద్ధి లేదన్నారు. బీసీలు వారి వాట వారు అడిగే స్థితికి వచ్చారని, ఆ నాడు వర్కింగ్ ప్రెసిడెంట్ గా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించానని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకి కట్టుబడి ఉందని, బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పార్టీ ఘనత అన్నారు. కవిత ఏ పార్టీ అన్నది అర్థం కావడం లేదని, బిఆర్ఎస్‌లో దెయ్యాలు ఉన్నాయా? లేదా దెయ్యాల పిడ వదిలిందా? కవిత ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు.

కవిత తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, రంగులు, వేషాలు మార్చినంత మాత్రాన పిల్లి, పులి కాలేదని, కవిత బిఆర్ ఎస్ పార్టీకి ఎందుకు రాజీనామా చేయడం లేదని నిలదీశారు. బీసీ రిజర్వేషన్లపై కవిత సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని, కాంగ్రెస్ 42 శాతం రిజర్వేషన్లు చేసినపుడు కవితా లిక్కర్ స్కాంలో ఊసలు లెక్కపెడుతున్నారంటూ ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ పార్టీ చాంపియన్, మా హీరో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్, మేము రాహుల్ సైనికులమన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ పార్టీ మార్క్ అని, ఎవరు దొంగలు? ఎవరు హీరోలు? అన్నది తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఎవరికి కట్టబెట్టారు? బీసీల పట్ల బీజేపీ చిత్త శుద్ధి ఏంటో అక్కడే తేలిపోయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే అని పదే పదే పట్టుబట్టడం జరిగిందని, నా కోరికను రాహుల్ గాంధీ ఆశయంను నెరవేర్చిన ఏఐసిసీ మల్లిఖార్జున ఖర్గే,సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కల్తీదారులను కఠినంగా శిక్షించి

కల్లుగీత వృత్తిని రక్షించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కల్తీదారులను కఠినంగా శిక్షించి కల్లు గీతవృత్తిని రక్షించాలని తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హైదరాబాద్ ధర్మభిక్షం భవన్‌లో జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన అధ్యక్షోపన్యాసం చేస్తూ ఇటీవల హైదరాబాద్ లో కల్లుకు బదులు లాభాపేక్షతో రసాయనంతో పానీయాలు తయారు చేయడాన్ని ప్రకృతి పాన్యమైన కల్లతో ముడి పెట్టరాద న్నారు. చెట్లపై నుంచి చనిపోయిన వారు, క్షతగాత్రులకు ఇవ్వాల్సిన ఎక్స్గ్రేషియో 13 కోట్ల బకాయిలు విడుదల చేయాలని వ్నారు కోరారు. పెండింగ్ లైసెన్సులు వెంటనే ఇవ్వాలని వారు తెలిపారు. గీత వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు చివరి వారం లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు వారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిల్ గౌడ్, కార్యదర్శులు వేదిక ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో బొమ్మగాని నాగభూషణం సమన్వయ కార్యదర్శి, కె.వి.ఎల్.పి రాములు, పి.వీరాస్వామి, చాపల అంజయ్య, బోడోగే సైదులి, వి.రామ్మూర్తి, సతీష్, నాగార్జున, కె.జయరాములు, పబ్బు యాదయ్య, డిజి.నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

యుజీడీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని నందిని నగర్, సాయి నగర్ కాలనీలలో రూ.60 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి (యుజీడీ) పైప్ లైన్ నిర్మాణ పనులకు, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు కార్పొరేటర్లు పూజిత జగదీశ్వర్ గౌడ్, జగదీశ్వర్ గౌడ్, జలమండలి అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీలలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు మా కార్పొరేటర్లు, మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో ఈ రోజు నందినినగర్, సాయి నగర్ కాలనీలలో శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని తెలియచేసారు. అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతలలోప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి గాని, కార్పొరేటర్‌ల దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యమన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, యుజీడీ పైప్ లైన్, మంచి నీటి పైప్‌లైన్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారుల డీజీఎం నారాయణ, మేనేజర్లు శ్రీహరి, సునీత, శిరీష, నాయకులు కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ పంచాయత్ పరిషత్ అధ్యక్షునిగా జలీల్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : అల్ ఇండియా పంచాయత్ పరిషత్ రాష్ట్ర విభాగం తెలం గాణ పంచాయత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షు నిగా ఇల్లందు నియోజకవర్గంకు చెందిన ఎంఏ జలీల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బషీర్బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. అల్ ఇండియా పంచాయత్ పరిషత్ దక్షిణాది రాష్ట్రాల సమన్వయకర్త వీస్ విజయ్‌వర్మ పాకలపాటి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ కార్యదర్శి జన్ను రామచంద్రయ్య, ఆంధ్రప్రదేశ్ పంచాయత్ పరిషత్ అధ్యక్షులు ఎం చిదంబర రెడ్డి, బాలీవుడ్ నటి పూజా గంగూలీ, మహబూబ్ నగర్ జిల్లా కన్వీనర్ గంగాధర్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసారు. వీస్ విజయ్ వర్మ పాకలపాటి మాట్లాడుతూ ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎన్నికైన జలీల్ నేతృత్వంలో తెలంగాణ పంచాయత్ పరిషత్ కమిటీ గ్రామ స్వరాజ్య దిశగా కృషి చేయాలని అభిలషించారు. రాబోయే సర్పంచ్ ఎన్నికలలో సమర్థులు గ్రామ సంక్షేమం కోరుకొనే విద్యాధికులు పోటీ చేసేలా కార్యాచరణ చేపట్టాలని చిదంబర రెడ్డి, రామ చంద్రయ్యలు జలీల్‌కి విజ్ఞప్తి చేశారు. ఎంఏ జలీల్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం తూచా తప్పకుండా అమలయ్యేలా పోరాటం చేస్తామని, గ్రామ స్థాయి నుండి కమిటీలు వేసి పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా గోరింటాకు సంబరాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాలమూరు రెడ్డి సేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో బికే రెడ్డి కాలనీలోని బిబిఆర్ రెడ్డి కమ్యూనిటీ భవనంలో శనివారం గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహబూబ్నగర్ మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ బెక్కరి అనితా రెడ్డి మాట్లాడుతూ ఆషాడమాసంలో గోరింటాకు పెట్టుకోవడం మన సంప్రదాయమని, గోరింటాకు గౌరీదేవికి ప్రతీకగా భావిస్తారని తెలిపారు. ఈ మాసంలో నీటిలో మహిళలు ఎక్కువగా పనిచేయడం వల్ల చేతులు, కాళ్ల చర్మవ్యాధులకు గురయ్యే అవకాశం ఉన్నదని, కావున గోరింటాకు పెట్టుకుంటే అనారోగ్యం బారిన పడకుండా ఉంటారని ఆయుర్వేదం తెలియజేస్తుందని తెలిపారు. మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లు సరస్వతి మాట్లాడుతూ గోరింటాకు ధారణ వల్ల చర్మాసంబంధ గర్భాశయ సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు సరస్వతి, కార్యదర్శి స్వరూప, కోశాధికారి శోభ, వరలక్ష్మి నర్మదా, శశికళ, హేమలత, ఉదయశ్రీ వనజ, జ్యోతి, వంశీలత, శ్రీదేవి, సునీత, సుమతి, అనిత, శ్రీలత, గీత, మాధవి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు బ్యాంకులను దూరం చేస్తున్న పాలకులు

ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి వెంకటాచలం



విశాలాంధ్ర - హైదరాబాద్ : సామాన్య ప్రజలకు సేవలందించేందుకు జాతీయకరణ చేసిన బ్యాంకులను పాలకులు క్రమంగా ప్రజలకు దూరం చేసేందుకు, తద్వారా ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం విమర్శించారు. ప్రస్తుతం ఉద్యోగులు, కార్మికులు పొందుతున్న హక్కులు, ప్రయోజనాలు, సదుపాయాలు పాలకుల జాలీ, దయ వల్ల రాలేదని, అనేక పోరాటాలతో వాటిని సాధించుకు న్నామని స్పష్టం చేశారు. నేటి పాలకులు యాజమాన్యా లకు మద్దతునిస్తూ వారి పక్షం వహిస్తున్న నేపథ్యంలో యూనియన్లు, ఉద్యోగులు, కార్మికుల ఐక్యత మరింత అవసరమని, సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గమన్నారు. హైదరాబాద్ శనివారం 'కె.జె.రామకృష్ణారెడ్డి సభా ప్రాంగణం' (కాచిగూడ మ్యాడం అంజయ్య హాల్) లో కొటక్ మహింద్రా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ (కెఎంబిఇయు) 31వ జాతీయ మహాసభలను సిహెచ్.వెంకటాచలం ప్రారంభించారు. కెఎంబిఇయు అధ్యక్షులు వి.నాగరాజ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి, ఆహ్వాన సంఘం చైర్మన్ బి.ఎస్.రాంబాబు, కొటక్ మహింద్రా బ్యాంక్ సిహెచ్‌ఆర్‌ఓ అనుపమ్ కౌర, ఇఆర్ విభాగం హెడ్ రావ్ సాహెబ్ కంగనే, కెపిబిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి జయంత్, ఎఐకెబిఇఎ ప్రధాన కార్యదర్శి కె.జి.ఫణీంద్ర, ఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ.ఆర్.సుజిత్ రాజు, కెఎంబిఓఎ ప్రధాన కార్యదర్శి జితేంద్రప్రసాద్ షా, కెఎంబిపిడబ్లు ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేష్ బాబు తదితరులు ప్రసంగించారు. సభలో సిహెచ్.వెంకటాచలం ప్రారంభోపన్యాసం చేస్తూ కార్పొరేట్ శక్తులు ఉద్యోగుల శ్రమను మరింతగా దోపిడీ చేయడానికి పది గంటల పని విధానాన్ని తెచ్చేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక పోరాటాలతో సాధించుకున్న 8 గంటల పని విధానం స్థానంలో పది గంటల విధానాన్ని తీసుకువచ్చేందుకు పాలకులు, కార్పొరేట్ శక్తులు వ్యూహాలు రచిస్తున్నారని, ఇలాంటి చర్యల పట్ల ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆదివారం ఇంట్లో ఉద్యోగులు భార్యను ఎంత సేపు చూస్తారని, వారానికి 90 గంటలు పనిచేయాలని ఎల్ అండ్ టి సిఈఓ సుబ్రమణ్యం చేసిన వ్యాఖ్యల పట్ల వెంకటాచలం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ జెట్ వేగంతో అభివృద్ధి చెందుతున్నదని, అనేక అభివృద్ధి చెందిన దేశాలను అధిగమించి 3వ స్థానంలోకి చేరుకుందని, దేశం అమృత కాలంలో ఉందని కేంద్ర ప్రభుత్వం పదే పదే చెబుతున్నదని, అంటే అందరూ సుఖసంతోషాలతో బాగున్నారని అర్థమని, మరి దేశంలో ప్రస్తుతం ఆ పరిస్థితులు ఉన్నాయా అని వెంకటాచలం ప్రశ్నించారు. దేశంలో కార్మిక సంఘాలు ఉండొద్దని పాలకులు భావిస్తున్నారని, దేశంలో అసంఘటిత రంగంలో ఉన్న దాదాపు 40 కోట్ల మంది కార్మికులకు సంఘాలే లేవని, సర్వీస్ కండిషన్లు లేవని, వారు పనిచేస్తున్న గంటలకు లెక్కనే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు అభివృద్ధి జరుగుతున్న విషయం వాస్తవమే అయినప్పటికీ అది కొంత మందికే పరిమితమవుతున్నదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులలో సామాన్య ఖాతాదారుల సంఖ్య, సామాన్య ప్రజలకు సేవలు తగ్గడం లాభాలు, మార్కెట్ వాటా తగ్గడం ఈ సంస్థల మనుగడకే ప్రమాదమని, క్రమంగా బ్యాంకులు కార్పోరేటీకరణకు దగ్గరవుతున్నాయని అర్థం చేసుకోవాలని, పరిస్థితుల్లో మార్పుల కోసం చర్యలు చేపట్టాలన్నారు. బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణను వ్యతిరేకించిన వారే ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తుండడం దురదృష్టకరమన్నారు. బ్యాంకులు సృష్టిస్తున్న సంపద సంపన్నుల జేబుల్లోకి వెళుతున్నదన్నారు. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ కనీసం నిరసనను తెలిపే హక్కును కొల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉద్యోగులు, కార్మికులకు అవసరమైన వేతన సవరణ, సదుపాయాలు

ఘనంగా ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్లో వనమహోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: పర్యావరణ పరిరక్షణకు ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించబడే వనమహోత్సవం 2024,2025 సంవత్సరాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా వృక్షారోపణకు పెద్దపీట వేసి హరిత హారం, ఒక విద్యార్థి ఒక మొక్క వంటి పర్యావరణ కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారు. అందులో భాగంగానే శనివారం శ్రీ ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు,ఉపాధ్యాయులు కలసి వనమహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటటం, పర్యావరణంపై చైతన్యాన్ని కలిగించే ప్రసంగాలు, పాటలతో ఈ కార్యక్రమాన్ని ఆనందోత్సాహాలతో విజయవంతం చేశారు. "వృక్షో రక్షతి రక్షితః" నినాదంతో విద్యార్థులు పాఠశాల చుట్టూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచే ర్యాలీను నిర్వహించి, గ్రీన్ తెలంగాణ లక్ష్యానికి తోడ్పడే సందేశాన్ని సమాజానికి పంపించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి, వైస్ చైర్మన్ చైతన్య పున్నారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చిన్నారులు పాల్గొన్నారు.

రసాయనశాస్త్రంలో ప్రవీణ్ బొప్పీకి పీహెచ్‌డీ

విశాలాంధ్ర - పటాన్ చెరువు : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఎన్.వీ.వీ.డీ. ప్రవీణ్ బొప్పీ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. RP-HPLC, LC-MS, and QbD పద్ధతులను ఉపయోగించి అమిట్రిప్టిలైన్, హైడ్రాక్సీజైన్, డోరిపెనెం ఫార్మాస్యూటికల్ మోతాదు రూపాల విశ్లేషణాత్మక ప్రొఫైల్‌పై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయనశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్‌బాబు హరిదాస్యం శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రవీణ్ ఔషధ సమ్మేళనాలు, మలినాలను గుర్తించడం, లెక్కించడం కోసం అధునాతన ద్రవ క్రోమోటోగ్రాఫిక్ పద్ధతులను అభివృద్ధి చేసి ధృవీకరించినట్టు తెలియజేశారు. RP-HPLC ఉపయోగించి అమిట్రిప్టిలైన్ హైడ్రోక్లోరైడ్ కోసం ఇంప్యూరిటీ ప్రొఫైలింగ్, అస్సే పద్ధతి అభివృద్ధి, డిజైన్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్స్ ఉపయోగించి క్వాలిటీ బై డిజైన్ విధానం ద్వారా డోరిపెనెమ్‌లోని సేంద్రీయ మలినాలను లెక్కించినట్టు వివరించారు. ప్రవీణ్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వరి తెగులును అరికట్టడానికి బేయర్ ఫెలుజిత్

విశాలాంధ్ర-వరంగల్: వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ వంటి జీవశాస్త్ర రంగాలలో కీలక సామర్థ్యాలు కలిగిన ప్రపంచ సంస్థ బేయర్, వరి సాగులో పాముపోడ తెగులు నుంచి అన్ని మొక్కల భాగాలకు రక్షణ కల్పించడానికి వినూత్న శిలీంధ్ర సంహారిణి అయిన ఫెలుజిత్‌ను రూపొందించినట్టు బేయర్ క్రాప్ సైన్స్ విభాగం క్లస్టర్ కమర్షియల్ లీడ్ మోహన్ బాబు అన్నారు. ఈ ఉత్పత్తి జూలై నెల నుంచి దేశంలోని ముఖ్యమైన వరి పండించే రాష్ట్రాలన్నింటిలో అందుబాటులో ఉంటుందని చెప్పారు. తెగుళ్లు, వ్యాధుల నుంచి పెరుగుతున్న సవాళ్లతో వ్యవసాయ రంగం పోరాడవలసి వస్తున్న పరిస్థితుల్లో.. నేలలో ఉద్భవించే ఈ నిరంతర వ్యాధిని రైతులు ఎదుర్కొనే విధానాన్ని మార్చడానికి పెన్‌ఫ్లూఫెన్, టెబుకోనజోల్‌లను కలిపిన ప్రత్యేకమైన ఫార్ములాతో సిద్ధంగా ఉందన్నారు. దీనిని వినియోగిస్తే దాని ద్వంద్వ చర్య ద్వారా మొక్క దేహం అంతటా పాముపోడ తెగులు పెరుగుదలను సమర్థవంతంగా నిరోధిస్తుందన్నారు. రైతులకు పంట దిగుబడి నాణ్యతను పెంచే నమ్మకమైన పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. ప్రస్తుత మార్కెట్ ప్రమాణాల కంటే రెండు రెట్లు ఎక్కువ ఉండే ఉన్నతమైన సామర్థ్యాన్ని ఒక్క బేయర్ ఫెలుజిత్ స్ప్రే అందిస్తుందన్నారు. రైతులు అనేక రకాలను వినియోగించాల్సిన అవసరం, భారం లేకుండా సమర్థవంతమైన వ్యాధి నియంత్రణను సాధించవచ్చునని చెప్పారు. రైతులకు అత్యంత ప్రభావవంతమైన పరిష్కారం ఫెలుజిత్, ఇది వారి వ్యవసాయ పద్ధతులను క్రమబద్ధీకరిస్తూనే పోడ తెగులుపై అద్భుతమైన నియంత్రణను అందిస్తుందన్నారు. ప్రపంచ ఆహార భద్రతలో వరి కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, తక్కువ వ్యయ ప్రయాసలు, పద్ధతులతో వ్యాధిని సమర్థవంతంగా నిర్వహించడానికి, తమ వనరులను సరైన విధంగా వినియోగించడానికి పెరుగుతున్న వ్యవసాయ సవాళ్ల మధ్య లాభదాయకతను పెంచడానికి ఈ ఆవిష్కరణ రైతులకు అవకాశం ఇస్తుందన్నారు. ఫెలుజిత్ యూఎస్‌పీ దాని ద్వంద్వ క్రియ ఫార్ములాలో ఉంది, పోడ తెగులుకు కారణమయ్యే ప్రధాన జీవి అయిన రైజోక్టోనియాను ఎదుర్కోవడానికి రెండు క్రియాశీల పదార్థాల బలాలను ఇది మిళితం చేస్తుందన్నారు. ఈ వినూత్న విధానం ప్రభావవంతమైన నియంత్రణను నిర్ధారించడమే కాకుండా అప్లికేషన్ సామర్థ్యాన్ని మెరుపరచడం ద్వారా స్థిరమైన వ్యవసాయ పద్ధతులకు మద్దతు ఇస్తుందని చెప్పారు.

ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : జిల్లాలో అనేక ప్రభుత్వ భూములు ఉన్నాయని అక్కడికి గోశాలను తరలించాలని.. ఎన్కేపల్లిలోనే ఎందుకు ప్రభుత్వం ఏర్పాటు చేయలనుకుంటుందో అర్థం కావడం లేదని ఇదే విషయంపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించడం జరుగుతుందని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఎన్కేపల్లిలోని సర్వే నంబర్ 180లోని 99 ఎకరాల 14 గుంటల ప్రభుత్వ స్థలంలో గోశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అక్కడ సాగుచేసుకుంటున్న రైతులు వారం రోజుల నుంచి నిరసనలో కూర్చుకున్నారు. అయితే అప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యే రత్నం, మండల బీజేపీ అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖరరెడ్డి అధ్వర్యంలో ఎన్కేపల్లి రైతులకు బీజేపీ పార్టీ తరపున అండగా నిలుస్తూ మద్దతు ప్రకటిస్తున్నారు. ఇందులో బాగంగా శనివారం సాయంత్రం కొండా విశ్వేశ్వరరెడ్డి ఎన్కేపల్లి గోశాల స్థలాన్ని పరిశీలించి అక్కడ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు మద్దతు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోశాల ఏర్పాటుకు జిల్లాలో అనేక ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని వాటిని కాకుండా ఎన్కేపల్లిలోని సాగు భూములను పేద రైతుల నుంచి లాక్కోవడం సరైనది కాదని అన్నారు. ఇదే విషయంపై త్వరలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిని కలిసి పూర్తి వివరాలు వెల్లడించి ఎన్కేపల్లి రైతులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని రైతులకు భరోసానిచ్చారు. ఎన్కేపల్లిలోని ప్రభుత్వ స్థలం సాగుకు పనికి వచ్చేదని దీనిని ప్రభుత్వం దృష్టిలో ఉం చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, సీనియర్ నాయకులు ప్రభాకర్రెడ్డి, మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మోర నర్సింహ్మారెడ్డి, ప్రభాకర్ యాదవ్, రైతులు సికిందర్, దప్పు రమేష్, ఈశ్వర్ రైతులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో బీసీ వసతి గృహాలకు నిధులు మంజూరు చేస్తాం

సమీక్ష సమావేశంలో మంత్రులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అద్దెభవనాల్లో నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ వసతిగృహాలు, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలకు స్థల సేకరణ చేస్తే భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టల్ల భవనాల నిర్మాణానికి జిల్లాల వారీగా సల సేకరణ చేసి ప్రతిపాదనలు పంపించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నల్గొండ జిల్లాలో 32 బిసి సంక్షేమ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలు ఉండగా సుమారు 30 అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని, వీటన్నిటికి పక్కా భవనాలు నిర్మించేందుకు వెంటనే స్థలాలు చూసి ప్రతిపాదనలు పంపించాలన్నారు. కులవృత్తులను కాపాడటంలో భాగంగా ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల ఈత చెట్లు, 5 లక్షల తాటి చెట్లను నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని, అలాగే కాటమయ్య రక్షణ కిట్లను ఉమ్మడి నల్గొండ జిల్లాలో వీలైనంత ఎక్కువ మందికి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ఉమ్మడి నల్గొండ జిల్లాకు మరో 10 వేల రక్షణ కిట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మన ఊరు - మనబడి కింద చేపట్టిన పాఠశాల, సంక్షేమ వసతి గృహాలను పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని, అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కొండూరు జైవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రవాణాశాఖ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కీట్లను పంపిణీ చేశారు. అంతకుముందు మంత్రులు, శాసనమండలి చైర్మన్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ కార్యాలయావరణంలో వనమహోత్సవం కింద మొక్కలను నాటారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలన.. ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం

ఎంపీ చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : పదేళ్ల బిఆర్ఎస్ పాలన.. ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా అంటూ మాజీ మంత్రి హరీష్ రావుకు ఎంపీ.చామల కిరణ్ కిమార్ రెడ్డి సవాల్ విసిరారు. హరీష్ రావు అసెంబ్లీ సమావేశాలు పెట్టాలని, సమావేశాల్లో వారికి సరైన అవకాశం ఇవ్వాలని ఏకపాత్రాభినయం వేయాలని గోదావరి కృష్ణా జలాల మీద మాట్లాడటానికి సిద్ధం అని, కాంగ్రెస్ పార్టీ నాయకులకు అవగాహన లేదని అంటున్న హరీష్‌కి సవాల్ చేశారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన 100 శాతం రండి చర్చించుకుందాం.. ఇరిగేషన్ మాత్రమే కాదు నీళ్లు, నిధులు, నియామకాలపై చర్చకు సిద్ధమని తెలంగాణ ప్రజల ఆకాంక్షల అభీష్టం వ్యతిరేకంగా పదేళ్ల బిఆర్ఎస్ పాలన సాగిందని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాలపై తుంగలో తొక్కారని, పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ నేతలు చిత్తశుద్ధితో పనిచేస్తే తెలంగాణ అప్పుల కుప్పగా మారేది కాదన్నారు. పదేళ్ల పసిపాప ఎందుకు చిక్కిపోయింది, ఎంధుకు ఐసియూకి పోవాల్సి వచ్చిందో ప్రజలకు తెలియాలన్నారు. గోదావరి, బనక చర్ల టాపిక్ తెచ్చి ఆంధ్ర సెంటిమెంట్ రెచ్చగొట్టాలని పిచ్చి ఆలోచనతో బిఆర్ ఎస్ నేతలు ముందుకు వెళ్తున్నారని, బిఆర్ఎస్ నేతలను 70 ఎంఎంలో వారు చేసిన తపులను చూపిస్తామన్నారు. లోటు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రం ఎందుకు అప్పుల పాలయిందో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. 811 టీఎంసీల ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నపుడు కేటాయించారని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కంప్లీట్ చేయకముందే రూ.22 కోట్ల రూపాయల యాడ్స్‌తో బిఆర్ఎస్ ప్రచారం చేసుకుందని దుయ్యబట్టారు. 299 టీఎంసీల నీళ్లను కాపాడుకుంటామని ప్రజలకు చెబుదాం రండి హరీష్ రావుకు సవాల్ విసిరారు. తెలంగాణ ను సస్య శ్యామలం చేద్దాం అన్న ధ్యాస బిఆర్ఎస్ నేతలకి లేదని, నీళ్ల విషయంలో ఆంధ్ర ప్రాంతం వాళ్లు అన్యాయం చేస్తే.. బిఆర్ ఎస్ ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. తెలంగాణకు 968.. ఆంధ్రకు 511 వాట కేటాయించారని, పదేళ్లలో 968 టీఎంసీలను వాడుకునే ప్రయత్నం బిఆర్ఎస్ హయంలో జరగలేదన్నారు. తెలంగాణలో ఉన్న ఆర్థిక వనరులను తీసుకెళ్ళి కాళేశ్వరం పై పెడితే అది కూళేశ్వరం అయ్యిందని, పదేళ్ల దౌర్భాగ్య పాలన చేసి ప్రజెంటేషన్లు అంటూ కాంగ్రెస్ పార్టీ పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. బనక చర్ల పేరుతో రేవంత్ రెడ్డి చంద్రబాబు శిష్యుడు అంటూ కేసిఆర్ ఫాం హౌస్ లో బిగ్ బాస్ తరహా షో పెట్టండని, ప్రజా సమస్యలపై పోరాటం చేయలేని కేసిఆర్ కి ప్రతి పక్ష హోదా ఎందుకని నిలదీశారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: వికలాంగుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ సమక్షంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించి తన వంతు ప్రయత్నం తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హబీబ్ మియా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరబోయిన లక్ష్మయ్య, అధ్యక్షులు ముక్కు నర్సయ్యలు తెలిపారు. సమస్యలన్నీ కొంత సమయం తీసుకుని ఖచ్చితంగా పరిష్కారం చేసే బాధ్యత తనపై మీద ఉందని, ఈనెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, సమక్షంలో స్త్రీ-శిషు సంక్షేమ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శైలజ ఆధ్వర్యంలో దివ్యాంగ ఉద్యోగ సమస్యలపై సమావేశం వేర్పాటు చేయాలని మంత్రి తన వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు. దివ్యాంగ ఉద్యోగులకు ఆర్‌పి డబ్ల్యూడీ యాక్టు 2016 చట్టం ప్రకారం పెంచబడిన 4 శాతం రిజర్వేషన్ ను అన్ని డిపార్ట్మెంట్లలో కేటగిరీల వారిగా అమలు చేయాలని, ప్రమోషన్లలో ఆడిక్యూసి నిబంధనను తొలగించాలని, జీవో 317 బాధితులకు తక్షణమే వారి సొంత స్థలాలకు బదిలీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగ ఉద్యోగులు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఓడి సౌకర్యంతో కూడిన వెసులుబాటును కల్పించాలని, దివ్యాంగ ఉద్యోగులకు అదనపు సిఎల్‌లను మంజూరు చేయాలని కోరారు. ఇంటర్ చేంజ్‌కి అవకాశం కల్పించాలని, అన్ని రకాల కేటగిరి దివ్యాంగులకు 10 లోపు రోస్టర్ పోస్టులను కేటాయించి, ఉద్యోగులకు ఓపిఎస్ అమలు చేయాలన్నారు. సర్వీస్‌తో నిమిత్తం లేకుండా పూర్తి పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి మొక్క వెంకట నర్సయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మెంగ శ్రీనివాసరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు బొల్లం మహేందర్, పరికుప్పల కొండల్, ఎలుక నరేష్, పగిళ్ల వెంకన్న, మమ్మద్ మతిన్, అనిల్ వేద కుమారి పాల్గొన్నారు.

మైనారిటీ కమ్యూనిటీ హాల్ భవనం మంజూరు

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మొగిలిగిద్ద గ్రామంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిర్వహింన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మొగలిగిద్ద గ్రామంలో మైనారిటీ జనాభా ఎక్కువ ఉన్నందున మైనార్టీలకు కమ్యూనిటీ హాల్ షాది ఖానా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి చేసిన వెంటనే మొగలిగిద్ద గ్రామంలో కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మైనార్టీ కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం 50 లక్షల రూపాయలు మంజూరు అయిన నేపథ్యంలో ప్రొసీడింగ్‌ను మొగిలిగిద్ద నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా మొగిలిగిద్ద మైనార్టీ నాయకులు వీర్లపల్లి శంకర్‌కు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, బాల్రాజ్ గౌడ్, అంబటి రాజు, మైనారిటీ నాయకులు మాలిభాయ్, రావుఫ్, పాషా, హజి, లతీఫ్, ఖలీల్, బబ్లు, షాబీర్, ఫాజిల్, అమిర్, సమీర్, తబ్రేజ్, అంబటి రంజిత్, భరత్, కుమార్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ యూకే ప్రీ డిపార్చర్ బ్రీఫింగ్‌కు భారతీయ విద్యార్థులకు ఆహ్వానం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: యుకెలో అంతర్జాతీయంగా విద్యా అవకాశాలు, కల్చరల్ ఎక్స్ఛేంజ్ సంస్థ బ్రిటిష్ కౌన్సిల్ భారతదేశం నుండి విద్యార్థులను 29 జూలై 2025 మంగళవారం నాడు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు (భారత కాలమానం ప్రకారం) జరిగే స్టడీ యుకె ప్రీ-డిపార్చర్ బ్రీఫింగ్‌లో పాల్గొనడానికి ఆహ్వానిస్తోంది. ఈ వర్చువల్ ఈవెంట్ యూకే ఉన్నత విద్యా సంస్థలో చదువుకోవడానికి ఆఫర్ పొందిన విద్యార్థుల కోసం రూపొందించబడింది. వర్చువల్ బ్రీఫింగ్ సెషన్ యుకెలో జీవితం, అధ్యయనానికి సిద్ధం కావడానికి సంబంధించిన కీలక అంశాలపై మంచి మార్గదర్శకత్వం, నిపుణుల సలహాలను అందిస్తుంది. స్టూడెంట్ వీసా దరఖాస్తులను నావిగేట్ చేయడం, వసతి కోసం అన్వేషించడం నుండి యుకె పూర్వ విద్యార్థుల నుండి నేరుగా సమాచారం తెలుసుకోవడం వరకు, ఈ సెషన్ విజయవంతమైన విద్యా ప్రయాణానికి అవసరమైన విశ్వాసం, జ్ఞానంతో విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. యుకె యూనివర్సిటీలు, బియుఐఎల్ఏ ప్రతినిధులు కూడా హాజరవుతారు, విద్యార్థులకు నేరుగా సమాచారం ఇస్తారు, యుకె ఉన్నత విద్యా అనుభవం గురించి లోతైన అవగాహనను అందిస్తారు.

రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల బకాయిలు వెంటనే చెల్లించాలి : కవిత

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: గత ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు హామీల తాలుకా బకాయిలు వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం వేముల్ నర్వ, కాకునూర్ గ్రామాల్లో జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సి కవిత పర్యటించారు. వేముల్ నర్వ గ్రామంలో జాగృతి కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం కాకునూర్ గ్రామంలో పోస్ట్ కార్డు ఉద్యమంలో గ్రామస్తులతో కలిసి పాల్గొన్నారు. కవిత మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రజలకు హామీలు ఇచ్చి గద్దెనెక్కరన్నారు. ప్రతి ఇంటి ఆడపడుచుకు ప్రతినెల ఇస్తానన్న గృహ లక్ష్మి హామీ 2,500 చొప్పున ఇప్పటివరకు అయినా 18 నెలలు పూర్తి బకాయిలను వెంటనే వారివారి అకౌంట్లో వేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు కళ్యాణాలు చేసుకున్న యువ జంటకు కళ్యాణ లక్ష్మి తరపున ఇస్తానని హామీ ఇచ్చిన ఇవ్వాల్సిన తులం బంగారం ఇవ్వాలన్నారు. వృద్ధాప్య పింఛన్లు పెంచడం మాట పక్కన పెడితే, గత మూడు నెలలుగా వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం దారుణంగా దెబ్బతిన్నదన్నారు. కాంగ్రెస్ తరపున ఓట్లు అడగటానికి వచ్చే ప్రజాప్రతినిధులను గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై నిలదీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : కూన

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: ప్రణీత్ యాంటిలియా కాలనీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు. శనివారం నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ పరిధి ప్రణీత్ ఆంటీలియా కాలనీ వాసులు నిర్వహించిన విలేకరుల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ మల్లంపేట్ ఆంటీలియా కాంపౌండ్ వెనుక భాగంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 170 ఉప సర్వే నంబర్లు,రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి అక్రమ దందాల కొరకు కుట్ర పొందుతున్నారని, ఆ సర్వే నంబర్లు నిషేధిత జాబితాలో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం సర్వే నిర్వహించి ఈ భూమిని మల్లంపేట్ ప్రజల కోసం కమ్యూనిటీ హాల్, ఫంక్షన్ హాల్ వంటి ప్రజా ప్రయోజనార్థ కార్యక్రమాల కోసం వినియోగిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా ఎగ్జిట్ 4ఎ నుండి బాచుపల్లి, ఎగ్జిట్ 4ఎ నుండి రెడ్డి ల్యాబ్స్ గుండా దర్గా వరకు 100 అడుగుల రోడ్లను పూర్తి చేస్తామని తెలియజేశారు. ఈ రహదారి అభివృద్ధి కొరకు నిధుల విడుదల కోసం శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలసి చర్యలు తీసుకుంటానన్నారు. దీర్ఘకాలికంగా ఉపయోగపడే స్థిరమైన పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎటువంటి రియల్ ఎస్టేట్ దందాలకి భయపడాల్సిన అవసరం లేదని కాలనీ వాసులకి హామీ ఇస్తూ హైడ్రా అధికారులతో, నిజాంపేట్ మున్సిపాలిటీ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ఎఫ్‌టీపీసీ ఇండియా తెలంగాణ మీడియా డైరెక్టర్‌గా చంద్రశేఖర్

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : భారతీయ చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ వేదికలపై అనేక సాంకేతిక, వ్యాపారాత్మక సదస్సులను ఏర్పాటు చేస్తూ సినీ పరిశ్రమ మేధోసంపత్తికి వారధిగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ అఫ్ ఇండియా తెలంగాణ శాఖ మీడియా డైరెక్టర్‌గా జర్నలిస్ట్ గాజుల చంద్రశేఖర్‌ని నియమించారు. సంస్థ అధ్యక్షులు చైతన్య జంగా, కార్యదర్శి విజయ్ వర్మలు ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. బాలీవుడ్ నటి పూజా గంగూలీ, విలక్షణ నటులు శుభోదయం సుబ్బారావులు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో బాలీవుడ్ సింగర్ అస్మిత, తెలంగాణ మీడియా చైర్మన్ కిరణ్ బేజాడి, నటీమణులు రోజాభారతి, కవితలు విచ్చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చైతన్య జంగా మాట్లాడుతూ అంతర్జాతీయ సాంకేతికను అందిపుచ్చుకోవటం ఇతర రాష్ట్రాల, దేశాల వారు తెలంగాణలో చిత్రీకరణ జరుపుకొనేలా ప్రోత్సహించడానికి ఎఫ్ టీ పీ సి కృషి చేస్తుందని అన్నారు. కార్యదర్శి విజయ్ వర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాల మేరకు హైదరాబాద్‌ని అంతర్జాతీయ చిత్రపరిశ్రమకు అడ్డాగా మార్చే దిశగా తమవంతు ప్రయత్నాలు చేస్తామని వెల్లడించారు. మీడియా డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ స్థానిక కళాకారులు సాంకేతిక నిపుణులకు జాతీయ స్థాయిలో అవకాశాలు దక్కేలా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఈ అవకాశం కల్పించిన అధ్యక్ష కార్యదర్శులకు కిరణ్ బేజాడి ధన్యవాదాలు తెలియచేసారు. తెలంగాణలో వున్న అద్భుతమైన లొకేషన్స్‌కి బాలీవుడ్‌లో ప్రాచుర్యం కల్పిస్తానని నటి పూజా గంగూలీ తెలిపారు. పలు కార్యక్రమాలతో చలన చిత్ర అభ్యున్నతికి కృషి చేస్తున్న ఎఫ్‌టీపీసీని విలక్షణ నటులు శుభోదయం సుబ్బారావును అభినందించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై హర్షం

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్, నాచారం డివిజన్, మీర్పేట్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కప్పరా సాయి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై మల్లాపూర్‌లోని ఎలిఫెంట్ సర్కిల్‌లో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని కృతజ్ఞతగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర క్యాబినెట్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు ఆమోదం తెలుపడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్పేట్ డివిజన్ అధ్యక్షులు అంజయ్య, నాచారం డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, సినియర్ నాయకులు కృష్ణ రెడ్డి, వి.ఎస్. ప్రకాష్ రెడ్డి, ఉమేష్ గౌడ్, దంతురి రాజు, నెమలి అనిల్ కుమార్, ఉదేయ్, మహేష్ యాదవ్, బాలరాజ్, తిరుపతి, సురేష్, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, శ్రవణ్, ఫాసుదిన్, శైలజ, సోనీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బసవతారకనగర్ గుడిసె వాసులకు అక్కడే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఒక న్యాయం గూటి కోసం కూటి కోసం బ్రతుకుతున్న ప్రజలకు ఒక న్యాయం. పాలకులు ఎవరైనా కావచ్చు పార్టీలు ఏవైనా కావచ్చు కానీ పేద ప్రజలకు చేస్తున్న అన్యాయం ఒకటే. అందుకే ఈరోజు ఎర్రజెండా పార్టీలు పేదవారికి అండగా నిలిచాయి. బసవతారక నగర్ ప్రజలకు ఇక్కడే ఇల్లు నిర్మించి ఇచ్చేవరకు ప్రజా ఉద్యమాలు చేసి ప్రభుత్వాల మెడలు వంచుతామని, పట్టాలు ఇప్పించే వరకు ఈ పోరాటం ఆగదని శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్యదర్శి సిపిఐ రామకృష్ణ, పానుగంటి పర్వతాలు తెలిపారు. దాదాపు 30 సంవత్సరాల నుండి గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వీరికి ఇక్కడే ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ లిస్టు కార్డులు ఉన్నాయని, కొంతమందికి ఇక్కడే పెళ్లిళ్లు జరిగి, పిల్లలు పుట్టారని, కొంతమంది ఇక్కడ చనిపోయి ఇక్కడే దహన సంస్కారాలు చేశారన్నారు. ఇలా ఎంతో కాలంగా ఇక్కడే నివసిస్తున్న వీరికి న్యాయం జరగాలన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గుడిసెలు కూల్చినప్పుడు, ఈ రోజు ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడికి వచ్చి పరామర్శించి వీళ్లకు తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేద ప్రజలు కనపడడం లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కె చందు యాదవ్ శేర్లింగంపల్లి సిపిఐ సహాయ కార్యదర్శి. బి నారాయణ. కే కృష్ణ సిపిఎం జగదీష్ సిపిఎం తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ వైపు అడుగులు

- పర్యావరణ హితం... కరెంట్ బిల్లులు ఆదా
- ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న డిస్కంలు
- ముమ్మరంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- 10,931 ఇళ్లకు సౌరఫలకాల ఏర్పాటు

విశాలాంధ్ర- సచివాలయం: రోజు రోజుకూ విద్యుత్తు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారుల్ని సౌర విద్యుత్తు వైపు మరల్చే దిశగా కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాయితీపై ఇళ్లకు సౌరవిద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు 'ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన' ప్రవేశపెట్టి అమలు చేస్తున్నది. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కేంద్రం రూపొందించిన ప్రధాన మంత్రి సూర్యఘర్ బిజిలి యోజనకు ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు వినియోగదారుల్లో అవగాహన పెంచేదిశగా కృషి చేస్తున్నాయి. రాష్ట్రంలోని ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ డిస్కంల పరిధిలో ఈ పథకం అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. కరపత్రాలు, వాట్సప్ గ్రూపుల్లో ప్రచారంతోపాటు ఆయా జిల్లాల్లోని కలెక్టర్లకు ప్రత్యేకంగా సీఎండీలు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈ పథకాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సూర్యఘర్ పథక ప్రయోజనాలపై విద్యుత్ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తుండడంతో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి ఇంధన శాఖ ఆమోదముద్ర వేయడంతో పాటు కనెక్షన్ల జారీ ప్రక్రియను వేగవంతం చేసింది. ఒక్క ఏపీసీపీడీసీఎల్ పరిధిలోనే 10 వేల మందికి పైగా ఈ ప్రయోజనాలు పొందుతున్నారు. ముఖ్యంగా డిస్కం పరిధిలో ఇప్పటి వరకు 1,95, 270 మంది ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలో రికార్డు స్థాయిలో 81,711 రిజిస్ట్రేషన్లు జరగడం విశేషం. గుంటూరులో అన్ని జోన్స్ కంటే అతి తక్కువ రిజిస్ట్రేషన్లు జరిగాయి. కాగా డిస్కం పరిధిలో ఇప్పటివరకు 10,931 గృహాలకు కనెక్షన్లు అందజేశారు. తద్వారా ఇంధన సంస్థకు 38.7 మెగావాట్ల విద్యుత్ ఆదా అయింది.

కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు అనేక రాయితీలు ప్రకటిస్తోంది. 200 యూనిట్ల కంటే తక్కువ వినియోగించే వారికి ఇప్పటికే ఉచిత విద్యుత్ అందజేస్తోంది. విద్యుత్ సంస్థలకు ఆ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. రాష్ట్రంలో ఆరు లక్షల మందికి ఉచితవిద్యుత్ అమలవుతుంది. వీరిలో 75 శాతం మందికి రూఫ్‌టాప్‌లను ఏర్పాటుచేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ప్రక్రియ వల్ల సుమారు 2 లక్షల మందికి మేలు చేకూరనుంది. మిగిలిన వారికి గ్రౌండ్ మౌంటెడ్ ఎలివేషన్ ప్రక్రియలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేసి సౌర విద్యుత్ అందించనుంది. సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకున్న గృహంలో విద్యుత్ బిల్లుల ఆదాతో పాటు అదనంగా ఉన్న విద్యుత్‌ను విద్యుత్ సంస్థలు కొనుగోలు చేస్తాయి. దీంతో వినియోగదారుడికి అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. రానున్న మూడు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా 10 లక్షల కనెక్షన్లు మంజూరు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ పథకం అమలును రాష్ట్ర ఇంధన శాఖ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కనెక్షన్లు తీసుకున్న వినియోగదారుడికి కేవలం ఐదు సంవత్సరాల్లోనే పెట్టుబడి మొత్తం వెనక్కి వచ్చేస్తుందని చెబుతున్నారు. దీంతోపాటు మిగులు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం కూడా సమకూరుతుందని అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసి, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఇక భవిష్యత్ తరాల విద్యుత్ అవసరాలు తీర్చాలంటే తప్పనిసరిగా సూర్యఘర్ అమలు చేసుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

మంత్రులు జనార్ధన్, ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో-నంద్యాల: పులివెందులకు సైతం నీళ్లు ఇచ్చిన చరిత్ర తెలుగుదేశం పార్టీదని, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో మాట్లాడే అర్హత వైసీపీకి లేదని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజకుమారి గణియా అధ్వర్యంలో శనివారం జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గౌరు చరితారెడ్డి, గిత్త జయసూర్యలతో కలిసి హాజరయ్యారు. మంత్రులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఇరిగేషన్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ రైతు సమస్యలను పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. నీటి సంఘాల సభ్యులు బాధ్యతగా వ్యవహరిస్తూ రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పార్టీలకతీతంగా రైతులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. గోరుకల్లు రిజర్వాయర్‌ను మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు ప్రారంభిస్తే, గతంలో తెలుగుదేశం ప్రభుత్వం రూ.300 కోట్లు ఖర్చు చేయడంతో నేడు ఆ రిజర్వాయర్ కడప, నంద్యాల జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇస్తుందన్నారు. సీఎం చంద్రబాబు ఆశీస్సులతోనే అవుకు రిజర్వాయర్ కు నీళ్లు తీసుకురాగలిగామన్నారు. గాలేరు, నగరి, సుజల స్రవంతి ఇబ్బందులను పరిష్కరించి అవుకు ప్రాజెక్టుకు నీళ్లు తీసుకొచ్చి రిజర్వాయర్ నింపిన చరిత్ర టీడీపీదన్నారు. గత ప్రభుత్వం అలగనూరుకు కనీసం రూ.మూడు కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. సముద్రంలోకి వృధాగా పోతున్న నీటిని బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు తీసుకురావడానికి ప్రయత్నిస్తుంటే రాజకీయ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. త్వరలో బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రమంత్రిని కలిసి దాని ఆవశ్యకతను తెలియజేయనున్నట్లు మంత్రులు పేర్కొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులకు త్వరలో శుభవార్త

మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మునిసిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ శనివారం తెలిపారు. కార్మికుల డిమాండ్లను సాధ్యమైనంత వరకు పరిష్కరించాలని సీఎం చంద్రబాబు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఆదేశించారని చెప్పారు. కార్మికుల డిమాండ్లపై కేబినెట్ సబ్ కమిటీ అనేక సార్లు చర్చించిందన్నారు. కార్మికులకు మేలు చేసేలా మంత్రివర్గ ఉపసంఘం సానుకూల నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆర్థిక శాఖతో చర్చించి ప్రభుత్వ నిర్ణయాన్ని త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన అర్జీదారులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను నేతలకు వివరించి వినతులు అందించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, సెంట్రల్ జనరల్ సెక్రటరీ వైకుంఠం ప్రభాకర్ చౌదరి అర్జీలు స్వీకరించారు. గతంలో జరిగిన రీ సర్వేలో భాగంగా ఆన్ లైన్‌లో పేర్లను తారుమారు చేసి తమ భూములను మరొకరి పేర్ల పైకి ఎక్కించారని... దీని వెనుక వీఆర్వో హస్తం ఉందని, అతనిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని అనకాపల్లి జిల్లా కశింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన పాసిలి శివసత్యనారాయణ, కరక వెంకట అప్పారావు తదితరులు అర్జీ అందజేశారు. కృష్ణా జిల్లా గన్నవరం, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం, రెడ్డిగూడెం మండలం, ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై నేతలకు అర్జీలు అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థుల ఆరోగ్యం... భద్రతే ముఖ్యం

- అనారోగ్యం బారినపడితే ఉచిత కార్పొరేట్ వైద్యం
- వసతిగృహాల మరమ్మతులకు రూ.142 కోట్లు
- త్వరలో సీసీ కెమెరాలు: మంత్రి డోలా

విశాలాంధ్ర- సీతానగరం/ పార్వతీపురం: జిల్లాలో గురుకులాలు, వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, భద్రత ఎంతో ముఖ్యమని, వీటిలో రాజీపడవద్దని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి సాంఘిక సంక్షేమ అధికారులు, వసతి గృహ వార్డెన్లతో కలెక్టర్ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సీతానగరం మండలం జోగమ్మపేటలో అంబేద్కర్ గురుకులాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గురుకులాలు, వసతి గృహాల్లో ఖాళీలు భర్తీ చేయాలని, విద్యార్థుల ప్రవేశాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వసతి గృహాల మరమ్మతులకు రూ.143 కోట్లు నిధులు ఇచ్చామని, జిల్లాకు రూ.మూడు కోట్లు మంజూరుచేసినట్లు చెప్పారు. అనారోగ్యం బారిన పడిన పిల్లలకు అత్యవసరమైతే కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలో సీసీ కెమెరాలను ప్రతీ హాస్టల్ కు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. నాణ్యమైన బియ్యాన్ని విద్యార్థులకు అందిస్తున్నామని, మంచాలు, బెడ్స్ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కుక్ లకు శిక్షణ ఇవ్వాలని సీఎం ఆదేశించారని అన్నారు. విద్యార్థుల కొరకు జిల్లా సంక్షేమ ఆరోగ్యాధికారిని నియమించామని తెలిపారు. జిల్లాలో ఉత్తీర్ణత 99 శాతం ఉందని, వంద శాతం సాధించాలన్నారు. అవసరమైతే ట్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు పార్వతీపురం వార్డు, సీతానగరం మండలం నిడగల్లు గ్రామంలో 'సుపరిపాలన తొలి అడుగు'లో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత, పార్వతీపురం, విజయనగరం జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారులు ఇ.అప్పన్న, ఎం.అన్నపూర్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వర రావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు, తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి

ముఖ్యమంత్రికి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని, జీవో 77 రద్దు చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థిలోకం వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, మెస్ చార్జీలు తదితర బకాయిలు రూ.6400 కోట్లు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు అన్యాయం చేసే విధంగా జీవో 77 విడుదల చేసింది. రాష్ట్రంలో చాలా స్కూళ్లు, కళాశాలలు, హాస్టళ్లలో వసతులు అరకొరగా ఉన్నాయి. గత ఎన్నికల సందర్భంగా మీరు అధికారం చేపట్టిన వెంటనే విద్యారంగంలో సమూల మార్పులు చేస్తామని, మెగా డీఎస్సీ నిర్వహించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ ఆయా హామీలు అమలుకు నోచుకోలేదు. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోరుతూ... ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ తదితర బకాయిలు, డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయాలని, పీజీ విద్యకు శాపంగా పరిణమించిన జీవో నెం.77 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యాపిత ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి పై సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

'జన సురక్షా' బిల్లు దారుణం: సీపీఐ విమర్శ

న్యూదిల్లీ: 'అర్బన్ నక్సల్స్' నియంత్రణ పేరుతో మహారాష్ట్ర అసెంబ్లీలో 'జన సురక్షా' బిల్లును ఆమోదించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శనివారం పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ బిల్లు ప్రత్యేకించి వామపక్ష సంస్థలను లక్ష్యంగా చేసుకుందని, రాష్ట్రంలో హింసాత్మక కార్యకలాపాల్లో పాత్ర గల మితవాద సంస్థలను విస్మరించిందని విమర్శించింది. బిల్లులో ఆ మితవాద సంస్థలను పేర్కొనకపోవడం శోచనీయమని తెలిపింది. ఈ బిల్లు బీజేపీ పాలనలో ఫాసిస్టు, ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతులకు నిదర్శనమే తప్ప మరొకటి కాదని పేర్కొంది. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని సీపీఐ డిమాండ్ చేసింది.

బెంగాలీ మాట్లాడే వారిపై దాడులా?

బీజేపీ పాలిత రాష్ట్రాలలో ప్రత్యేకించి దిల్లీ, అసోం, ఒడిశాలో పోలీసులు, పాలనా యంత్రాంగం బెంగాలీ మాట్లాడే భారత పౌరులను వేధించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండించింది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వలసదారులను గుర్తించే నెపంతో బెంగాలీ మాట్లాడే భారత పౌరులను, ప్రత్యేకించి ముస్లింలను పోలీసులు అరెస్టు చేసి వేధించడాన్ని తప్పుపట్టింది. ఇది ఫాసిస్టు లక్షణమని, ఇటువంటి చర్యలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నదని పేర్కొంది. తక్షణమే వేధింపులు, అరెస్టులు నిలిపివేయాలని, బెంగాలీ మాట్లాడే భారత పౌరులకు న్యాయం చేసి, పరిహారం అందజేయాలని డిమాండ్ చేసింది.

15న భూమిపైకి శుభాంశు బృందం

వారం రోజులు క్వారంటైన్‌కే పరిమితం

న్యూదిల్లీ: యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు భూమికి తిరిగి రానున్నారు. జులై 15న కాలిఫోర్నియా తీరంలో అడుగుపెట్టిన వెంటనే వ్యోమగాములను ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. శుభాంశుతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ-విస్నియెస్కీ, టిబర్ కపు అంతరిక్షంలో భారరహిత స్థితిని అనుభవించిన కారణంగా భూ వాతావరణానికి వారి శరీరాలు అలవాటుపడేందుకు వీలుగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు ఇస్రోకు చెందిన వైద్యాధికారులు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారని అన్నారు. అంతరిక్షం నుంచి భూమికి బయల్దేరే ముందు కూడా వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. క్వారంటైన్‌లో ఉన్న వారం రోజుల్లో అంతరిక్ష యాత్ర వల్ల వ్యోమగాముల శరీరాలపై పడిన ప్రభావాన్ని వైద్యాధికారులు అధ్యయనం చేస్తారని తెలిపారు. వారి శరీరంలో రక్త ప్రవాహం, హృదయనాళాలు, మెదడు పనితీరును అంతరిక్ష యాత్ర ఎలా ప్రభావితం చేసిందనే విషయాలను పరిశీలిస్తారన్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు త్వరలో భూమికి తిరిగి రానున్నట్లు అంతరిక్ష పరిశోధన సంస్థ- నాసా వెల్లడించింది. యాక్సియం-4 మిషన్ ద్వారా శుభాంశు బృందం ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి గతనెల 25న నింగిలోకి దూసుకెళ్లింది. 28 గంటల ప్రయాణం తర్వాత వారు ఐఎస్ఎస్‌లో ప్రవేశించారు. దాదాపు రెండు వారాలుగా ఐఎస్ఎస్‌లో ఉన్న శుభాంశు శుక్లా... ఏకంగా 96.5 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు యాక్సియం స్పేస్ వెల్లడించింది. వ్యోమగాములు ఇప్పటివరకు దాదాపు 230 సార్లు భూమిని చుట్టి వచ్చారని పేర్కొంది.

పేర్ని వ్యాఖ్యలపై మండిపడ్డ టీడీపీ నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'చీకట్లో నరికేయండి' అని వైసీపీ నేత పేర్నినాని చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల సత్యనారాయణ, టీడీపీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు... పేర్ని నాని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. టీడీపీ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొనకళ్ల మాట్లాడుతూ గత ఎన్నికల ఫలితాల్లో జగన్ నిరంకుశ, అవినీతి పరిపాలనకు ప్రజలు గుణపాఠం చెప్పి... ప్రతిపక్ష హోదా దక్కకుండా ఘోరంగా ఓడించారని, కూటమికి అధిక మెజార్టీతో అధికారాన్ని ఇచ్చారని అన్నారు. మీరు ఓడిపోయిన అవమానంతో, అసూయతో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రప్పా... రప్పా... చీకట్లో కన్నుకొడితే పని అయిపోవాలి... తలలు లేచిపోవాలి... అని పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం? అని ప్రశ్నించారు. బోడె ప్రసాద్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా పర్యటనలో వైసీపీ కార్యకర్త రప్పా రప్పా అనే ప్లకార్డు పట్టుకుంటే... మీడియా సమక్షంలో దాన్ని జగన్ సమర్థించారంటే ఆయన మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం ద్వారా ప్రజల మన్ననలు పొందాలని చంద్రబాబు తరచూ చెబుతుంటారని, వైసీపీ నేతలు మాత్రం తలలు నరకండి, హత్యలు చేయండి అని చెబుతున్నారని విమర్శించారు.

ఆర్కిటెక్చర్ వర్సిటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి: షర్మిల

పోలవరం ఎత్తు తగ్గింపు డైవర్ట్ చేయడానికే తెరపైకి బనకచర్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కడపలోని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) అధికారులతో భేటీ అయిన షర్మిల, విద్యార్థుల భవిష్యత్ కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సీఓఏ అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేశారని, ఇప్పుడు సర్టిఫికెట్లు రాక వందలాది మంది విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయన్నారు. సీఓఏ అనుమతులు లేకుండా లైసెన్సులు రావడం లేదని విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ విద్యార్థుల కష్టాలు తాను ప్రత్యక్షంగా చూశానన్నారు. ఆనాడు అనుమతులు లేకుండా యూనివర్సిటీ ప్రారంభించడం పెద్ద తప్పు అని, ఈ తప్పు సరిదిద్దాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. రెండేళ్లుగా విద్యార్థులు పోరాటం చేస్తున్నా ఫలితం లేదన్నారు. వెంటనే సీఓఏ అనుమతులు తీసుకొని విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరామన్నారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి తప్పును సరిదిద్దుతామని హామీ ఇచ్చారన్నారు. నెల రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే దిల్లీకి వెళతామని హెచ్చరించారు.

పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.7 నుంచి 41.15 తగ్గించి చేసిన అన్యాయంపై దృష్టి మళ్లించడానికే బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు తెరపైకి తీసుకువచ్చారని వైఎస్ షర్మిల విమర్శించారు. బనకచర్లకు అటవీ శాఖ అనుమతులు రావడం అసాధ్యమని చంద్రబాబుకూ తెలుసునన్నారు. అయినా అడ్వాన్స్ మొబిలైజేషన్ కింద నిధుల సమీకరణ చేయడమే వెనకున్న అజెండా అని విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరంను కేవలం రూ.25 వేల కోట్ల మిగులు కోసం ప్రాజెక్ట్‌ను ముంచేశారని విమర్శించారు. ఆర్ అండ్ ఆర్ ఎగ్గొట్టేందుకు ఎత్తు తగ్గించారన్నారు. 2019 లెక్కల ప్రకారం పోలవరం అంచనా రూ.55 వేల కోట్లు కాగా, 2024లో సవరించిన అంచనా రూ.30 వేల కోట్లు అని, ఇందుకోసం 45 మీటర్ల నుంచి 41 మీటర్లకు ఎత్తు తగ్గించి రూ.25 వేల కోట్లు మిగిల్చారని తెలిపారు. ఇంత అన్యాయం జరుగుతుంటే రాష్ట్రానికి చెందిన ఒక్క ఎంపీ కూడా పార్లమెంటులో మాట్లాడలేదన్నారు. పోలవరం ప్రాజెక్టును ఒక బ్యారేజ్‌గా మార్చారని విమర్శించారు. గ్రావిటీ ప్రాజెక్టును లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా మార్చారని, ఇది ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు వెన్నుపోటు పొడిచినట్లేనన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కంటే వారి సొంత ప్రయోజనాలే ముఖ్యమన్నారు. పోలవరాన్ని, జలయజ్ఞం ప్రాజెక్టులను పక్కన పెట్టి బనకచర్ల అనుమతుల కోసం అంటూ కేంద్రం చుట్టూ తిరుగుతున్నారని, ఈ ప్రాజెక్టుకు అవసరమైన రూ.80 వేల కోట్లు ఎక్కడ నుంచి తెస్తారు, ఎవరి నెత్తిమీద ఈ భారాన్ని మోపాలని చూస్తున్నారని ప్రశ్నించారు. ఇవన్నీ పక్కన పెట్టి ముందు పోలవరం సంగతి చూడాలని, జలయజ్ఞం కింద అసంపూర్తిగా ఉన్న దాదాపు 30 ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరారు. బనకచర్లకి అన్ని అనుమతులు వచ్చాక పార్లమెంటు వేదికగా పూర్తి ఖర్చు కేంద్రం ఇచ్చేలా హామీ తీసుకువచ్చి, అప్పుడు బనకచర్ల కట్టండని షర్మిల సూచించారు.

అధ్యాపకుడి లైంగిక వేధింపులు....

కళాశాలలో నిప్పంటించుకున్న విద్యార్థిని

భువనేశ్వర్: ఒడిశాలో దారుణం చోటుచేసుకుంది. ఓ ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు భరించలేని ఓ విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యింది. న్యాయం జరగడం లేదనే ఆవేదనతో కళాశాల ప్రాంగణంలోనే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. దీంతో 90 శాతం కాలిన గాయాలతో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన తోటి విద్యార్థికి మంటలు అంటుకోవడంతో అతను కూడా తీవ్రంగా గాయపడ్డాడు. బాలేశ్వర్‌లోని ఫకీర్ మోహన్ కళాశాలలో ఒక విద్యార్థిని ఇంటిగ్రేటెడ్ బీఈడీ రెండో సంవత్సరం చదువుతోంది. ఓ విభాగాధిపతి సదరు విద్యార్థినిని కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. తనమాట వినకుంటే భవిష్యత్ నాశనం చేస్తానని బెదిరించసాగాడు. ఇవి భరించలేని ఆ విద్యార్థిని జూన్ 30న కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. వారంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వేధింపులకు గురిచేస్తున్న అధ్యాపకుడిని రక్షించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన బాధిత విద్యార్థిని తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వారం రోజులుగా కళాశాల ఆవరణలో నిరసన చేపట్టింది. శనివారం ఉదయం కూడా తోటి విద్యార్థులతో కలిసి కళాశాల ముందు ఆందోళనకు దిగింది. అదే సమయంలో ప్రిన్సిపల్ కార్యాలయానికి ఒక్కసారిగా పరుగెత్తిన ఆమె... పెట్రోల్ పోసుకొని ఒంటికి నిప్పంటించుకుంది. హాహాకారాలతో పరుగెత్తుతుండగా తోటి విద్యార్థులు ఆమెను రక్షించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితులను ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. లైంగిక వేధింపులకు సంబంధించి విద్యార్థిని ఫిర్యాదు చేసిందని, దీనిపై అంతర్గత కమిటీ దర్యాప్తు చేపడుతోందని కళాశాల ప్రిన్సిపాల్ వెల్లడించారు. శనివారం ఉదయం కూడా ఇదే విషయంపై బాధిత విద్యార్థిని తనను కలిసి మాట్లాడిందన్నారు. మరోవైపు ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు హెచ్‌వోడీని అదుపులోకి తీసుకున్నారు. తాజా పరిణామాలతో కళాశాల క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.